శనివారం
30-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 339
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343

ఎస్ఐఆర్‌పై 1న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ:
బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి పెద్ద ఎత్తున వాదనలు, అభ్యంతరాలు దాఖలు అవుతున్నందున వాదనలు, అభ్యంతరాలు దాఖలుకు గడువు పొడిగించాలని కోరుతూ ఆర్జేడీ, మజ్లిస్ పార్టీలు దాఖలు చేసిన పిటిషన్లను సెప్టెంబర్ 1న విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. వాదనలు, అభ్యంతరాలు దాఖలు చేయడానికి గడువు సెప్టెంబర్ 1తో ముగియనుంది. ఈ విషయమై సోమవారం రాజకీయ పార్టీల దరఖాస్తులను విచారిస్తామని జస్టిస్

- మిగతా 2 లో

ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉర్జిత్

న్యూఢిల్లీ:
ఆర్‌బీఐ మాజీ గవర్నర్, ఆర్థిక వేత్త ఉర్జిత్ పటేల్‌ను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)కి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. కేంద్ర కేబినెట్‌కు చెందిన అపాయింట్స్ కమిటీ ఉర్జిత్ నియామకానికి అనుమతి ఇచ్చింది. ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో ఆయన భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఐఎంఎఫ్ విధానపరమైన నిర్ణయాలను ఎగ్జిక్యూటివ్ బోర్డు చూసుకుంటుంది. ఐఎంఎఫ్‌కు సేవలు అందించడం ఉర్జిత్ పటేల్‌కు ఇది

- మిగతా 2 లో

నేడు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ

విశాలాంధ్ర- హైదరాబాద్:
సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ శనివారం ఉదయం రవీంద్ర భారతిలో సీపీఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, దత్తాత్రేయ, సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్.వి. రమణ, బీఆర్ఎస్ నేత కేటీఆర్ తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కూనంనేని విజ్ఞప్తి చేశారు.

ఇదీ లోకం!

నేటి నుంచి అసెంబ్లీ

విశాలాంధ్ర-హైదరాబాద్ :
తెలంగాణ రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలు శనివారం ప్రారంభమవుతున్నట్లు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. గత సమావేశాలు సజావుగా జరగడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసు శాఖ, శాసనసభ అధికారులు, సిబ్బంది అందరికీ ధన్యవాదాలు చెప్పారు. శాసన సభ, శాసన మండలి సమావేశాల నేపథ్యంలో నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం శాసన సభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో ముందస్తు సమావేశాన్ని స్పీకర్ ప్రసాద్ కుమార్, శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి.నరసింహాచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌టెన్షన్ పొందిన చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావుకి స్పీకర్, చైర్మన్, డిప్యూటీ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలని సూచించారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని ఆదేశించారు. శాఖలకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూ మంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలన్నారు. ఈ సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరపున చర్యలు తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం

- మిగతా 2 లో

దేశ భవిష్యత్తు కోసం
సుదర్శన్‌రెడ్డిని గెలిపించండి

ఎంపీలకు వామపక్షాల విజ్ఞప్తి

న్యూఢిల్లీ:
త్వరలో జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటన బలపర్చిన అభ్యర్థి విశ్రాంత సుప్రీం కోర్టు జడ్జి బి.సుదర్శన్‌రెడ్డికి వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్), ఏఐఎఫ్‌బి, ఆర్ఎస్‌పీ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఉపరాష్ట్రపతి ఎన్నిక కేవలం సంఖ్యల గురించి కాదు. ఇది భారతదేశ భవిష్యత్తుపై రెండు ప్రాథమికంగా భిన్నమైన దృక్పథాల మధ్య పోటీని సూచిస్తుందని వామపక్షాలు పేర్కొన్నాయి. మన సమకాలీన సంస్కృతిని కాపాడుకోవడానికి ఉపరాష్ట్రపతి, ఎన్నికల సంఘం, గవర్నర్లు వంటి రాజ్యాంగ పదవులను దుర్వినియోగం చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి, నిరంకుశత్వాన్ని అమలు చేయడానికి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరోధించడానికి ఇది ఒక యుద్ధమని అభివర్ణించాయి. 'వామపక్షాలుగా మేము, అన్ని ప్రతిపక్ష పార్టీల తరపున ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తున్నాము. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఒక ప్రముఖ న్యాయనిపుణుడే కాక భారత రాజ్యాంగ ప్రధాన విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం పట్ల అచంచల నిబద్ధత గలవారు' అని ప్రకటించాయి. ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే వారంతా దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి వారు తీసుకున్న ప్రమాణాన్ని గుర్తుచేసుకోవడం ద్వారా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అనుకూలంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశాయి.

ఎంపీలందరికీ లేఖ రాస్తా: సుదర్శన్‌రెడ్డి

ముంబై: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాల్సిందిగా కోరుతూ ఎంపీలందరికీ లేఖ రాస్తానని ఇండియా ఐక్యసంఘటన ఉపరాష్ట్రపతి అభ్యర్థి బీ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ముంబైలో శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్‌సిపి (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్‌లను కలిశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఉపరాష్ట్రపతి ఎన్నికలకు తన

- మిగతా 2 లో

మెరుగైన బోధన సాగాలి

- విద్యార్థులు, బోధనా సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి
- ఒకే విభాగం పరిధిలోకి విద్యా శాఖ నిర్మాణాలు
- ప్రతి విద్యా సంస్థలో క్రీడలకు ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్ :
పాఠశాలలు మొదలు విశ్వ విద్యాలయాల వరకు ప్రతి విద్యా సంస్థలోనూ మెరుగైన బోధన సాగాలని... నాణ్యత ప్రమాణాలను మరింతగా పెంచాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రొఫెషనల్ కోర్సులు బోధించే కళాశాలల్లో విద్యార్థులు, బోధనా సిబ్బందికి ఫేషియల్ రికగ్నేషన్ తప్పనిసరి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరు శాతం మెరుగవడంతో పాటు ప్రొఫెషనల్ విద్యా సంస్థల్లో లోటుపాట్లను అరికట్టవచ్చన్నారు. విద్యా శాఖపై ఐసీసీసీలో సీఎం రేవంత్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యా శాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ నిర్మాణాల నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనానికి గానూ ఒకే విభాగం కింద ఉండాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ కిందనే రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల నిర్మాణాలు కొనసాగాలని సీఎం ఆదేశించారు. ఈ సంస్థకు అవసరమైన ఇంజనీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి వెంటనే డిప్యుటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపును గ్రీన్ ఛానల్‌లో చేపట్టాలని, ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దని సీఎం అన్నారు. తెలంగాణలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలని, కంటైనర్లపైన సోలార్ ప్యానెళ్లతో అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చని సీఎం తెలిపారు. ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి

- మిగతా 2 లో

జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ
'సంక్షేమం'పై ప్రతికూల ప్రభావం

రాష్ట్ర ఆదాయాలు పరిరక్షించేలా పరిహార విధానం ఉండాలి

తెలంగాణ నిష్పత్తి క్రమంగా తగ్గుదల: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ :
కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణకు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ... సంక్షేమ పథకాలపై చూపే ప్రతికూల ప్రభావం వల్ల జరిగే నష్టంపైనే తీవ్రమైన ఆందోళనగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. న్యూఢిల్లీలోని కర్నాటక భవన్‌లో ఆ రాష్ట్ర ప్రభుత్వ అధ్వర్యంలో శుక్రవారం "జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై వివిధ రాష్ట్రాల సంప్రదింపుల సమావేశం" జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... 15 కీలక అంశాలను ప్రస్తావించారు. బహుళ పార్టీ వ్యవస్థ కలిగిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతి రాష్ట్రం ముఖ్యమైనదని స్పష్టం చేశారు. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, కేంద్రం నేరుగా లేదా కౌన్సిల్ ద్వారా రాష్ట్రాలను సంప్రదించేదని, దురదృష్టవశాత్తు రేటు హేతుబద్ధీకరణ ప్రకటన ఏకపక్షంగా జరిగిందని పేర్కొన్నారు. సరైన పన్ను విధింపు రాష్ట్రాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఐదేళ్ల కాలంలో జీఎస్టీ ద్వారా ఆదాయాలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేశారని, తద్వారా పరిహార సెస్సును నిలిపివేయవచ్చన్నారు. తెలంగాణ జీఎస్టీ ఆదాయం 2024-25 వరకు మాత్రమే 10 శాతం సీఏజీఆర్ సాధించిందని, ఇది వ్యాట్‌లో 18 శాతం ఉందన్నారు. స్వేచ్ఛతో వ్యాట్‌ను కొనసాగించి ఉంటే... ఆదాయం రూ.69,373 కోట్లు ఉండేదన్నారు. జీఎస్టీ ద్వారా రూ.42,443 కోట్లు మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర సొంత పన్ను ఆదాయంలో జీఎస్టీ వసూళ్లు 39

- మిగతా 2 లో

నిండా ముంచిన వాన

మెతుకు సీమకు అపార నష్టం

- ధ్వంసమైన రహదారులు
- కొట్టుకుపోయిన వంతెనలు
- ఇంకా జల దిగ్బంధంలోనే దూప్ సింగ్ తండా
- 2 లక్షలకు పైగా ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

విశాలాంధ్ర బ్యూరో-మెదక్:
తెలంగాణా వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలు అపార నష్టం కలిగించాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోయాయి. అనేక ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెతుకుసీమ అతలాకుతలమయింది. మెదక్ జిల్లాలో ప్రధానంగా మెదక్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో తీవ్ర స్థాయిలో రహదారులు ధ్వంసమవగా, వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. కాజ్ వే లు దెబ్బతిన్నాయి. గురువారం రాత్రి కురిసిన కుండపోత వానకు మెదక్ పట్టణంలోని అనేక కాలనీలు నీట మునిగాయి. జిల్లా కేంద్రం మెదక్‌లో 24 గంటల్లో అత్యధికంగా 11 సెంటీమీటర్ల వర్షం కురిసింది. హవేలి ఘనపూర్ మండలంలోని రాజ్ పేట గ్రామానికి చెందిన వరదలో కొట్టుకుపోయిన బెస్త సత్యనారాయణ, ఆటో డ్రైవర్ యాదాగౌడ్ మృతి చెందారు. వారి మృతదేహాలు లభ్యమయ్యాయి.

కొట్టుకుపోయిన రోడ్డు... నిలిచిన అంతర్రాష్ట్ర రాకపోకలు

మెదక్ జిల్లా సరిహద్దులోని పోచారం ప్రాజెక్టు వద్ద గండి పడటంతో భారీ వరదకు రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇవతలి వారిని అవతలి ఒడ్డుకు చేర్చేందుకు సైనిక బృందం చేసిన ప్రయత్నం విఫలం కావడంతో వారిని పునరావాస కేంద్రానికి తరలించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మండలంలోని దూప్ సింగ్ తండాకు రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా తండా ఇంకా నీటిలోనే ఉంది. మెదక్ మండలంలో అనేక చోట్ల రోడ్లు తెగిపోవడంతో 8 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సింగూరు నుంచి 60 వేల క్యూసెక్కుల నీరు వదలడంతో మంజీర పరవళ్లు తొక్కుతోంది. మెదక్ జిల్లాలో రెండు రోజుల్లో కురిసిన వర్షానికి సుమారు 14 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు.15 వేల మంది రైతులున్నారు. ఇందులో 12 వేల ఎకరాలు అత్యధికంగా వరి పంట నీట మునగడం, ఇసుక మేటలు పెట్టి నష్టం వాటిల్లింది. పత్తి, ఇతర పంటలకు 2 వేల ఎకరాల్లో నష్టం జరిగింది. 63 చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయి. విద్యుత్ శాఖకు రూ.10 కోట్ల నష్టం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, స్తంభాలు దెబ్బతిన్నాయి. ఇందులో పిల్లికోటాల్ సబ్ స్టేషన్‌కు రూ.3 కోట్ల మేర నష్టం వాటిల్లింది. వర్షం కారణంగా వందలాది ఇళ్లు కూలాయి. నష్టానికి సంబంధించి ఆయా ఇంజనీరింగ్, ఇతర

- మిగతా 2 లో

రోగులకు నాణ్యమైన వైద్యం

ప్రభుత్వ ఆసుపత్రి అనారోగ్య పీడితులకు ప్రాధాన్యం

డ్యూటీ డాక్టర్లు, ఆర్ఎంవోలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: మంత్రి రాజనర్సింహ

విశాలాంధ్ర - హైదరాబాద్:
అత్యవసర పరిస్థితుల్లో నిమ్స్‌కు వస్తున్న రోగుల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. వీలైనంత త్వరగా రోగులను చేర్చుకుని నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. నిమ్స్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై మంత్రి ... ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్షించారు. అత్యవసర వార్డులో అవసరమైన చికిత్స అందించి, సంబంధిత వార్డుకు రోగులను తరలించాలన్నారు. స్పందించిన నిమ్స్

- మిగతా 2 లో

ప్రతి నెలా రూ.7 వేల కోట్ల వడ్డీ చెల్లింపు అబద్ధం

కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ దుష్ప్రచారం: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ :
తెలంగాణలో ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. గత కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బయటపెడుతూ వివిధ విషయాలను ఆయన ట్విట్టర్ వేదికగా శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రం ప్రతి నెలా రూ. ఏడువేల కోట్లు రుణం కింద వడ్డీ చెల్లిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... మంత్రులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ఈ వాదన తప్పని తేల్చిందని స్పష్టం చేశారు. వాస్తవానికి, గత నాలుగు నెలల్లో సగటు నెలవారీ వడ్డీ చెల్లింపు కేవలం రూ.2,300 కోట్లు మాత్రమేనని (4 నెలల్లో రూ.9,355 కోట్లు) పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర రుణ భారాన్ని ఎక్కువ చేసి చూపిస్తుందని ధ్వజమెత్తారు. దుష్ప్రచారాన్ని ఆపి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజల జీవనం స్తంభించిపోయిందని, కానీ ముఖ్యమంత్రి మాత్రం ప్రజల కష్టాలను పట్టించుకోకుండా విలాసవంతమైన, లాభదాయకమైన ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు.

క్రీడాకారులను గౌరవించుకోవాలి

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ జయంతిని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆటలు మనకు సహకారం, పోరాట స్ఫూర్తిని నేర్పిస్తాయని అన్నారు. కష్టాలను అధిగమించి మనకు స్ఫూర్తినిచ్చిన అద్భుతమైన క్రీడాకారులను మనం గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు.

థాయ్ ప్రధాని షినవత్రాకు షాక్

పదవి నుంచి తొలగిస్తూ రాజ్యాంగ కోర్టు సంచలన తీర్పు

2లో

థాయ్ ప్రధాని షినవత్రాకు షాక్

పదవి నుంచి తొలగిస్తూ రాజ్యాంగ కోర్టు సంచలన తీర్పు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ప్రధాని పెటంగటార్న్ షినవత్రా కు గట్టి షాక్ తగిలింది. ఆ దేశ రాజ్యాంగ కోర్టు ఆమెను పదవినుంచి తొలగిస్తూ శుక్రవారం సంచలన వెలువరించింది. పొరుగుదేశం కంబోడియా ప్రధానితో జరిపిన ఫోన్ సంభాషణపై షినవత్రాపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన సస్పెండ్ చేస్తూ ఇటీవలే తీర్పు చెప్పింది. తాజాగా ఆమెను పదవి నుంచి తొలగిస్తూ తీర్పునిచ్చింది. ఆమె నియమాలను ఉల్లంఘించారని, రాజ్యాంగం ప్రకారం ప్రధాన మంత్రి పదవికి అనర్హురాలని పేర్కొంది. ఓ ఫోన్ సంభాషణలో కంబోడియా మాజీ అధినేత హున్‌సేన్‌ను 'అంకుల్' అని సంబోధించిన షినవత్రా... తమ దేశ సైనిక కమాండర్‌ను తన విరోధి అని పేర్కొనడం వివాదానికి దారితీసింది. దేశ సరిహద్దుల్లో కంబోడియాతో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో స్వయంగా ప్రధాని తమ దేశ సైనిక కమాండర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. దీనిపై గత నెల విచారణ చేపట్టిన కోర్టు.. కంబోడియాతో జరిగిన దౌత్య వ్యవహారంలో ప్రధానమంత్రిగా నైతికతను ఉల్లంఘించారని చెప్పడానికి తగిన ఆధారాలున్నాయని స్పష్టం చేసింది. నైతిక ఉల్లంఘనలకు పాల్పడిన 62 ఏండ్ల ప్రధాని స్రెట్టా థావిసిన్ పదవి నుంచి దిగిపోయిన తర్వాత ప్రధాని బాధ్యతల నుంచి సస్పెండ్ అయిన రెండో వ్యక్తిగా షినవత్రా నిలిచారు. షినవత్రాను పదవినుంచి తొలగించడంతో, ఇప్పుడు థాయ్ పార్లమెంట్ కొత్త నాయకుడిని ఎన్నుకోవాల్సి ఉంది. అయితే షినవత్రాకు చెందిన ఫ్యూథాయ్ పార్టీకి పార్లమెంటులో స్వల్ప మెజారిటీ మాత్రమే ఉండటంతో ఈ ప్రక్రియ అంత సులువుగా ముగిసేలా కనిపించడం లేదు. కొత్త ప్రధాని ఎన్నిక పూర్తయ్యే వరకు ఉప ప్రధాని ఫుమ్తామ్ వెచైచాయ్ తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ప్రస్తుతానికి ప్రధాని పదవి రేసులో ఫ్యూథాయ్ పార్టీకే చెందిన 77 ఏళ్ల చైకాసెం నితిసిరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు మాజీ ప్రధాని, సైనిక నేత ప్రయుత్ చాన్-ఓచా కూడా పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏడాది క్రితం ఇలాగే రాజ్యాంగ న్యాయస్థానం నాటి ప్రధానిని తొలగించడంతో అనూహ్యంగా ప్రధాని అయిన షినవత్రా, ఇప్పుడు అదే తరహాలో పదవిని కోల్పోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

భారత్, చైనా, బ్రెజిల్ వల్లే ఉక్రెయిన్‌పై రష్యా దాడులు

రిపబ్లికన్ పార్టీ సెనేటర్ లిండ్సే

వాషింగ్టన్: రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలపై అమెరికా రిపబ్లికన్ పార్టీకి చెందిన సీనియర్ సెనేటర్ లిండ్సే గ్రాహం మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ దేశాల చర్యల వల్లే ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధం కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు మద్దతు ఇస్తున్నందుకు భారత్ ఇప్పటికే మూల్యం చెల్లించుకుంటోందని, ఇతర దేశాలకు కూడా త్వరలోనే ఇదే గతి పడుతుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. గురువారం ఉక్రెయిన్‌లోని కీవ్ నగరంపై రష్యా జరిపిన భీకర దాడిలో 23 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన జరిగిన వెంటనే లిండ్సే గ్రాహం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "రష్యా నుంచి చౌకగా చమురు కొనుగోలు చేస్తూ పుతిన్ యుద్ధానికి ఊతమిస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలకు ఇప్పుడెలా అనిపిస్తోంది? మీ కొనుగోళ్ల వల్లే పిల్లలతో సహా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. పుతిన్‌కు మద్దతిచ్చినందుకు భారత్ ఇప్పటికే మూల్యం చెల్లిస్తోంది. మిగతా దేశాలకు కూడా త్వరలోనే ఇదే గతి పడుతుంది" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

అవసరమైతే అధ్యక్ష బాధ్యతలు చేపడతా: వాన్స్

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఏదైనా ఊహించని పరిస్థితి తలెత్తితే తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై ఊహాగానాలు వ్యక్తమవుతుండగా...వాన్స్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. యూఎస్ఏ టుడేతో మాట్లాడిన జేడీ వాన్స్.. ట్రంప్ ఆరోగ్యంపై మాట్లాడారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంపై ఇటీవల వచ్చిన వార్తలు అమెరికా ప్రజల్లో ఆందోళన రేకెత్తించినమాట నిజమే కానీ అందులో వాస్తవం లేదు. ట్రంప్ ప్రస్తుతం ఆరోగ్యంగా, చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆయన ఆరోగ్యం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు భయంకరమైన విషాదాలు చోటు చేసుకుంటున్నాయి. కానీ, వాటన్నింటినీ దాటుకొని తన పదవీ కాలాన్ని ట్రంప్ పూర్తి చేస్తారని ఆశిస్తున్నా. అమెరికా ప్రజలకు ఇంకా గొప్ప పనులు చేస్తారన్న నమ్మకం నాకు ఉంది. ఒకవేళ ఏదైనా ఊహించని పరిస్థితి తలెత్తితే అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జేడీ వాన్స్ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

యుద్ధప్రాంతంగా గాజా

మానవతా సాయం పంపిణీపై ఇజ్రాయిల్ నిషేధం

టెల్‌అవివ్: గాజా నగరాన్ని పూర్తిగా ఆక్రమించడానికి ఇజ్రాయిల్ సైన్యం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా గాజాను యుద్ధప్రాంతంగా ఇజ్రాయిల్ సైన్యం (ఐడీఎఫ్) ప్రకటించింది. నగరంలో మానవతా సహాయం పంపిణీని నిషేధించింది. ఈ చర్య ఇప్పటికే ఆకలితో అలమటిస్తున్న నగరంలోని వేలాది మంది ప్రజల ఇబ్బందులను మరింత పెంచనున్నది. గాజా నగరంలో సైనిక కార్యకలాపాలపై వ్యూహాత్మక నిషేధం ఇకపై వర్తించదని సైన్యం సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొంది. ఈ ప్రాంతాన్ని ప్రమాదకరమైన యుద్ధ ప్రాంతంగా ప్రకటించింది. గాజా నగరం మినహా మిగిలిన ప్రాంతంలో స్థానిక వ్యూహాత్మక బ్లాక్‌లు అమలులో ఉంటాయని ఐడీఎఫ్ తెలిపింది. ఇజ్రాయిల్ పౌరులను రక్షించడానికి గాజాలోని ఉగ్రవాద గ్రూపులపై వారు దాడులు నిర్వహిస్తారని ఐడీఎఫ్ తెలిపింది. గాజాలోని పదిలక్షల మంది జనాభాలో సగం మంది ఆశ్రయం పొందారు. గ్లోబల్ హంగర్ మానిటర్... గాజా నగరంతో పాటు పరిసర ప్రాంతాలు ఇప్పుడు అధికారికంగా కరువును ఎదుర్కొంటున్నాయని తెలిపింది. మరింత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ సిస్టమ్ ప్రకారం.. 5,14,000 మంది ప్రజలు కరువుకు ప్రభావితమవుతున్నారు. ఈ సంఖ్య సెప్టెంబర్ చివరి నాటికి 6,41,000 మందికి పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. అయితే, ఇజ్రాయిల్ ఈ నివేదికను తోసిపుచ్చింది. అంచనాలు తప్పని.. నివేదిక అంతా పక్షపాతంతో కూడుకున్నదని పేర్కొంది. సర్వే అసంపూర్ణ సమాచారాన్ని మాత్రమే తీసుకుందని ఇజ్రాయిల్ వాదిస్తోంది. ఇది ఎక్కువగా హమాస్ నుంచి వచ్చిందని.. ఇటీవల ఆహార ధాన్యాలు గాజాకు చేరుకున్నాయని అందులో ప్రస్తావించలేదని తెలిపింది.

సుదర్శన్‌రెడ్డిని గెలిపించండి

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ లేఖ రాస్తానని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా పనిచేయడానికి అవకాశం ఇస్తే...తాను రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని, దానిని కాపాడుతానని తెలిపారు. "నేను 52 ఏండ్లుగా రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి పోరాడుతున్నాను. రాజ్యాంగమే నా సందేశం. నా గురించి నేను చెప్పుకోవడానికి ఇంకేమీ లేదు"అన్నారు. సెప్టెంబర్ 9న జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ)మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను నామినేట్ చేసింది.

ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉర్జిత్

(మొదటిపేజీ తరువాయి)

రెండోసారి. 1996-1997 మధ్య ఆయన ఐఎంఎఫ్ తరపున ఆర్‌బీఐకి పనిచేశారు. రుణాలు, బ్యాంకింగ్ రంగ సంస్కరణలు, పెన్షన్ నిధుల అప్‌డేట్, విదేశీ మార్కెట్ గురించి ఆయన అనేక సలహాలు, సూచనలు చేశారు.

కాగా, ఉర్జిత్ పటేల్ 2016 నుంచి 2018 వరకు ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన ఆర్‌బీఐ గవర్నర్‌గా తన పదవీకాలం ముగియక ముందే రాజీనామా చేశారు. 2016, సెప్టెంబర్ 4వ తేదీన ఆయన ఆర్‌బీఐ 24వ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1998 నుంచి 2001 వరకు ఆర్థికశాఖలోని ఆర్థిక వ్యవహారాల శాఖకు కన్సల్టెంట్‌గా పనిచేశారు.

మెరుగైన బోధన సాగాలి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. అవసరమైతే కాంట్రాక్ట్ పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని బాలికలకు వివిధ అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చేందుకు మహిళా కౌన్సెలర్లను నియమించాలని సూచించారు. విద్యా రంగంపై పెడుతున్న ఖర్చును తాము ఖర్చుగా కాక పెట్టుబడిగా చూస్తున్నామని ఆయన తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ పాఠశాలలతో పాటు విద్యా రంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని సీఎం తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలే ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

కోటంరెడ్డి హత్యకు కుట్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర రాజకీయాలను కుదిపేసేలా ఓ ప్రజాప్రతినిధిపై హత్యకు సంబంధించిన కుట్ర కోణం బహిర్గతమైంది. నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హత్యకు భారీ కుట్ర జరిగిందన్న ప్రచారంతో అధికార పార్టీ ఉలిక్కిపడింది. ఈ కుట్రకు సంబంధించిన ఓ వీడియో వైరల్‌గా మారడంతో కూటమి ప్రభుత్వంతోపాటు పోలీసులు అప్రమత్తమయ్యారు. కూటమి పార్టీ నేతలు కోటంరెడ్డిని ఫోన్‌లో పరామర్శించి... జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. తనపై హత్యాయత్నం కుట్రపై ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడేందుకు నిరాకరించారు. ఆ వీడియో పోలీసులకు చిక్కడంతో నెల్లూరు ఎస్పీ శ్రీకాంత్ స్పందిస్తూ ఎమ్మెల్యే కోరితే అదనపు భద్రతా చర్యలు చేపడతామని వెల్లడించారు. గతంలో వైసీపీ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా కోటంరెడ్డి ఎన్నికయ్యారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక కోటంరెడ్డి మంత్రి పదవి ఆశించినా దక్కలేదు. అనంతరం ఆయన టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సహకారంతో తన సొంత నియోజకవర్గంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సమయంలో ఆయనపై హత్యకు కుట్ర జరిగిందన్న వార్తలు ఆయన అనుచరులను, పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేశాయి. అందుకు సాక్ష్యంగా సామాజిక మాధ్యమంలో వీడియో బయట పడటమే. ఎమ్మెల్యే కోటంరెడ్డిని చంపితే డబ్బే డబ్బు అంటూ వీడియోలో కొంతమంది మాట్లాడుకున్న విషయం వెలుగు చూసింది. కోటంరెడ్డిని చంపాలని ఐదుగురు రౌడీషీటర్లు పథకం వేసినట్లుగాను, లేడీడాన్ నిడిగుంట అరుణ ద్వారా రౌడీషీటర్లు అవిలేల శ్రీకాంత్, జగదీశ్ ఇంకా కొంతమంది వ్యూహం రచించినట్లుగా కోటంరెడ్డి వర్గీయులు గుర్తించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి వీడియోతోపాటు సాక్ష్యాలు సేకరించారు. వీడియో వచ్చిన వెంటనే స్పందించడంతో కోటంరెడ్డి ప్రాణాలకు ముప్పు తొలగిందని అంటున్నారు.

నిండా ముంచిన వాన

(మొదటిపేజీ తరువాయి)

శాఖల అధికారులు అంచనాలు రూపొందించారు. సుమారుగా రూ.వెయ్యి కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మెదక్ సబ్ జైలు గోడ భారీ వర్షానికి కూలింది. ఉదయం 4.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా గోడ కూలి పెద్ద శబ్దం వచ్చింది. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. 22 మంది ఖైదీలు ఉండగా... వారిని వెంటనే సంగారెడ్డి జైలుకు తరలించారు.

కామారెడ్డిలో దెబ్బతిన్న రహదారులు

కామారెడ్డి జిల్లాలో కురిసిన అతి భారీ వర్షాలతో చాలా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రోడ్లు, వంతెనలు, రైల్వే మార్గాలు నీట మునిగాయి. జాతీయ రహదారి 44తో పాటు అనేక రహదారులు తెగిపోవడంతో రవాణా పూర్తిగా స్థంభించింది. వేలాది మంది ప్రజలు ఇళ్లలో, హాస్టళ్లలో చిక్కుకుపోయారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. కొందరు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. పోచారం ప్రాజెక్టు వంటి పాత నిర్మాణాలు కూడా భారీ వరదను తట్టుకుని నిలబడటం కొంత ఉపశమనం కలిగించింది. భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని 44వ నంబరు జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్డు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. సుమారు గంటకు పైగా ఈ పరిస్థితి నెలకొంది. సదాశివనగర్ మండలం నుంచి బిక్కనూర్ టోల్‌గేట్ వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు బుధవారం, గురువారం కురిసిన వర్షాలకు టెక్రియాల్, సారంపల్లి వద్ద బ్రిడ్జి కోతకు గురైంది. మరోచోట రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో బుధవారం నుంచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గురువారం రాత్రి కూడా వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోవడంతో పరిస్థితిని ఎస్పీ రాజేశ్ చంద్ర పర్యవేక్షించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా రహదారులకు మరమ్మతులు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జల దిగ్బంధంలో ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం

మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సింగూర్ నుంచి ఉధృతంగా వరద రావడంతో వరదుర్గ ఆనకట్ట నుంచి 59 వేల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. ఆనకట్ట వైపు భక్తులు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు పహారా కాస్తున్నారు.

భారీ వర్షాలకు తెలంగాణలోని కామారెడ్డి, మెదక్ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం లింగంపల్లికి చెందిన యువకులు, చిన్నారులు గణపతి విగ్రహాన్ని కొనేందుకు హవేలి ఘన్‌పూర్ వస్తుండగా నక్కవాగు ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. తిరిగి వెళ్లే క్రమంలో పోచారం ప్రాజెక్టు వరదతో వంతెన తెగిపోవడంతో పోచంరాల్ గ్రామంలోనే మూడు రోజులుగా చిక్కుకుపోయారు. తిండీతిప్పలు లేకుండా ఇబ్బందులు పడుతుండటంతో సైనికాధికారులు వారిని స్వగ్రామాలకు తరలించేందుకు యత్నిస్తున్నారు.

ప్రాజెక్టులకు భారీగా వరద

జోరు వానలకు రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులు జల కళను సంతరించుకున్నాయి. శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 4,30,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. 39 ప్రధాన గేట్ల ద్వారా 5,04,455 నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 38 గేట్లు తెరిచి 6,79,019 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మూడు రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 1,63,043 క్యూసెక్కుల వరద వస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి 9,71,880 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో 85 గేట్లు ఎత్తి 9,71,880 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల దిగువన ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఉధృతంగా గోదావరి... ప్రాణహిత

కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక్కడ వరద మొదటి ప్రమాదకర హెచ్చరిక స్థాయిని దాటింది. కాళేశ్వరంలో జ్ఞాన సరస్వతి, పుష్కర ఘాట్ల మెట్ల పైనుంచి వరద ప్రవహిస్తోంది. గోదావరి పరివాహక సమీప గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. మహదేవపూర్ మండలంలో పంట భూముల్లోకి నీరు చేరింది. అన్నారం, చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, బలిజాపూర్ గోదావరి పరివాహక ప్రాంతాల్లోని వాగులు ఉప్పొంగడంతో వందల ఎకరాల పత్తి పంట నీట మునిగింది. రెండోసారి పత్తి పంట నష్టంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.తెలంగాణలో భారీ వర్షాల కారణంగా 270 మండలాలు, 2,463 గ్రామాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. వర్షాలతో వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. మొత్తం 2,20,443 ఎకరాల్లో పంటలు దెబ్బతినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లాల వారీగా పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు వెల్లడించారు. నివేదిక ప్రకారం... 1,09,626 ఎకరాల్లో వరి, 60,080 ఎకరాల్లో పత్తి, 6,751 ఎకరాల్లో సోయాబీన్, 639 ఎకరాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

తమిళనాట డీఎంకే కూటమిదే హవా

విజయ్ పార్టీతో ఎన్డీఏకు భారీ నష్టం

ఇండియా టుడే సీ ఓటర్ సర్వే

చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే కూటమికి తిరుగులేదని ఓ సర్వే పేర్కొంది. దీంతో ఏ పార్టీతో పొత్తు ఉండదని, సింహం ఎప్పటికీ సింహమేనని, సింగిల్‌గానే అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతామని చెబుతున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, ప్రముఖ నటుడు విజయ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి ప్రముఖ రాజకీయ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. తమిళనాడులో జరిగిన ఓ సర్వే వెల్లడించిన విషయాలు టీవీకే సహా అక్కడి రాజకీయ పక్షాలకు ఇబ్బందిగా మారాయి. తమిళనాడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే... డీఎంకే అత్యధిక సీట్లు కైవసనం చేసుకుంటుందని సర్వే తెలిపింది. ప్రతిపక్ష ఎన్డీయే కూటమికి మూడు సీట్లు దక్కవచ్చని, అదే సమయంలో విజయ్ టీవీకేకు ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదని ఆ సర్వే పేర్కొంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటన తమిళనాడులో అఖండ విజయం సాధించింది. మొత్తం 39 స్థానాలను 'ఇండియా' పార్టీలే గెలుచుకున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మాత్రం 36 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని సర్వే వెల్లడించింది. సంక్షేమ పథకాలతో పాటు హిందీ భాషా వ్యతిరేక ఉద్యమం, నీట్ పోరాటాలు

డీఎంకే గెలుపును ప్రభావితం చేసే అంశాలుగా వెల్లడించింది. బీజేపీ, అన్నాడీఎంకే(ఎన్డీయే) కూటమికి మూడు స్థానాలు మాత్రమే దక్కవచ్చని తెలిపింది. అయితే... ఓటు శాతం మాత్రం 18 శాతం నుంచి 37 శాతానికి పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. 2024లో ఈ కూటమికి ఒక్క సీటు కూడా రాలేదు. తమిళనాడులో రాబోయే కాలంలో జరిగే ఎన్నికలకు విజయ్ టీవీకే పార్టీ అదనపు ఆకర్షణగా నిలవబోతోంది. ఈ పార్టీ ఇప్పటిదాకా ఏ ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఒక్క స్థానం కూడా దక్కకపోవచ్చని ఆ సర్వే వెల్లడించింది. విజయ్ పార్టీ పెట్టి ఏడాది పైనే అవుతోంది. అయితే అందులో ముఖాలేవీ ప్రజలలకు పెద్దగా తెలిసినవి కావు. జనాలకు తెలిసిన ముఖాలు టీవీకేలో చేరేందుకు ప్రయత్నిస్తున్నా... విజయ్ అందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు జనాల్లోకి ఇంకా బలంగా ఆ పార్టీ చొచ్చుకుపోవాల్సిన అవసరం ఉంది. డీఎంకే వ్యతిరేకతను టీవీకే ఓట్ల రూపంలో మార్చుకోవాలని విజయ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఒకవేళ ఇప్పుడు ఎన్నికలు జరిగితే... టీవీకే పార్టీతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ చీలే అవకాశం ఉంది. ఇది పరోక్షంగా డీఎంకేకే లాభం కలగించవచ్చని సర్వే పేర్కొంది. తద్వారా టీవీకేతో ఎన్డీయే కూటమికే భారీ నష్టం కలగవచ్చని స్పష్టం చేసింది. ఇండియా టుడే సీవోటర్ మూడ్ ఆఫ్ ది నేషన్ ఆగస్టు 2025 పేరిట ఈ సర్వే నిర్వహించింది.

జులై 1 నుండి ఆగస్టు 14, 2025 మధ్య రెండు లక్షల మందికి పైగా ప్రజల అభిప్రాయాలను సేకరించి రూపొందించబడింది. సర్వే లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలో జరిగినప్పటికీ మరో ఏడెనిమిది నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు సైతం సమీకరణాలు ఇలాగే కొనసాగితే... డీఎంకే నెత్తిన విజయ్ పాలు పోసినట్లే అవుతుందన్న చర్చ జోరుగా నడుస్తోంది.

ఎస్ఐఆర్‌పై 1న సుప్రీం విచారణ

(మొదటిపేజీ తరువాయి)

సూర్యకాంత్, జోయ్‌మాల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఆర్జేడీ తరఫున హాజరైన న్యాయవాది షోయబ్ ఆలం, మజ్లిస్ తరఫున న్యాయవాది నిజాం పాషా మాట్లాడుతూ... ఎస్ఐఆర్ పెద్ద ఎత్తున క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు అవుతున్నందున సమయం పొడిగించాల్సిన అవసరం ఉందని అన్నారు. "దాఖలవుతున్న క్లెయిమ్‌ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. గడువును పొడిగించాల్సిన అవసరం ఉంది" అని ఆలం ధర్మాసనానికి తెలిపారు.ఆగస్టు 22 ఉత్తర్వులకు ముందు 80వేల క్లెయిమ్‌లు దాఖలు కాగా, ఆ ఉత్తర్వుల తర్వాత 95,000 క్లెయిమ్‌లు దాఖలయ్యాయని పాషా పేర్కొన్నారు. అయితే ఎన్నికల సంఘాన్ని ఎందుకు సంప్రదించలేదని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. వారు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవడం లేదని పాషా పేర్కొన్నారు.

నేటి నుంచి అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అలాగే భారీ వర్షాలు కురిసి కొన్ని మార్గాల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, ట్రాఫిక్ అధికారులు సమన్వయం చేసుకుని గౌరవ సభ్యులు సరైన సమయానికి సభకు చేరుకునే విధంగా సహకరించాలన్నారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలు జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలని, తద్వారా సమావేశాలు సజావుగా జరుగుతాయని అభిప్రాయపడ్డారు. కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. అవసరమైన నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పంపించాలన్నారు. తెలంగాణ పోలీసు దేశంలోనే సమర్థవంతమైనదని, మంచి పేరు ఉందని, మీ అధ్వర్యంలో మండలి సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అవసరమైన అధికారులను అందుబాటులో ఉంచుతామని, సభ నిర్వహణకు ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగే విధంగా ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి రాయ రవి, డైరెక్టర్ (ప్రోటోకాల్) శివలింగయ్య, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, శాంతిభద్రత ఏడీజీ మహేష్ భగవత్, శాంతిభద్రతల అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం

(మొదటిపేజీ తరువాయి)

డైరెక్టర్ ... రోజుకు సుమారు వంద మంది రోగులు అత్యవసర చికిత్సకు వస్తున్నారని, ఇందులో సగం మందికిపైగా ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో చికిత్స పొంది, పరిస్థితి విషమించాక చివరి నిమిషంలో నిమ్స్‌కు వస్తున్నారని వెల్లడించారు. ఇలాంటి కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి వచ్చే వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ నుంచి వచ్చే రోగులకు సానుభూతితో వ్యవహరించి చికిత్స అందించాలన్నారు. చికిత్స మధ్యలో రోగులను డిశ్చార్జ్ చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల అత్యవసర విభాగాల నడుమ సమన్వయం ఉండాలన్నారు. రోగులను ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి తరలించే సమయంలో ఆ రోగితో అంబులెన్స్‌లో ఒక డాక్టర్‌ను పంపించాలని మంత్రి సూచించారు. రోగులను ఆసుపత్రిలో చేర్చుకునే విషయంలోను, రిఫరల్ విషయంలో డ్యూటీ డాక్టర్లు, ఆర్ఎంవోలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమ్స్‌లో ఈ ఏడాది తొలి ఏడు నెల్లలో (జనవరి నుంచి జులై) 5 లక్షల 44 వేల మందికి వైద్య సేవలు అందించామని బీరప్ప వివరించారు.

మెరుగైన వైద్య సేవలు అందుతుండడంతో, నిమ్స్‌కు వచ్చే పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఇప్పటికే వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కూడా చేశామని ఆయన వెల్లడించారు. హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ వాణి, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజారావు, డాక్టర్ వాణి పాల్గొన్నారు.

'సంక్షేమం'పై ప్రతికూల ప్రభావం

(మొదటిపేజీ తరువాయి)

శాతమే. అందువల్ల, జీఎస్టీ రేట్లలో ఏవైనా తగ్గింపులు ఉంటే... కేంద్ర ప్రభుత్వం కంటే రాష్ట్ర ఆదాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని వివరించారు. తెలంగాణ ఆదాయంలో 80 శాతం కంటే ఎక్కువ సంక్షేమానికి ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. విలాసవంతమైన వస్తువులపై సెస్ వాటా రాష్ట్రానికి వచ్చే జీఎస్టీలో 15 శాతం మాత్రమే అని వివరించారు. రాష్ట్రాలకు పన్ను విధించడంలో స్వేచ్ఛ లేనప్పుడు, అంతరాన్ని తగ్గించడానికి అదనపు ఆదాయానికి తగిన విధానాన్ని ప్రవేశపెట్టకపోతే ఆర్థిక భారం భారీగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రాల ఆదాయాలను రక్షించడం, రాష్ట్రాలు సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కొనసాగించేలా తగిన పరిహార విధానాన్ని రూపొందించాలని సూచించారు.

భట్టి మీడియాతో మాట్లాడుతూ... సెప్టెంబరు మూడో తేదీన తమిళనాడు భవన్‌లో ఇదే అంశంపై బ్రేక్‌ఫాస్ట్ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కీలక అంశాలపై చర్చించి... కేంద్రానికి నివేదిస్తామన్నారు. త్వరలోనే జరగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాలను లేవనెత్తుతామని స్పష్టం చేశారు. కేంద్రం జీఎస్టీ హేతుబద్ధీకరణ అంశంపై ఆలోచన చేసి... సరైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నామన్నారు. తెలంగాణలో సంభవించిన వరదలపై త్వరలోనే నివేదికను కేంద్రానికి సమర్పించి.. సాయం కోరతాం అని స్పష్టం చేశారు. కృష్ణ బైరేగౌడ (రెవెన్యూ మంత్రి-కర్నాటక), హర్పాల్ సింగ్ చీమా (ఆర్థిక మంత్రి- పంజాబ్), కె.ఎన్. బాలగోపాల్ (ఆర్థిక మంత్రి-కేరళ), రాధా కృష్ణ కిషోర్ (ఆర్థిక మంత్రి-జార్ఖండ్), తంగం తెన్నరసు (ఆర్థిక మంత్రి-తమిళనాడు), రాజేష్ ధర్మాని (సాంకేతిక విద్యా మంత్రి-హిమాచల్‌ప్రదేశ్), ఉజ్జయిని దత్తా (రెసిడెంట్ కమిషనర్-పశ్చిమ బెంగాల్) పాల్గొన్నారు.

అమిత్‌షాదే బాధ్యత: మహువా

న్యూఢిల్లీ: కేంద్రహోంమంత్రి అమిత్‌షాపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా విరుచుకుపడ్డారు. 'లక్షలాది మంది భారత్‌లో చొరబడుతున్నారు. మన భూమిని ఆక్రమించుకుంటున్నారు. భారత సరిహద్దులు రక్షించలేకపోతే, మహిళల గౌరవం దెబ్బతింటే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాల్సిందే. అందుకు అమిత్ షా తల నరికించి టేబుల్‌పై పెట్టాలి' అని మొయిత్రా వ్యాఖ్యానించారు. ఆమె బంగ్లాదేశ్ నుండి అక్రమంగా భారత్‌లోకి చొరబడుతున్న వలసదారుల విషయంపై మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షక కిట్లు పంపిణీ

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం/ కూసుమంచి : ప్రమాదాల నివారణ కొరకు కాటమయ్య రక్షక కిట్లను గీత కార్మికులు తప్పనిసరిగా వినియోగించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రి శుక్రవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి (80) మంది లబ్ధిదారులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు పూర్తి స్థాయిలో కాటమయ్య రక్షక కిట్లను అందించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా కుల వృత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నీటి వనరుల్లో చేప పిల్లల విడుదల, కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షక కిట్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈత చెట్లు ఎక్కే సమయంలో కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా సాంకేతికంగా, శాస్త్రీయంగా కాటమయ్య రక్షక కిట్లను తయారు చేయడం జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 80 మంది గౌడ సోదరులకు కాటమయ్య రక్షక కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్ రెడ్డి, కూసుమంచి మండల తహసీల్దార్ రవి కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

విశాలాంధ్ర - ఖమ్మం : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలకు వార్డుల వారిగా డ్రాఫ్ట్ ఫోటో ఎలక్టోరోల్ గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఈనెల 28న ప్రదర్శించామన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కార్యాచరణ చేశామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 30లోగా సంబంధిత ఎంపిడివోకు సమర్పించాలన్నారు. జిల్లాలో 571 గ్రామ పంచాయతీలకు గాను 5 వేల 214 వార్డులు ఉన్నట్లు, 8 లక్షల 2 వేల 690 ఓటర్లకు 5 వేల 214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జెడ్పి డిప్యూటీ సిఇఓ నాగపద్మజ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు స్వర్ణ సుబ్బారావు, పసుమర్తి శ్రీనివాస్, బహుజన సమాజ్ పార్టీ నుండి మిట్టపల్లి కిషోర్, వై.రాఘవరావు, సిపిఐ (ఎం) నుండి బండి రావెలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి ఏ.గోపాల్‌రావు, ఎస్. రాజయ్య, భారత రాష్ట్ర సమితి నుండి బి. తిరుమలరావు, బెల్లం వేణుగోపాల్, బంక మల్లయ్య, తెలుగుదేశం పార్టీ నుండి కె. కరుణాకర్, ఎం.లహరి, సీపీఐ నుండి ఎం. శ్రీనివాసరావు, ఎస్. నరసింహ రావు, సిపిఐ (ఎంఎల్) ప్రతినిధి ఝాన్సీ లక్ష్మి, అధికారులు, పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : ఆది కర్మ యోగి అభియాన్ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్, సంబంధిత విభాగాల అధికారులతో కలసి ఆయన ఆది కర్మయోగి అభియాన్ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో (18) మండలాలు (92) గ్రామ పంచాయతీ పరిధిలో గిరిజన అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకంలో భాగంగా ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్, పీఎం జనరల్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, యోజన రేషన్ కార్డు, సికిల్ సెల్ టెస్టులు రాయడం, చేయడం, వందరోజుల పని దినాలు, ముద్ర యోజన కింద లోన్స్, ఫారెస్ట్ రైట్ యాక్ట్, పైన విడుదల వారీగా అవగాహన కల్పించడం జరిగిందని, హెల్త్, న్యూట్రిషన్, అన్ని విభాగాలు సమన్వయంతో మద్దతు ఇస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి గణేష్, ట్రైబల్ వెల్ఫేర్ డిడి దేశీ రామ్ నాయక్, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవి రాథోడ్, డిస్టిక్ సివిల్ సప్లై అధికారి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - తుంగతుర్తి : కమ్మనైన అమ్మ భాష తెలుగు భాష అని అట్టి భాషను కనుమరుగు కాకుండా చూడవలసిన బాధ్యత ప్రతి తెలుగోడిపై ఉందని శ్రీ విద్యా భారతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ పందిరి మల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యా భారతి పాఠశాలలో తెలుగు భాషకు విశేష కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేరకు ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం ఈ సందర్భంగా తెలుగు భాషకు ఉన్న ఔన్నత్యాన్ని వివరించారు. దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు అని చెప్పిన చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా గత మెంతు ఘన కీర్తి కలవోడ అనే వేముల పెల్లి గీతం ఆలపించిన తెలుగువారి రోమాలు నిక్కబొడుచుకుంటాయన్నారు. దేశంలో 22 అధికార భాషలకు గుర్తింపు కలిగిన భాషలలో తెలుగు భాష ఒకటని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడైన సురేష్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వెంకట గోపాల్ లింగమూర్తి. రామచంద్రు ఈరోజీ అంబటి రమేష్. సరిత. అనిత. సునీత. రాధా. మున్ని స్వప్నతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రోన్ సహాయంతో మందులు పంపిణీ

విశాలాంధ్ర - తల్లాడ : ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులన్ని పొంగిపొర్లుతున్నాయి. బిల్లుపాడు, రామచంద్రాపురం, కొత్త వెంకటగిరి గ్రామాల మధ్య వాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కొందరికి అత్యవసర మందులు అవసరం కాగా, అదే సందర్భంలో గణేష్ ఉత్సవాల సందర్భంగా పూజా సామాగ్రి కూడా లేకపోవడంతో, డ్రోన్ సహాయంతో ఇటు మందులు అటు పూజా సామాగ్రిని పంపించి గ్రామస్తులకు అందజేశారు.

అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి సీతక్క శంకుస్థాపనలు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా 234 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల పనులు, గ్రామ పంచాయతీ భవనం, అంగన్వాడి కేంద్రం నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండలం జగ్గన్నపేట గ్రామంలో 35 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులు, 33/11 విద్యుత్ ఉపకేంద్రం, ఇంచర్ల గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం, వెంకటాపూర్ మండలం జవహర్ గ్రామంలోని మాడల్ పాఠశాలలో 4.5 లక్షల రూపాయలతో చేపట్టిన కిచెన్ షెడ్ నిర్మాణ పనులు, 12 లక్షల రూపాయలతో చేపట్టనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులను, గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో 45 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులు, దుంపిల్ల గూడెం గ్రామంలో 10 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను శంకుస్థాపన, పస్రా గ్రామంలో 55 లక్షల నిధులతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, కాలువలను, పస్రా గ్రామంలో ఓల్డ్ బోర్డ్రాయ్ నుండి ముత్యాలమ్మ ఆలయం వరకు 20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభోత్సవం, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవిచందర్‌లతో కలిసి శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలలో మంత్రి సీతక్క మాట్లాడుతూ చెక్ డ్యాముల నిర్మాణ పనులతో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తద్వారా పశువులకు మీరు లభ్యమవుతుందని అన్నారు. గ్రామాల్లోని మహిళలందరూ మహిళా సంఘాలలో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు అన్నగా నిలుస్తూ 60 సంవత్సరాలు దాటిన మహిళలు సైతం సంఘాలలో చేరడానికి అవకాశం కల్పించాలని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకున్న మహిళ గ్రూపుల అందరికీ ప్రభుత్వం వడ్డీ రుణాలను చెల్లించిం దని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చేసుకుంటున్న నిరుపేదలకు స్త్రీ శక్తి ద్వారా లక్ష రూపాయల రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని వివరించారు. 100 రోజుల ఈజీఎస్ పనులు పూర్తిచేసిన కూలీలను మంత్రి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ అజయ్, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి దేవ్‌రాజ్, ప్రజా ప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కోరారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం సూచన మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో, జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ ఓటరు జాబితా తయారి, ప్రచురణ, పోలింగ్ స్టేషన్ల వద్ద జాబితా ప్రచురణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 28వ తేదిన ఓటరు జాబితాను గ్రామ పంచాయతీలలో ప్రచురించడం జరిగిందని, జిల్లాలో 486 గ్రామ పంచాయతీలలో మొత్తం 6,94,819 మంది ఓటర్లు ఉన్నారని, 4388 వార్డులు ఉన్నాయని, 4403 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆగస్టు 30 సాయంత్రం లోపు ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఎంపిడిఓలకి తెలియజేయాలని అక్కడికక్కడే సవరించి సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని స్పష్టం చేశారు. జెడ్పి సీఈవో వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎల్పిఓ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుండి కొప్పుల వేణారెడ్డి, రాజేశ్వరరావు, ఆజాద్, బిజెపి పార్టీ నుండి హబీద్, క్రాంతి, సిపిఐ ఎం నుండి కోట గోపి, బి ఆర్ ఎస్ నుండి బడుగుల లింగయ్య యాదవ్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వై ఎస్ ఆర్ సి పి నుండి రమేష్, సి పి ఐ నుండి వెంకటేశ్వర్లు, సి పి ఐ ఎం ఎల్ నుండి న్యూ డెమోక్రసి డేవిడ్ కుమార్, ఎలక్షన్ డిటీ వేణు అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ గుంత

విశాలాంధ్ర - కోదాడ : కోదాడలో మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వలన డ్రైనేజీ వ్యవస్థ, కల్వర్టుల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉందనటంలో ఆశ్చర్యం లేదు. పట్టణంలో మినీ బైపాస్‌గా పిలువబడే టీచర్స్ కాలనీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్నటువంటి మురికి కాలువలో పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ఏరియాలో ఇలా ఉండటంతో వాహనదారులకు ఇబ్బంది కలిగి, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అస్కారం ఎక్కువగా ఉన్నది. ఈ మురికి కాలువపై సరైన కల్వర్టు నిర్మాణం చేయక పోవటంతో గుంత ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. మున్సిపాలిటీలో ఉన్నటువంటి శానిటరీ, ఇంజనీరింగ్ విభాగాల మధ్య సమన్వయ లోపం వలన ఇటువంటి సమస్యలు పరిష్కారం కావడం లేదనే వాదన బలంగా వినిపిస్తుంది. తక్షణమే కలెక్టర్ స్పందించి కాలువలో గుంతలు లేకుండా కల్వర్టు కట్టించి, ప్రజల భద్రతను కాపాడాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు. టీచర్స్ కాలనీలో ఉన్న సమస్య మా దృష్టికి వచ్చిందని, ఏం పనులు చేయాలన్నా అడిషనల్ కలెక్టర్ దగ్గర్నుంచి మంజూరు కావాల్సి ఉంటుందని, వారు రిటైర్మెంట్‌కి దగ్గరగా ఉండటంతో కొంత జాప్యం జరుగుతుందని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని కోదాడ మున్సిపాలిటీ కమిషనర్ రమాదేవి తెలిపారు.

ప్రజా సమస్యలపై అడిగితే అరెస్టు చేస్తారా...!

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని పలు సమస్యలపై కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు సిపిఐ ప్రతినిధి బృందం ప్రయత్నించగా కమిషనర్ పీఏ వారిని అడ్డుకున్నాడు. కార్పొరేషన్‌లో అంతా బాగానే ఉంది అంటూ సిపిఐ నాయకులతో వాగ్వాదానికి దిగాడు. దీంతో వారు కమిషనర్‌ని కలవకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు ఇదేం పద్ధతి అంటూ వారు వాదనకు దిగారు. సిపిఐ ప్రతినిధి బృందం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఏర్పడిన మంచినీటి సమస్య పరిష్కరించాలని వర్షాకాలం అయినందున మురుగు కాలువల్లో బ్లీచింగ్ వేయడంతో పాటు అంటూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ప్రముఖ స్వాతంత్ర యోధుడు ముద్దు మొహిద్దీన్ చిత్రపటాన్ని ఇటీవల తొలగించిన చోటే మళ్లీ చిత్రించాలని వినతి పత్రాన్ని కమిషనర్కు ఇచ్చేందుకు ప్రయత్నం చేశారు. వినతిపత్రం కమిషనర్కు ఇవ్వకుండా అడ్డుకోటమే గాక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సిపిఐ ప్రతినిధులను అరెస్టు చేసి స్టేషన్కు తీసుకువెళ్లారు. అరెస్ట్ అయిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం, యానాల సాంబశివరెడ్డి, త్రీ టౌన్ ఏరియా కార్యదర్శి నూనె. శశిధర్ ఉన్నారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ గొడవ ఏం జరిగిందని అడగకుండా బయటకు వచ్చి పోలీసు వాళ్ళతో అరెస్టు చేపించడం సిగ్గు చేటైన విషయమని ప్రజా సమస్యలపై మాట్లాడే వారిని అనిచివేస్తారా అసలు పిఏ ఎవరు మెమోరాండం చదవడానికి అని ప్రశ్నించారు. పిఏ నీ తొలగించాలని ప్రజలను స్వచ్ఛందంగా కమిషన్ కలవడం వల్ల ఇబ్బందులు చెప్పుకునే పరిస్థితిని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు జాల నరసింహారావు డి శేఖర్ నాయక్ ఎస్ కే మీరా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఇందిరమ్మ కాలనీ, అన్నపూర్ణ కాలనీ, కృష్ణనగర్, శ్రీనగర్ కాలనీ, మల్యాపూర్ ప్రశాంత్ నగర్ కాలనీ ప్రాంతాలలో 1 కోటి 97 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, సోషల్ మీడియా డివిజన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ కళాశాల వెల్ఫేర్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : మల్లంపల్లి మండల కేంద్రంలో గల ఎస్సీ వెల్ఫేర్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ను తక్షణమే సస్పెండ్ చేయాలి.యంఆర్పి ఎస్ ములుగు జిల్లా ఇన్చార్జి చాతాల్ల రమేష్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జాతీయ నేత దళితరత్న నెమలి నర్సయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి మల్లంపల్లి మండలకేంద్రం లోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాలలో జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు కొట్టిన విషయంపై, యంఆర్పిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కార్యాలయంలో కల్సి జరిగిన సంఘటన వివరాలతో పాటు, వెంటనే ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలని విన్నతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ముందు ఎమ్మార్పీఎస్ ములుగు జిల్లా ఇన్చార్జ్ చాతాల్ల రమేష్ మాదిగ, మాదిగ దండోరా జాతీయ నేత దళిత రత్న నెమలి నర్సయ్య మాదిగలు మాట్లాడుతూ ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ కళాశాలలో నిన్నటి రాత్రి ఆరు గంటల సమయంలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న సీనియర్ విద్యార్థులు ముగ్గురు, మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులను విచక్షణ లేకుండా కొట్టిన కళాశాల ప్రిన్సిపల్ వైస్ ప్రిన్సిపాల్, వార్డెన్ ఇతర ముఖ్య అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని, సస్పెండ్ చేయాలంటూ ములుగు జిల్లా కలెక్టర్ కోరమని తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి, శాఖాపరమైన చర్యలతో పాటు, సంబంధిత ఘటనకు సంబంధించిన ప్రిన్సిపాల్‌ను బదిలీ చేస్తానని స్పష్టమైన హామీ కలెక్టర్ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ ఏమాత్రం కాలయాపన జరిగినా యం ఆర్ పి ఎస్, విద్యార్థి సంఘాలు ప్రజా సంఘాలు, సామాజిక సంఘాలు, ప్రజాస్వామిక మేధావులతో జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యంఆర్పిఎస్, యంఎస్పి ములుగు మండల ఇన్చార్జి కల్లె పెల్లి రమేష్ మాదిగ, యం ఆర్ పి ఎస్ సీనియర్ నాయకులు వావిలాలస్వామి మాదిగ, రాష్ట్ర నాయకులు మంచోజు చంద్రమౌళి,మహాజన్. స్వేచ్ఛ జె ఎస్ సి జిల్లా అధ్యక్షులు కొండ గొర్ల రాజేష్. జిల్లా కార్యదర్శి కాడ పాక శ్యామ్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు మరాఠీ రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర - తొర్రూర్: ప్రజలకు సేవ చేయడంలో తొరూరు లయన్స్‌క్లబ్ ముందుంటుందని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామ నర్సయ్య, డాక్టర్ రాజేందర్రెడ్డిలు అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామనరసయ్య అధ్యక్షతన మండలంలోని అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు క్లబ్ సేవల్లో ముందుంటుందన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు గిడుగు వెంకట రామమూర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటామని తెలియజేశారు. జీఎంటి కో ఆర్డినేటర్ టి వెంకట్ రెడ్డి, ఆర్‌సి దామెర సరేష్, పి ఆర్ సి తమ్మెర విశ్వేశ్వరరావు, క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, స్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - గూడూరు: జిల్లాలోని గూడూరు మండలం హెడ్ క్వాటర్‌లో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్చంద్ 120వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఎంపీడీవో ఆఫీసు నుండి అంబేద్కర్ బొమ్మ వరకు మండలంలోని పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, గత సంవత్సరం జాతీయ, రాష్ట్ర స్థాయి రాణించిన క్రీడాకారులను అతిథుల చేత ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈఓ రవికుమార్, ఎస్సై గిరిధర్ రెడ్డి, పాపయ్య మండల ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ వెంకన్న, పిడిలు పి. వెంకటేశ్వరరావు, జి లక్ష్మి, జి వెంకటేశ్వర్లు, పుష్పనీలా, బిక్షపతి, ఎం ప్రవీణ్, పిఈటి, ఈసాల లక్ష్మయ్య టీచర్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - పినపాక: పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర రావు, ఎస్సై సురేష్ 50 కేజీల గంజాయి పట్టుకొని విచారణ అనంతరం ఐదుగురిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఒడిస్సా నుండి హైదరాబాద్‌కు 3కార్ల డిక్కిలలో రూ.25 లక్షల విలువ చేసే 50 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ముందు పల్సర్ బైకు పై ఎస్కార్ట్ గా ఒక వ్యక్తి వెళ్తుండగా వెనకాల కార్లు వచ్చేలా ప్లాన్ చేసుకొని వెళుతున్నట్లు ఇన్స్పెక్టర్ చెప్పారు. మండలంలోని పెంటన్నగూడెం ఎక్స్ రోడ్ వద్ద ఎస్సై సురేష్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా స్మగ్లర్లు పట్టుబడ్డారు. వారివద్ద నుంచి గంజాయితోపాటు 3 కార్లు, ఒక పల్సర్ బైక్, 8 ఫోన్లు, ఒక ల్యాప్ టాప్‌ను పట్టుకున్నామని చెప్పారు. పల్లెపు ప్రశాంత్ (కరీంనగర్), దాసరి వెంకటేశ్వర రావు (చంద్రుగొండ), మడకం రాజు (కుంట, చతిస్గడ్), కొండూరి వినయ్ (చింతకాని ఖమ్మం) తంబళ్ల పుల్లారావు, (చంద్రుగొండ) ఈ గంజాయి తరలిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు.

నూతన కలెక్టర్ కార్యాలయ భవనం జూన్‌లో పూర్తి చేస్తాం: మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్గొండ కొత్త కలెక్టర్ కార్యాలయ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌ను డిసెంబర్ లోగా, మొత్తం భవనాన్ని వచ్చే సంవత్సరం జూన్ 2 నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్ అండ్ బి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం అయన పాత కలెక్టర్ కార్యాలయం వెనకవైపు నిర్మిస్తున్న నూతన కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.82 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులతో నిర్మిస్తున్న ఈ భవనంలో పూర్తిగా రెవెన్యూ విభాగం, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ల ఛాంబర్లు, మంత్రి ఛాంబర్, ఉండేలా ఏర్పాటు చేయాలని, పాత కలెక్టర్ కార్యాలయంలో పూర్తిగా జిల్లాలోని అన్ని శాఖల అధిపతుల కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఇందుకుగాను పాత కలెక్టర్ కార్యాలయాన్ని పూర్తిగా ఆధునీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. కొత్త కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ హాల్‌ను ఫాల్ సీలింగ్, ఎల్ ఈ డి స్క్రీన్లు, అన్ని సౌకర్యాలతో నిర్మించాలని చెప్పారు. కొత్త కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ అంచనాలను ఎట్టి పరిస్థితులలో మార్చకూడదని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను డిసెంబర్ నాటికి పూర్తి చేసి ఇవ్వాలని, కార్యాలయ భవనం మొత్తాన్ని జూన్ 2 నాటికి పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవన నిర్మాణ పనులు, నాణ్యతపై ప్రత్యేక దృష్టి నిలపాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కోరారు. మంత్రి బ్రహ్మం గుట్ట, లతీఫ్ సాబ్ దర్గా గుట్టలపై నిర్మిస్తున్న ఘాట్ రోడ్ల నిర్మాణ పనులపై ఆర్ అండ్ బి అధికారులతో సమీక్షించారు. రెండు గుట్టలపై నిర్మిస్తున్న ఘాట్ రోడ్లకు సంబంధించి ఇప్పటివరకు 5 కిలోమీటర్ల రోడ్డు పూర్తయిందని ఆర్ అండ్ బి అధికారులు మంత్రికి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా ఘాట్ రోడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్ అండ్ బి సూపరింటిండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, నల్గొండ ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, కాంట్రాక్టర్ రామ్ ప్రసాద్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థానం సాధించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : తల్లిదండ్రుల త్యాగాలు, ఆశలు వృధా కాకుండా విద్యార్థులు అంకిత భావంతో కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. విద్యార్థుల చేతుల్లోనే ఉన్నత స్థాయికి చేరా అవకాశాలు వుంటాయన్నారు. శుక్రవారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన ఇంజనీరింగ్, బిఎస్సి మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రామచంద్ర, జియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత స్థాయికి చేరాలను ఎన్నో త్యాగాలు చేసాతారని గుర్తు చేసారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు సాధ్యమన్నారు. దేశం గర్వించే మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన, గటించిన రోజులు చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించి చేతులు దులుపుకుంటామన్నారు. కానీ ఆయన ఏ కళాశాల నుండి విద్యనభ్యసించారు, ఆయన గురువుల ప్రాముఖ్యత, ఎదుర్కొన్న సమస్యలు ఎవరికి తెలియవన్నారు. ఆయన 1861 లో కర్ణాటకలో జన్మించి ఇంజనీరింగ్‌లో ప్రతిభ కనబరిచి దేశానికే గర్వకారణ మైన అనేక ప్రాజెక్టులను రూపొందించారని కలెక్టర్ ఒక్కొక్కటిగా వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మన జిల్లాలో స్థాపించడానికి గల కారణం జిల్లాలో కోల్ మైన్స్, హెవీ వాటర్ ప్లాంట్, వేడి నీటి గుంతలు వంటి జియోలాజికల్ వైవిధ్యం ఉండటం వల్ల ఈ యూనివర్సిటీ ఇక్కడ స్థాపించడం జరిగిందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాము, కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విభిన్న వర్గాల మధ్య ఐక్యతకు గణేష్ ఉత్సవాలు వేదిక

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : పరస్పర కులమతాల ఐక్యత, సోదర భావం తోపాటు సమాజసేవ కలగలిపిన ఉత్సవాల ద్వారా ప్రజల మధ్య ఐకమత్యం పెరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని 30వ వార్డు దుర్గన్ బస్తీలో గణేష్ నవరాత్రుల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన, అన్నప్రసాద కార్యక్రమాన్ని శుక్రవారం అయన ప్రారంభించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. సమాజంలో బలహీన వర్గాల ప్రజలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చాలా అవసరమన్నారు. ఇది కేవలం భక్తి కార్యక్రమమే కాకుండా పేదవర్గాలకు తోడ్పాటు అందించే సత్కార్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, మాజీ కౌన్సిలర్లు నేరెళ్ల సమైక్య, ఎండి. యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణాచారి, సిపిఐ పట్టణ నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, నాయకులూ సుధాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యం

విశాలాంధ్ర - బూర్గంపాడు : ఏ ప్రభుత్వాలు ఏర్పడ్డ ప్రజలకు చేసింది ఏమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సాధ్యమ ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర రావు అన్నారు. గత పదేళ్ల తెలంగాణ సెంటిమెంట్ తొ గెలిచి పాలించిన కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేయక పోగా రాష్ట్రాన్ని అప్పులతో దివాళా తీయించారని విమర్శించారు. సారపాక గ్రామంలో రూ. 85 లక్షల వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పినపాక ఎమ్మెల్యే పాయం శుక్రవారం ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. పినపాక నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీలో మట్టి రోడ్డు కనిపించకుండా అభివృద్ధి చేసి ప్రజలకు మంచి రహదారులు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల పట్ల ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.

గోదావరి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

విశాలాంధ్ర - భద్రాచలం : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి ఉప్పొంగుతుంది. శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం 43 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం 9,32,288 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో గోదావరిలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు, సంబంధిత అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితులను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే అంతకు ముందే ఇచ్చిన కంట్రోల్ రూమ్ అధకారులు, కార్యాలయాల నంబర్లకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా ప్రజలు సంప్రదించాలని కోరారు. రక్షణ చర్యల్లో సహకరించాలని, అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

సంపాదకీయం

మోహన్ భగవత్ అసత్య భాషణం

స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట మీంచి ప్రధానమంత్రి మోదీ చెప్పినట్టు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్వచ్ఛంద సంస్థ అవునో కాదో ఎంతైనా చర్చించుకోవచ్చు. ఆర్ఎస్ఎస్ ఉద్భవించి వందేళ్లయింది. ఈ సందర్భంగా ఆ సంస్థ దేశంలోని వివిధ ప్రాంతాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దిల్లీలో మూడు రోజులపాటు వందేళ్ల ఆర్ఎస్ఎస్‌పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. మంగళవారం ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ప్రసంగించారు. మోహన్ భగవత్ చాలా మృదువుగా మాట్లాడినట్టు కనిపిస్తారు. ఎప్పుడూ గొంతు చించుకుని మాట్లాడరు. కానీ చెప్పవలసిన మాటలు సూటిగా కాకపోయినా నర్మ గర్భంగానైనా చెప్తూనే ఉంటారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లయిన సందర్భంగా మోహన్ భగవత్ చెప్పిన మాటలకు సహజంగానే ప్రాధాన్యత ఉంటుంది. ఎందుకంటే ఇలాంటి ప్రత్యేక సందర్భాలలో ఏ సంస్థ అధిపతి అయినా ఆ సంస్థ కార్యకలాపాలను వివరించడంతో పాటు తమ సిద్ధాంత ప్రాతిపదికను కూడా వివరిస్తూ ఉంటారు. ఆర్ఎస్ఎస్ రాజకీయ సంస్థ కాదన్న వాదన నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ప్రస్తుతం మోదీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆర్ఎస్ఎస్‌కు అనుబంధ సంస్థే. ఒక రాజకీయ పార్టీకి అనుబంధంగా సంఘాలు ఉంటాయి. కానీ బీజేపీ ఒక సంఘానికి అనుబంధంగా ఉన్న రాజకీయ పార్టీ. అధికారంలో ఉన్న వ్యక్తులతో సంబంధం లేకుండా వారెవరైనా ఆర్ఎస్ఎస్. నిర్దేశాల మేరకు పని చేయాల్సిందే. మోదీ చాలా శక్తిమంతమైన నాయకుడిగా కనిపించినా చివరకు ఆయన అమలు చేస్తున్నది కూడా ఆర్ఎస్ఎస్ కార్యక్రమాన్నే. ప్రచారం చేస్తున్నది ఆర్ఎస్ఎస్ భావజాలాన్నే. అంటే ప్రత్యక్షంగా కాకపోయినా సంఘ్ పరివార్ అధికారంలో ఉన్నట్టు లెక్క. దేశంలో ప్రస్తుతం అత్యంత శక్తిమంతులైన నాయకులు ముగ్గురు ఉన్నారంటున్నారు. నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మోహన్ భగవత్ శక్తిమంత త్రయం. అందువల్ల మోహన్ భగవత్‌ను కేవలం ఆర్ఎస్ఎస్ అధినేతగా కొట్టి పారేయడానికి వీలులేదు. మోదీ సర్కారుకు ఆయన ప్రధాన చోదక శక్తి. ఆర్ఎస్ఎస్ వందేళ్ల సమ్రంభం సందర్భంగా మోహన్ భగవత్ ప్రసంగ ప్రభావం మన సమాజం మీద ఉంటుంది. ఒక రకంగా అది మన భవిష్యత్ దర్శనం కూడా. మోహన్ భగవత్ ఆ ప్రసంగంలో దొర్లించిన మాటలు అక్షర సత్యాలు అన్న భ్రమ ఎవరికీ ఉండనక్కర్లేదు. కానీ ఆర్ఎస్ఎస్ అంతిమ లక్ష్యమైన హిందూ రాష్ట్ర ఏర్పాటు సంకల్పాన్ని భగవత్ చాలా గట్టిగానే పునరుద్ఘాటించారు. అయితే ఆర్ఎస్ఎస్ స్వభావాన్ని వివరించడంలో ఆయన అనేక అసత్యాలు పలికారు. ఆర్ఎస్ఎస్ సమభావంగల సంస్థ అని చెప్పుకున్నారు. ఆర్ఎస్ఎస్‌లో లేనిదే అది. ఆర్ఎస్ఎస్ స్త్రీ, పురుష వివక్షను బాహాటంగా ప్రదర్శించే సంస్థ. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలో మహిళలు ఎన్నడూ కన్పించరు. మహిళల కోసం ఆర్ఎస్ఎస్ ఇతర సంస్థలను నడుపుతూ ఉండొచ్చు. కానీ సంఘ్ పరివార్‌లో ప్రధాన వ్యవస్థ అయిన ఆర్ఎస్ఎస్‌లో మహిళలకు చోటు లేదు. మోహన్ భగవత్ మాటల్లో ఎంత అసత్యం ఉందో చెప్పడానికి ఈ ఒక్క అంశం చాలు. ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న మహిళలు చాలా మందే ఉండొచ్చు. అది వేరే విషయం. మోహన్ భగవత్ ప్రసంగంలో అనేక ప్రవచనాలు కనిపిస్తాయి. కానీ ఆర్ఎస్ఎస్. ఆ ప్రవచనాలను ఎన్నడూ పాటించదు. హిందూ మతాన్ని అవలంబించే వారే కాకుండా దేశంలో భిన్న ఆరాధనా పద్ధతులు అనుసరించే వారు అనేక మంది ఉన్నారనీ వారందరూ భారతీయులేనని మోహన్ భగవత్ పాత పాటే మళ్లీ ఎత్తుకున్నారు. భిన్న ఆరాధనా పద్ధతులు అనుసరించే వారితో ఘర్షణ పడకూడదని ఆయన మరో ప్రవచనం చెప్పారు. ఇస్లాం, క్రైస్తవం లాంటి మతాల ఆరాధనా పద్ధతులతో ఘర్షణ పడవలసిన అవసరం లేదన్నారు. మసీదు కింద, చర్చి కింద శివలింగాలకోసం అన్వేషించవలసిన అవసరం లేదని కూడా ఆయన చెప్పారు. మోహన్ భగవత్ శాంతి వచనాలు, ప్రవచనాలు ఎలా ఉన్నా వాటి అంతరార్థం అర్థం కావాల్సిన వారికి సరిగ్గానే అర్థం అవుతుంది. ఆయన ఎన్ని శాంతి వచనాలు పలికినా స్వయం సేవకులు, హిందుత్వవాదులు, ఇతర మతాలవారి ప్రార్థనా స్థలాల మీద నిరంతరం దాడి చేస్తూనే ఉన్నారు. ఆ మతాల వారి మీద అసత్య ప్రచారం నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది.

స్వయం సేవకుల విధ్వంసక శక్తికి, ఉద్దేశానికి బాబ్రీ మసీదును పడదోయడంకన్నా పెద్ద ఉదాహరణ ఏముంటుంది? బాబ్రీ మసీదు రాయి రాయి విడగొడ్తున్నప్పుడు రీతంభర లాంటి సాధ్వీ మణులు అక్కడ ఉండి విధ్వంసకులను ఉత్సాహపరచడాన్ని అర్థం చేసుకోగలం. కానీ బీజేపీ అగ్రనాయకుడు లాల్ కృష్ణ అద్వాణీ అక్కడే మౌన ప్రేక్షకుడిగా ఉండిపోవడం ఆయన నిస్సహాయత కానే కాదు. బాబ్రీ మసీదు కూలి పోయిన తరవాత ఆయన కంట తడి పెట్టుకున్నారనడం ఆయన మౌనానికి సాకులు వెదకడమే. ఇతర మతాలవారి ప్రార్థనా స్థలాల మీద దాడులు చేయకూడదని చెప్తున్న మోహన్ భగవత్‌కు ఉత్తరప్రదేశ్‌లో ముస్లింల, క్రైస్తవుల ఎన్ని ప్రార్థనా స్థలాలను నేలమట్టం చేశారో; నేరస్థులను అదుపు చేసే నెపంతో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ముస్లింల ఇళ్ల మీంచి బుల్డోజర్లు నడిపిన విషయం తెలియకుండా ఉంటుందా? భారత్‌లో మత సహనం నశిస్తోందని అంతర్రాష్ట్రీయ సంస్థలు గణాంకాలతో సహా వెల్లడించిన వైనం మోహన్ భగవత్ చెవిన పడలేదనుకోలేంగదా! మోహన్ భగవత్ భారతీయులందరి డీఎన్ఏ ఒకటే అని కూడా అంటున్నారు. నాలుగు వేల ఏళ్ల నుంచి ఈ దేశంలో ఉంటున్నవారందరి డీఎన్ఏ ఒకటేనట. ఈ వాదనలు ఎవరిని మూర్ఖులను చేయడానికో! మోహన్ భగవత్ చెప్పే ఏ మాట అయినా జనాన్ని నమ్మించడానికే. ఆ మాటలేవీ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు హితోపదేశాలు కావు. ఆయన చెప్పిన మాటలకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తించే సామర్థ్యం, కౌశలం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు, హిందుత్వవాదులకు ఉంది. ప్రధానమంత్రి మోదీ నాల్గేళ్ల కిందే బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను మీ డీఎన్ఏ ఏమిటి అని ప్రశ్నించిన విషయాన్ని ఎలా మరిచి పోగలం. ఆ ప్రశ్న ఎదురైనప్పుడు 50 లక్షల మంది డీఎన్ఏ నమూనాలు దిల్లీకి పంపిస్తానని నితీశ్ కుమార్ సమాధానమిచ్చారుగదా! అద్వాణీ రామమందిర నిర్మాణం కోసం రథయాత్ర చేపట్టినప్పటి నుంచి హిందువులలో అంతకు ముందు లేని మత విద్వేషం పాకి పోయింది. కానీ ఇప్పటికీ దేశ జనాభాలో ఎక్కువ మంది ఆ మత్తుకు దూరంగానే ఉన్నారు అని వరసగా మూడు ఎన్నికలు నిరూపించాయి. మోదీ అధికారంలోకి వస్తూ ఉండొచ్చు. కానీ లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వస్తున్న ఓట్ల శాతం ఎంతో గమనిస్తే అత్యధిక సంఖ్యాక భారతీయులు మతోన్మాదానికి లొంగడం లేదని అర్థం అవుతోంది. ఇంతకీ మోహన్ భగవత్ ప్రసంగంలో అర్థ సత్యాలకన్నా అసత్యాలే ఎక్కువ.

సుధాకర రెడ్డి.. ఓ మానవిస్టు

ఈ అప్రజాస్వామిక దేశంలో (ఇప్పుడే కాదు... చాలా కాలంగా) ప్రజాస్వామికంగా పోరాడతామనే పార్టీల పట్ల నాకు అయిష్టత. కానీ, కడుపుకింత కావాలి కదా..! నెలకింత జీతం అవసరం కదా..! అందుకని జర్నలిస్టుగా స్థిరపడ్డాను. నా ఖర్మకి పత్రికా యజమానుల కంటే సంపాదకుడి కారణంగా నేను వ్యతిరేకించే పార్టీల బాధ్యతే నాకు అప్పగించారు. అవే ఓ వామపక్ష పార్టీ, బీజేపీ. రిపోర్టర్‌ని కదా... కాదనలేక ఓ రెండున్నర దశాబ్దాలు వాళ్ల వార్తలే రాయాల్సి వచ్చింది. మధ్యలో వాళ్లని వ్యతిరేకించే కథనాలు రాశాను. దానికి సీపీఐ అభిమాని, సానుభూతిపరుడు తాడి ప్రకాష్ హెడ్డింగులు పెట్టేవారు. పాపం ఆయనకీ ఆకలేస్తుంది కదా... ఓరోజు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ, సీపీఎం నాయకులు సంయుక్తంగా ప్రెస్‌మీట్. హిమయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయం ముక్దుంభవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి దాసరి

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

నాగభూషణరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొరటాల సత్యనారాయణ కలిసి మాట్లాడారు. నేనూ వాళ్లని ఇబ్బంది పెట్టే నాలుగైదు ప్రశ్నలు అడిగాను విలేకరిగా. "నువ్వూ కమ్యూనిస్టువే కదా... ఆ ప్రశ్నలేంటి అన్నారు.

ప్రెస్‌మీట్ తర్వాత కొరటాలతో నేను "ఉద్యోగం చేస్తున్నాను కదా" అన్నాను. వాళ్లు ఇచ్చిన ఇరానీ టీలో బిస్కట్లు ముంచుకుని తింటూంటే ఓ చెయ్యి నా భుజం మీద పడింది. తిరిగి చూస్తే ఓ పొడవాటి మనిషి, బుగ్గలు, కాస్త కాదు మంచి లావుగా ఉన్నారు. "మీరు ఏ పత్రిక" అన్నారు. పక్కనే మరో బక్కపలచటి మనిషి కూడా ఉన్నారు. ఆయన బీ.వీ.రాఘవులు అని ఆ రోజు తెలీదు. చెప్పారు ఫలానా అని. "కుర్రాడివి కదా... ఇంత ఆవేశం బాగుంది. మేమూ ఇదే అనుకుం టున్నాం. కానీ అడగలేం. నువ్వు అడిగావు" అంటూ అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నారు. అలా అడిగినాయన సురవరం సుధాకర రెడ్డి అని ఆ తర్వాత తెలిసింది. ఆ రోజు ప్రారంభమైన మా ఇద్దరి స్నేహం ఈ మధ్య నేను మా ఊరు అమలాపురం వచ్చే వరకూ ఉంది. బీ.వీ.రాఘవులు స్నేహం అయితే నిత్యం ఉంటూనే ఉంది.

బంధుత్వాలు కీడు చేస్తాయి. ముఖ్యంగా రాజకీయాల్లో. సుధాకర రెడ్డి పెద్దనాన్న ప్రతాపరెడ్డి మహానుభావుడు. ఆయన నీడ సుధాకర రెడ్డి మీద పడింది. నిజానికి సుధాకర రెడ్డి ఏ గొడుగు అవసరంలేని మనిషి. బాగా చదువుకున్నవాడు. మాట్లాడగలవాడు. ఎవ్వరినీ నొప్పించని వాడు. కమ్యూనిస్టు అనే పదానికి అర్థం సుధాకర రెడ్డి. రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సుధాకరరెడ్డి, మరో వైపు సీపీఎం కార్యదర్శిగా బీ.వీ.రాఘవులు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉవ్వెత్తున వచ్చిన విద్యుత్ ఉద్యమంలో వీరిద్దరే సారథులు. బషీర్‌బాగ్ కాల్పుల ముందు జరిగిన ఉద్యమంలో వీరిద్దరిని నేను నిత్యం కలిసేవాడ్ని. నిర్బంధం ఎక్కువైనప్పుడు సుధాకర్ రెడ్డిని ఓ పదిమంది పోలీసులు ఎత్తుకెళ్లి జీపులో వేయాలనుకోవడం, దాన్ని అడ్డుకునేందుకు వామపక్ష కార్యకర్తలు పోరాడడం నా కళ్ల ముందే జరిగింది.

ఓ రోజు "పోలీసులు, మీ కార్యకర్తల మధ్య మీరు నలిగి పోతున్నారు. మీ పీక పిసికేస్తున్నారు. కాస్త జాగ్రత్త" అని సుధాకర రెడ్డితో అంటే "పోనీ నేను చచ్చిపోతే... ఈ కరెంట్ చార్జీలు తగ్గిస్తాడేమో చంద్రబాబు" అన్నారు సుధాకర రెడ్డి. ఇదీ సురవరం వారబ్బాయి. ఉద్యోగం పోయి దిల్లీలో ఉద్యోగమని కబురొస్తే అక్కడికి వెళ్లాను. ఓ మిత్రుడు సీపీఐ కార్యాలయానికి తీసుకెళ్తే అక్కడ అప్పటి జాతీయ కార్యదర్శి సుధాకర రెడ్డే ఎదురొచ్చి కౌగలించుకుని "చక్రీ... మా పత్రికలో చేరు. దిల్లీ రిపోర్టర్‌గా. నే చూసుకుంటా" అని హామీ ఇస్తే... అబ్బే వద్దులెండి.. చేరలేనని తిరస్కరించాను. దానికాయన..." నీ విశ్వాసాలు గొప్పవి... నెరవేరకపోవచ్చు.." అంటే వెర్రినవ్వు నవ్వేశా. అవును నా విశ్వాసాలు అమూల్యమైనవి. నే కాపాడుకుంటా. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే... సురవరం సుధాకర రెడ్డి కమ్యూనిస్టు కాదు. మానవిస్టు. ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే వాలడు. నిదానంగా ఆ కష్టం తీర్చి ఆ తర్వాత వస్తాడు. నాకు కష్టంగా ఉంది. దాన్ని తీర్చడానికి నా మిత్రుడు లేడు.

సీనియర్ జర్నలిస్టు

సెల్: 99120 19929

ఉర్రూతలూపిన ప్రజా కళలు

చంద్ర నాయక్
ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు

సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల సందర్భంగా ఆగస్టు 20 నుంచి ఒంగోలులో నిర్వహించిన ప్రజా కళా ఉత్సవాలు ఉర్రూతలూపాయి. సీపీఐ శ్రేణులు, ప్రజలలో ఉత్సాహాన్ని నింపాయి. స్ఫూర్తిని కలిగించాయి. ఎంతో ప్రేరణ ఇచ్చాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా కళాకారులు ఎంతగానో స్ఫూర్తినిస్తూ చైతన్యపరిచే విధంగా తమ ఆటపాట మాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గొప్ప కళాకారులు కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కళ కళ కోసం కాదు ప్రజా చైతన్యం కోసం అనే నినాదంతో ఏర్పాటుచేసిన కళా ఉత్సవాలు ఎంతోగానో ఆలోచింప చేశాయి. స్థానిక ఒంగోలు సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణంలో 20 నుంచి 22వ తేదీ వరకు అలాగే 23న అద్దంకి బస్టాండ్ వద్ద జరిగిన భారీ బహిరంగ సభ వేదికపై కళాకారులు తమ పాటలతో అనేకానేక కళారూపాలతో సభకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజానీకంలో ఎంతగానో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహా ర్యాలీలో డప్పువిన్యాసాలతో కోలాట గురవయ్యల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కోయ నృత్యాలు, కొమ్ము నృత్యాలు, మహిళా కోలాటాలు, డీజే శబ్దంలో వెలువడిన ఎర్రజెండా పాటలకు అభినయాలతో ముందుకు సాగారు. కళారూపాలు ఎంతగా మనిషిని ప్రభావితం చేస్తాయో, ఎంత శక్తివంతమైనవో నిరూపించే విధంగా 24, 25 తేదీల్లో జరిగిన ప్రతినిధుల మహాసభల్లో కూడా కళాకారులు తమతమ కళారూపాలను ప్రదర్శించారు. ప్రధానంగా 20వ తేదీన స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో ప్రారంభమైన కళాఉత్సవాలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పాల్గొని సందేశాన్ని ఇచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని

100 మంది కళాకారులు 100 గొంతుకలతో ఆడి పాడాలనే నినాదాన్ని పరిపూర్ణం చేసే ప్రయత్నం చేశారు. కళాకారులు తమ ఆటపాటలను ప్రారంభిస్తూ దేశం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఇతివృత్తంగా ఎంచుకున్న పాటలను అద్భుతంగా అభినయంతో ఆడిపాడుతూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రజావాగ్గేయకారుడు, ప్రకృతికవి జయరాజ్ తొలిరోజు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమాజాన్ని ఎప్పటికప్పుడు మేల్కొల్పడానికి ప్రజా కళాకారులు సిద్ధంగా ఉండాలన్నారు. జీవజాతుల మనుగడ దెబ్బతీసే విధంగా ధ్వంసమైపోతున్న ప్రకృతిని కాపాడాలన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ దేశంలో ప్రజానాట్యమండలి పుట్టుక ఒక సంచలనం అన్నారు. 1943లో పుట్టిన ప్రజానాట్యమండలి కార్యక్రమాలు చూసి పాలకులు ఓర్చుకోలేక అనతికాలంలోనే ఆ సంఘం మీద నిషేధం విధించారని అంతటి ప్రభావితమైన కళారూపాలను ప్రజానాట్యమండలి ప్రదర్శించిందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన జానపద కళాకారులు అసరయ్య పాల్గొని అనేక జానపద అభ్యుదయ గేయాలను ఆలపించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ రామకృష్ణ, రాష్ట్ర ఆఫీస్‌బేరర్లు ఆర్ పిచ్చయ్య, వి నాగరాజు, మహంతి లక్ష్మణరావు, ఏ శివయ్య, ఆరేటి రామారావు, ఎస్ కే నజీర్, ఎస్ గుర్రప్ప తదితర ప్రజానాట్యమండలి నాయకులు కళాకారుల సమన్వయంతో ఈ కార్యక్రమం సాగింది. ఒంగోలు ప్రజానాట్యమండలి కళాకారులు అనేక అభ్యుదయ గేయాలకు నృత్యం చేశారు. గుంటూరు ప్రజానాట్యమండలి కళాకారులు రేపు ఏంది నాటిక ప్రదర్శించారు. 21వ తేదీన రాష్ట్ర నలుమూల నుంచి వచ్చిన కళాకారులు తమ ఆట పాట కార్యక్రమంతో ప్రారంభించారు అనేక సామాజిక గీతాలను ఆలపిస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. అభ్యుదయ ప్రజాకవి ఎస్ కే మీరా, నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజానాట్యమండలి సంస్థ మట్టిలోమాణిక్య లాంటి గొప్ప గొప్ప కళాకారులను, కళారూపాలను ప్రజలకు పరిచయం చేసిందన్నారు.

అనంతపురం జిల్లాకు చెందిన కళాకారులు అనేక అభ్యుదయ గేయాలకు నృత్యాలు చేశారు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విశాఖపట్నం ప్రజానాట్యమండలి కళాకారులు ఓ రాక్షసుడి కథ నాటిక ప్రదర్శించారు. ఈనాటికకు విశాఖ జిల్లాకు చెందిన కృష్ణా నేతృత్వం వహించారు. 22వ తారీఖున అనేకమంది ప్రజావాగ్గేయకారులు కమ్యూనిస్టు పార్టీ నాయకులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రజావాగ్గేయకారుడు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న విప్లవ చిత్రాల నటులు నిర్మాత మాదాల రవి మరొక ప్రజా వాగ్గేయకారుడు ఏపూరి సోమన్న సినీ దర్శకులు బాబ్జి తదితరులు పాల్గొని ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ దేశం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని కళాకారులు తమ కళారూపాలతో ప్రజలను మేల్కొల్పాలన్నారు. గోరటి వెంకన్న మాట్లాడుతూ భూమి ఆకాశం ఉన్నంతవరకు కమ్యూనిజం బతికుంటుందన్నారు కమ్యూనిజానికి చావు లేదన్నారు. ఆడి పాడి ప్రేక్షకులను చైతన్యపరిచారు. మాదాల రవి మాట్లాడుతూ కళాకారులు మానవ హృదయం నిర్మాతలని సమాజానికి పట్టిన జబ్బులను వదిలించగల శక్తి ప్రజాకళలకు ఉందన్నారు. ఏపూరి సోమన్న అద్భుతమైన తన గాత్రంతో అనేక సామాజిక విప్లవ పాటలను తన విన్యాసాలతో అద్భుతంగా ఆకట్టుకున్నారు. పోరాటం లేనిదే ఏది సాధ్యం కాదని పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు. సినీ దర్శకులు బాబ్జి ఆయన తనయుడు సినీ నటుడు అఖిల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కమ్యూనిస్టుపార్టీ తనను ఎంతగానో తీర్చిదిద్దిన ఎర్రజెండాను మరువలేనన్నారు.

బాబ్జి తనయుడికి ఎర్రజెండాను అందించారు. 23న కమ్యూనిస్టు పార్టీ మహాసభల సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీలో వందలాది మంది కళాకారులు డప్పు విన్యాసాలు, కోలాట, చెక్కభజన గురవయ్యల అభినయాలు, కొమ్ము నృత్యం, కోయ నృత్యాలు, మహిళల కోలాట ప్రదర్శనలు చేశారు. బహిరంగ సభ వేదికలపై సభకు ముందు కళాకారులు అనేక విప్లవ గేయాలను పాడి వినిపించారు. అనంతరం తిరుపతి, కర్నూలు, ఒంగోలు, అనంతపురం జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు అనేక పాటలకు అద్భుతమైన నృత్యాలు చేశారు. ఏలూరు జిల్లా నుంచి వచ్చిన బాల నటులు అల్లూరి సీతారామరాజు, రూథర్‌ఫర్డ్ మధ్య జరిగిన సంభాషణను ప్రదర్శించారు. 24, 25 తేదీల్లో జరిగిన ప్రతినిధుల సభలో 100 సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానంలో సాగించిన పోరాటాలను, చేసిన త్యాగాలను స్మరిస్తూ అనేక పాటలు పాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం ప్రజానాట్యమండలి కళాకారులు అల్లూరి సీతారామరాజు బుర్రకథ వీరగాథను వినిపించారు. గుంటూరు కళాకారులు స్కిట్ ప్రదర్శించారు. విజయవాడ నగర ప్రజానాట్యమండలి కళాకారులు మరొక స్కిట్‌ను ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన డాన్స్ మాస్టర్ రాజేష్ అనేక విప్లవ గేయాలకు డ్యాన్సులు రూపొందించి ప్రదర్శించారు. విజయవాడకు చెందిన శ్రీ దివ్య కళాకారుని ఎర్ర జెండా, జానపద పాటలకు ప్రదర్శించిన నృత్యాలు ప్రతినిధులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి తదితర నాయకులు శ్రీదివ్యను ఎంతగానో అభినందించారు. మొత్తంగా ఒంగోలు ప్రజాకళా ఉత్సవాలు అద్భుతమైన ఉత్సాహాన్ని ప్రేరణను కలిగించాయి. ఈ కళా ఉత్సవాల నిర్వహణకు ఆర్థికంగా, హార్దికంగా చేయూత అందించిన మహాసభల ఆహ్వాన సంఘానికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి తరపున కళాభివందనాలు తెలియపరుస్తున్నాం.

రాజకీయ దురుద్దేశంతో అమిత్‌షా విమర్శలు

ఎంసీ వెంకటేశ్వర్లు

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి 2011లో సల్వాజుడుంపై ఇచ్చిన తీర్పుపై కేంద్ర హోం శాఖమంత్రి 'అమిత్ షా" విమర్శ చేయడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నది. సుదర్శన్ రెడ్డి ఆ తీర్పు ఇవ్వకపోతే నక్సలిజం 2020 నాటికే అంతమై ఉండేదని, ఆయనకు నక్సలిజం భావజాలం ఉన్నదన్న అర్థనగ్న వ్యాఖ్యచేయడం అమిత్ షా సంకుచిత మనస్తత్వానికి నిదర్శనం. ఉపరాష్ట్రపతి పదవికి ఎన్‌డీఏ అభ్యర్థి సి.రాధాకృష్ణన్‌పై ఇండియా సంకీర్ణ కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీచేస్తున్నారన్న ఉక్రోషంతో అనుచిత వ్యాఖ్యలుచేసి అమిత్‌షా అభాసుపాల య్యాడు. నిజానికి రాధాకృష్ణన్ పక్కా ఆర్ఎస్ఎస్ వాది. హిందుత్వ రాజకీయాలను జీర్ణించుకున్న బీజేపీ రాజకీయ నాయకుడు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజ్యాంగబద్ధంగా తీర్పులిచ్చి ప్రజాస్వామ్యవాదిగా, లౌకికవాదిగా పేరుతెచ్చుకున్న వ్యక్తి. రాజ్యాంగ విలువలకు నిబద్ధత కలిగిన వ్యక్తిగా బి.సుదర్శన్‌రెడ్డి హోం మంత్రి అమిత్ షా అసంబద్ధ వ్యాఖ్యలపై స్పందించిన తీరు ఆయన హుందాతనానికి అద్దంపట్టింది. "ఇది నా తీర్పు కాదు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. ఆ తీర్పును సమర్థించిన న్యాయమూర్తులందరు మావోయిస్టులా అని సూటిగా ప్రశ్నించారు. దానికి సమాధానమేది? అసలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఏ నేపథ్యంలో తీర్పిచ్చాడని ఆ తీర్పేమిటి? ఆ తీర్పుతోనే నక్సల్స్ బతికి బట్టకట్టారా? 'సల్వాజుడుం' అంటే ఏమిటి? ఎవరు ఏర్పాటు చేశారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వాస్తవాలను మభ్యపెట్టి రాజకీయ ప్రయోజనాలకోసం దేశంలో రెండో అత్యున్నత పదవికి పోటీచేస్తున్న వ్యక్తిపై అసత్యప్రచారం చేయడం హోం మంత్రి స్థాయికి తగనిది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బస్తర్ జిల్లా, దంతెవాడ ప్రాంతంలో 2005-2011 మధ్య నక్సల్స్ విజృంభించిన మాట వాస్తవం. ఒకరకంగా గిరిజన ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వానికి సమాంతర ప్రభుత్వాన్ని నడిపే స్థాయికి వెళ్లినమాట కూడా నిజమే. పోలీసులు-మావోయిస్టుల మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు, ఎన్‌కౌంటర్లు జరిగాయి. పదుల సంఖ్యలో మావోయిస్టులు, పోలీసులు, అమాయక గిరిజనులు చనిపోయారు. ఒక పక్క పోలీసుల వేధింపులు, మరోపక్క నక్సల్స్ అనుమానితులను హత్య చేయడంతో బస్తర్‌జిల్లా మొత్తంగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మరో పక్కన వడ్డీ వ్యాపారులు, గిరిజనేతర వ్యాపారస్థుల దోపిడీతో గిరిజనుల జీవితాలు దుర్భరమైనాయి. గిరిజన యువకుల్లో నిరుద్యోగం పెరిగింది. భారతదేశంలో ఖనిజ నిక్షేపాలు కొండలు, అడవులలో నిక్షిప్తమై ఉన్న విషయం విదితమే. వీటిని బహుళజాతి సంస్థలకు, గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు కట్టబెట్టాలన్నది పాలకుల లక్ష్యం. అది కాంగ్రెస్ ప్రభుత్వమైనా, బీజేపీ ప్రభుత్వమైనా తేడా ఏమీలేదు. కాని ఇక్కడ వచ్చిన చిక్కు సమస్య గిరిజనులు దేశంలో 8శాతం ఉంటే 90శాతం అడవుల్లోనే జీవిస్తున్నారు. 78సంవత్సరాల స్వాతంత్ర్యంలో గిరిజనులను ప్రధానస్రవంతిలోకి తీసుకు రావడంలోనూ, మెరుగైన సౌకర్యాలు కలిగించడంలో పాలకులు వైఫల్యం చెందారనేదీ వాస్తవం. ఏదిఏమైనా అటవీప్రాంతాల నుంచి గిరిజనులను తరమాలి. ఖనిజ సంపదను గుత్త, బహుళజాతి సంస్థలకు అప్పగించాలి. ఇదీ మోదీ, అమిత్‌షా లక్ష్యం. మణిపూర్‌లో జరుగుతున్నది, నేడు బస్తర్‌లో జరుగుతున్నది అదే. దీనిని గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. మావోయిస్టులను ఆదరిస్తున్నారు. ఈ వాస్తవాలన్నింటిని విస్మరించి, పర్యావరణ విధ్వంసాన్ని కాలదన్ని బస్తర్‌జిల్లాలో ఉన్న ఇనుప ఖనిజాన్ని దోచి పెట్టడానికి గత ప్రభుత్వం టాటా, ఎస్సార్ గ్రూపు కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. మైనింగ్ జరగాలంటే గిరిజనులను తరమాలి. అది జరగాలంటే మావోయిస్టులను హతమార్చాలి. ఇటు మావోయిస్టులు, అటు గిరిజనుల వ్యతిరేకతను ఎదుర్కోవలసిన సంకట స్థితి నాటి రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురైంది. గిరిజనుల సమస్యకు పరిష్కారం



చూపడం, మావోయిస్టులను ఎదుర్కోవడం రాష్ట్ర ప్రభుత్వానికి కత్తిమీద సాములా తయారైంది. ఈ నేపథ్యంలో స్థానిక గిరిజన నాయకుడు, ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడు మహేంద్రకర్మ మావోయిస్టులకు వ్యతిరేకంగా 'జనజాగరణ' ఉద్యమాన్ని ప్రారంభించాడు. అభివృద్ధి లేక, నిరాశ నిస్ప్రహలతో ఉన్న నిరుద్యోగ గిరిజన యువకులను మావోయిస్టులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టాడు. ఆ విధంగా రెచ్చగొట్టబడ్డ యువజనులే సల్వాజుడుం బృందాలు. సల్వాజుడు అంటే "శాంతి కొరకు పోరాటం". మహేంద్రకర్మ ప్రారంభించిన జనజాగరణ ఉద్యమానికి మద్దతిచ్చింది వ్యాపారులు, వ్యాపారవేత్తలు, గుత్త పెట్టుబడిదారీ వర్గాలు. శాంతి కొరకు పోరాటం జరగలేదు. ఆ పేరుతో బస్తర్ జిల్లాలో అశాంతిని సృష్టించారు. ఆచరణలో మైనింగ్‌ను, పెట్టుబడీ దారీ వర్గ దోపిడీని వ్యతిరేకించే గిరిజనులకు వ్యతిరేకంగా అరాచకాలు జరిగాయి. సాయుధ పోలీసులు, సైనిక బలగాలున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మావోయిస్టులను ఎదుర్కోవడానికి బదులుగా, గిరిజన యువకులను ప్రత్యేక పోలీసు అధికారులుగా (ఎస్పీఓ) తాత్కాలిక ఉద్యోగాలిచ్చి శాంతి భద్రత సమస్యలను సృష్టించారు. చట్టవిరుద్ధంగా మైనర్లకు సైతం ఆయుధాలిచ్చి ఎస్పీఓలుగా తాత్కాలిక ఉద్యోగాలు పొందిన సల్వాజుడుం కార్యకర్తలు, ప్రభుత్వ పోలీసుల, భద్రతాదళాలు బస్తర్ అటవీప్రాంతంలో భయోత్పాతాన్ని కలిగించారు. వీరికి మద్దతుగా కాంట్రాక్టర్‌లు, వడ్డీవ్యాపారులు, గిరిజన భూస్వాములు సహకరించారు. మావోయిస్టుల దౌర్జన్యకాండను, హత్యలను ఆపడానికి అంటూ గిరిజనులపైనే దాడులకు పూనుకున్నారు. భయపడి సరిహద్దు ప్రాంతమైన ఆంధ్రప్రదేశ్ పారిపోయిన వారిపై ప్రతీకార చర్యలకు పాల్పడ్డారు. సల్వాజుడుం ఉద్యమం హింసాత్మకంగా మారింది. ప్రభుత్వ, పోలీసులు, భద్రతాదళాల మద్దతుతో సల్వాజుడుం మూక 600 గ్రామాలను తగులబెట్టారు. 30000 మంది ఇళ్లనుంచి పారిపోయారు. పోలీసులు, సల్వాజుడుం, సాయుధ మిలీషియా నక్సలైట్ల మధ్య జరిగిన ఘర్షణల్లో 100,000 మంది గిరిజనుల బ్రతుకులు ఛిద్రమయాయి. 2008 నాటికి 150000కు పెరిగారు. కొంతమంది గిరిజనులు ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయారు. కొన్ని జిల్లాలలో పౌరప్రభుత్వమే లేకుండా పోయింది. సల్వాజుడుందే రాజ్యం. దానికి కారకులు ప్రభుత్వం కాదా? మానవ హక్కులను ఉల్లంఘించిన సల్వాజుడుంకు పోలీసు యంత్రాంగం సహకరించడం చట్ట విరుద్ధం కాదా? అమిత్‌షా ఈ చట్టవిరుద్ధ చర్యలను సమర్థిస్తారా? సల్వాజుడుం సభ్యులు 2005-2007 మధ్య 537 మంది గిరిజనులను హతమార్చినట్లు, 2825 ఇళ్లను తగలబెట్టారని, వేలాదిమంది ఇళ్లను దోచుకున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్, పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ వంటి మానవహక్కుల సంస్థలు సల్వాజుడుం కార్యకలాపాలను ఖండించాయి. మైనర్ బాలురకు ఆయుధాలిచ్చి, మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆయుధంగా ఉపయోగించడం మానవహక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నాయి.

"ఇది శాంతి భద్రతల సమస్య, మీరు ఒకరికి ఆయుధాలిచ్చి చంపడానికి అనుమతించలేరు. శిక్షాస్మృతిలోని సెక్షన్ 302 ప్రకారం, నేరాన్ని ప్రేరేపించిన వారవుతార"ని 2008లో సుప్రీంకోర్టు బెంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అదే సందర్భంలో సల్వాజుడుంకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతివ్వడం లేదా ప్రోత్సహించరాదని కూడా తెలిపింది. సుప్రీంకోర్టు హెచ్చరికలు, ప్రజాస్వామిక వాదులు, సామాన్యప్రజల నుంచి విమర్శలు రావడంతో సల్వాజుడుం, భద్రతాదళాలు ఇళ్లు తగలబెట్టాయని, ఆస్తులను దోచుకున్నాయని అంగీకరిస్తూ రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిందంటే అదే అంశంపై సుదర్శన్ రెడ్డి తీర్పును వక్రీకరించి వ్యాఖ్యానం చేయడాన్ని ఏమనాలి. రాష్ట్రంలో అరాచకాన్ని సృష్టించిందని, గిరిజనులు జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది సల్వాజుడుం, భద్రతా దళాలేనని రాష్ట్ర ప్రభుత్వమే అంగీకరిస్తే అమిత్ షా సుదర్శన్‌రెడ్డి తీర్పును తప్పుపట్టడం అనైతికం, రాజ్యాంగ విరుద్ధం. అదే విషయాన్ని జస్టిస్ సుదర్శన్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వ విధులను శిక్షణ లేని నిఘూదారులకు అప్పగించడం ఆర్టికల్ 14-21లను ఉల్లంఘించడమేనని, తక్షణం సల్వాజుడుంను రద్దుచేయాలని తీర్పిచ్చారు. ఈ తీర్పుపై కేంద్రప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలును జస్టిస్ అల్తమాస్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం కొట్టివేసింది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ నిజ్జార్ తీర్పును ధృవీకరించింది. ఈ జడ్జీలందరు మావోయిజం సిద్ధాంత ప్రేరేపితులేనా? నక్సలిజానికి ఊపిరి పోసినవారేనా అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు అమిత్ షా నుంచి సమాధానంలేదు.

పట్నాలో యుద్ధ వాతావరణం

జెండా కర్రలతో కొట్టుకున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

పట్నా: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీహార్‌లో రాజకీయ వేడి పెరిగింది. అధికార, విపక్షాలు విమర్శలు, ప్రతివిమర్శలతో దూషణలకు దిగుతున్నాయి. ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓటరు అధికార యాత్ర రాష్ట్రంలో మరింత వేడి పుట్టిస్తోంది. పరస్పర విమర్శల్లో భాగంగా 'ఓటరు అధికార్ యాత్ర'లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తల్లిపై అసభ్యకరమైన భాష ఉపయోగించారన్న ఆరోపణలపై బీజేపీ దాడులకు తెగబడింది. ఈ సందర్భంగా శుక్రవారం పట్నాలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. రాష్ట్ర మంత్రులు నితిన్ నబిన్, సంజయ్ సరోగి వంటి సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే సంజీవ్ చౌరాసియా నేతృత్వంలో బీజేపీ కార్యకర్తలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం సదాకత్ ఆశ్రమంపై దాడికి దిగారు. రెండు రోజుల క్రితం దర్భంగాలో జరిగిన ఘటనకు వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. 'నరేంద్ర మోదీని అవమానించడాన్ని మేము సహించబోము. రాహుల్ గాంధీ, అతని సహచరులు దేశానికి క్షమాపణ చెప్పాలి' అని నబిన్ అన్నారు. కాంగ్రెస్ కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను ప్రతిఘటించారు. కాంగ్రెస్ కార్యాలయం గేట్లకు తాళం వేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు పరస్పరం జెండా కర్రలతో దాడులకు దిగారు. బీజేపీ కార్యకర్తలు తమ పార్టీ జెండాలను క్షిపణుల మాదిరిగా ప్రయోగించారు. రాహుల్ గాంధీ ఫొటోలను, సమీపంలో పార్క్ చేసిన వాహనాలను ధ్వంసం చేశారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. దీంతో బీజేపీ కార్యకర్తలు వెనక్కి తగ్గారు. 'ఇది ఒక చిన్న ఘర్షణ. రెండు వైపుల నుంచి ప్రజలు గాయపడినట్లు మాకు ఫిర్యాదులు అందాయి. మొత్తం విషయంపై దర్యాప్తు చేస్తున్నాం. తదనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం' అని పట్నా (సెంట్రల్) పోలీసు సూపరింటెండెంట్ దీక్ష పీటీఐకి తెలిపారు. ఇదిలాఉండగా, బీజేపీ 'గూండాగిరి'కి నిరసనగా సదాకత్ ఆశ్రమం ద్వారాల వెలుపల కాంగ్రెస్ కార్యకర్తల బృందం ధర్నా చేపట్టింది. నితీశ్ కుమార్ పాలన సరిగా లేదని, ఇదంతా ప్రభుత్వ జోక్యంతోనే జరుగుతోందని కాంగ్రెస్ నేత డాక్టర్ అశుతోష్ ఆరోపించారు.

అమిత్‌షాపై జైరాం రమేశ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: హోం మంత్రి అమిత్ షాను 'దుర్మార్గపు పరధ్యాన ఆయుధం, 'దుర్మార్గపు పరువు నష్టం' అని కాంగ్రెస్ శుక్రవారం అభివర్ణించింది. రాహుల్ గాంధీ గురించి 'అబద్ధాలు' వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించింది. గువహటిలో జరిగిన ఒక కార్యక్రమంలో షా ప్రసంగిస్తూ బీహార్‌లో యాత్ర సందర్భంగా మోదీ, అతని తల్లిపై దుర్భాష ప్రయోగించారన్న ఆరోపణపై రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడంపై కాంగ్రెస్ స్పందించింది. కేంద్ర హోం మంత్రి 2-ఇన్-1 డబ్ల్యూఎండీ... దుర్మార్గపు దృష్టి మరల్చే ఆయుధం, హానికరమైన పరువు నష్టం కలిగించే ఆయుధం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఓటరు అధికార్ యాత్రకు బీహార్ ప్రజల అసాధారణ ప్రతిస్పందనతో కలవరపడి, కలత చెంది, ఆందోళన చెంది, రాహుల్ గాంధీ, ఇతర నాయకులపై అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారు' అని ఆయన విమర్శించారు.

నరేంద్ర మోదీపైనా, ఆయన తల్లిపై దుర్భాషలను బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్, ఆర్‌జేడీ కార్యక్రమాల వేదికపై ప్రధాన మంత్రిపై అవమానకరమైన భాష వాడటం అభ్యంతరకరమని నితీశ్ వ్యాఖ్యానించారు. ఈ విషయంపై బీజేపీ దర్భంగా, పట్నాలోని అనేక చోట్ల పోలీసులకు ఫిర్యాదులు చేసింది. బీజేపీ సీనియర్ నాయకుడు, ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి కూడా దీనిని తీవ్రంగా ఖండించారు.

కాంగ్రెస్ కార్యకర్త అరెస్టు

పట్నా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రలో కొందరు ప్రధాని నరేంద్ర మోదీ తల్లిని దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ చేసిన ఆరోపణలకు సంబంధించి ఓ వ్యక్తిని తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. మోదీ, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిలో మొహమ్మద్ రిజ్వి అలియాస్ రాజా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. నిందితుడు సింగ్వారాలోని భాపుర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. దీనిపై ఇంకా విచారణ కొనసాగుతుందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల తీరును బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. మోదీ, ఆయన తల్లిని దూషిస్తూ వ్యాఖ్యలు చేయడం అసభ్యకరమని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాహుల్, ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ యాత్ర నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దర్భంగా పట్టణంలో నిర్వహించిన సభలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు మోదీ, ఆయన తల్లిని దూషిస్తూ వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఆరోపించింది.

దీనికి సంబంధించి ఆ పార్టీ నేతలు పట్నాలోని కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన కొన్ని వీడియోలు అనధికారిక ఖాతాల్లో అప్‌లోడ్ అయ్యాయి. అందులో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మోదీని హిందీలో దూషిస్తున్నట్టుగా చూపుతున్న వీడియో క్లిప్పులు ఉన్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా దీన్ని ఖండించారు. రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ రాజకీయాలు అట్టడుగుస్థాయికి చేరాయన్నారు.

రాహుల్ క్షమాపణ చెప్పాల్సిందే: అమిత్ షా

న్యూఢిల్లీ: 'ఓటర్ అధికార్ యాత్ర' పేరుతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీహార్‌లో చేపట్టిన యాత్రలో కొందరు వ్యక్తులు ప్రధాని మోదీ తల్లిని దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. యాత్ర జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీ, ఆయన తల్లిపై అవమానకరమైన పదాలు ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. మోదీ తల్లి నిరుపేద కుటుంబంలో జీవితం గడిపినప్పటికీ... తన పిల్లలను మాత్రం విలువలతో పెంచారని అమిత్ షా కొనియాడారు. ఆమె నేర్పిన విలువలు, న్యాయబద్ధమైన జీవన విధానం వల్లే మోదీ ప్రధాని స్థాయికి ఎదగగలిగారని అన్నారు. అటువంటి ఆదర్శనీయమైన మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు ఎన్నటికీ సహించరని అమిత్ షా అన్నారు. రాహుల్ గాంధీ రాజకీయ జీవితంలో ఇంతకంటే పెద్ద పతనం మరొకటి ఉండదని అన్నారు. మోదీ, ఆయన తల్లిని అవమానపరిచే విధంగా మాట్లాడినందుకు ఆయన తప్పక క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో ప్రత్యర్థులను దూషిస్తూ... తప్పుడు ప్రచారాలు చేసే 'ద్వేష సంస్కృతిని' వ్యాప్తి చేయడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయంగా పెట్టుకుందని అమిత్ షా అన్నారు. తమపై కాంగ్రెస్ ఎంత బురద చల్లాలని చూస్తే... అంతకు పదిరెట్లు బీజేపీ విజయాలు సొంతం చేసుకుంటుందని అన్నారు. బీహార్‌లో ఓటరు జాబితాలో ఉన్న ఇతర రాష్ట్రాలలోని ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుంటే... దానిని కూడా రాజకీయం చేయాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ... బీహార్ ప్రజలను తప్పుదారి పట్టించడానికి విపక్షాలు ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు.

రామసేతుపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: 'రామసేతు'ను జాతీయ వారసత్వ స్మారక చిహ్నంగా ప్రకటించాలని కోరుతూ కేంద్ర మాజీమంత్రి సుబ్రమణ్యస్వామి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీం కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. దీనిపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. రామసేతుకు సకాలంలో జాతీయ స్మారక చిహ్నం హోదా కల్పించాలని, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాతో సర్వే చేయించాలని గతంలో సుబ్రమణ్య స్వామి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా విచారణ చేపట్టారు. సుబ్రమణ్య స్వామి తరపున సీనియర్ న్యాయవాది విభా మఖిజా వాదనలు వినిపించారు. రామసేతును కాలుష్యం నుంచి కాపాడటంతో పాటు దాని పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందని సుబ్రమణ్యస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు 'సేతు సముద్రం షిప్ ఛానెల్ ప్రాజెక్టు' కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంపిక చేసుకోవాలని, తద్వారా రామసేతుకు ఇబ్బంది కలగకుండా ఉంటుందని పేర్కొంటూ సుబ్రమణ్యస్వామి మరో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మన్నార్, పాక్ జలసంధిని కలుపుతూ 83 కి.మీ మేర పూడిక తీసి...ఛానెల్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇది కార్యరూపం దాల్చితే రామసేతుపై తీవ్ర ప్రభావం ఉంటుందన్న ఆరోపణలు ఉన్నాయి.

పరువు హత్యలపై సుప్రీంకు టీవీకే పార్టీ

న్యూఢిల్లీ: నటుడు విజయ్ ఏర్పాటుచేసిన తమిళిగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పరువు హత్యలకు సంబంధించిన ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ఆ పార్టీ కోరింది. ఇటీవల రాష్ట్రంలో ఓ దళిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. దీంతో టీవీకే ప్రధాన కార్యదర్శి అధవ్ అర్జున్ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. పరువు హత్యలను అరికట్టేందుకు ప్రస్తుతం ఉన్న చట్టపరమైన నిబంధనలు సరిపోవడం లేదని ఆయన పేర్కొన్నారు. జులై 27న తిరునెల్వేలిలో ఐటీ ఉద్యోగి అయిన కవిన్ సెల్వగణేషన్ (27) హత్య ఇటీవల సంచలనం రేపింది. కవిన్ వేరొక సామాజిక వర్గానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఇది నచ్చని ఆమె సోదరుడు సుర్జిత్... కవిన్‌ను హత్య చేశాడు. దీంతో సబ్-ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న నిందితుడి తల్లిదండ్రులు కృష్ణకుమారి, శరవణన్ సస్పెండ్ అయ్యారు. ఈ హత్యకు సంబంధించి సుర్జిత్‌తో పాటు అతడి తండ్రి శరవణన్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలోని పలు పార్టీలు ఈ పరువు హత్యలకు సంబంధించి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కోరాయి. ఇదే సమయంలో టీవీకే సుప్రీంను ఆశ్రయించింది. ప్రస్తుతం సీబీసీఐడీ పోలీసులు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు బ్యాంక్ లక్ష్యంగా వరాల జల్లు

మహిళా ఉపాధి పథకాన్ని ప్రకటించిన నితీశ్ కుమార్

పట్నా : కొద్ది నెలల్లో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రజలకు సీఎం నితీశ్ కుమార్ హామీల జల్లు కురిపిస్తున్నారు. తాజాగా శుక్రవారం మహిళా ఓటు బ్యాంక్ లక్ష్యంగా మరో పథకాన్ని వెల్లడించారు. ఈ పథకం పేరు 'ముఖ్యమంత్రి మహిళా ఉపాధి పథకం'. రాష్ట్రంలో ప్రతి కుటుంబంలోని ఒక మహిళ తమకు నచ్చిన ఉపాధిని ప్రారంభించడానికి ప్రభుత్వమే ఆర్థిక సహాయం అందిస్తుంది. మహిళలకు తమకు నచ్చినవిధంగా ఉపాధిని కల్పించుకోవడమే ఈ పథకం లక్ష్యం. ఈ పథకానికి సంబంధించి ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ పథకం కింద మహిళలకు మొదటి విడతగా రూ. పది వేలు ఇవ్వడం జరుగుతుందని ప్రకటించారు. దరఖాస్తు ప్రక్రియను పట్టణాభివృద్ధి , గృహ నిర్మాణ శాఖతోపాటు గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆరు నెలల తర్వాత వారి పనిని సమీక్షించి... అవసరమైన మేరకు మహిళలకు అదనంగా రూ.రెండు లక్షల ఆర్థిక సహాయం అందివ్వడం జరుగుతుంది. సెప్టెంబరు నుంచే మహిళల బ్యాంకు ఖాతాలకు నిధుల బదిలీ ప్రారంభమవుతుంది. మహిళలు తయారు చేసిన వస్తువుల అమ్మకాల కోసం గ్రామాల నుంచి నగరాల వరకు రాష్ట్రవ్యాప్తంగా హాట్ మార్కెట్లు అభివృద్ధి చేస్తామని నితీశ్ కుమార్ హామీ ఇచ్చారు. మహిళా సాధికారతకు, వారి స్వావలంబనకు ముఖ్యమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

సహచర డ్రైవర్‌కు స్టీరింగ్ అప్పగించి ప్రాణాలు వదిలిన డ్రైవర్

జైపూర్: సహచర డ్రైవర్‌కు బస్ స్టీరింగ్ అప్పగించి బస్సులోనే డ్రైవర్ ప్రాణాలు వదిలిన ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. డ్రైవింగ్ సమయంలో అనారోగ్యానికి గురికావడంతో... ముందు జాగ్రత్తగా స్టీరింగ్‌ను సహచర డ్రైవర్‌కు ఇచ్చి ప్రయాణికులను కాపాడాడు. సతీశ్ రావు అనే వ్యక్తి ఇండోర్ నుంచి జోధ్‌పూర్ వెళ్లే ప్రైవేట్ బస్సు నడుపుతున్నాడు. మార్గం మధ్యలో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ముందు జాగ్రత్తగా సహచర డ్రైవర్‌ను బస్ నడపమని చెప్పాడు. డ్రైవింగ్ సీట్‌లో నుంచి పక్కకు జరిగి కూర్చున్నాడు. ఇంతలో సహచరుడు సమీపంలోని మెడికల్ షాప్ వద్దకు వెళ్లగా అది మూసి ఉంది. వేరేచోటుకు వెళ్తున్న క్రమంలోనే సతీశ్ రావు కూర్చున్న చోటే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో బస్సులోని వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అయితే, చివరి నిమిషంలో స్టీరింగ్ హెల్పర్‌కు ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నారు.

'ఎస్ఐఆర్'ను అంగీకరించం: స్టాలిన్

చెన్నై: బీహార్ తరహాలో ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ తమిళనాడులో జరగనీయమని, సమగ్ర ఓటర్ జాబిత సవరణకు వీలులేదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెప్పారు. బీహార్ ఓటర్ జాబితా సవరణ పేరుతో గల్లంతైన ఓట్ల చోరీ ఉదంతంపై తమ రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెన్నైలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు. ఎస్ఐఆర్ పేరుతో బీహార్‌లో సమగ్ర ఓటర్ జాబితా సవరణకు ఈసీ చేపట్టిన ప్రక్రియపై ఆందోళనలు మిన్నంటాయి. ఎస్ఐఆర్ పేరుతో అన్యాయంగా బడుగు బలహీన వర్గాల ఓట్లను తొలగిస్తున్నారని, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును హరిస్తున్నారని విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ వ్యవహారంపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఇండియా ఐక్య సంఘటన్ పార్టీలు పిటిషన్లు కూడా వేశాయి. ఎస్ఐఆర్ పేరుతో ఈసీ చేస్తున్న ఓట్ల చోరీ ఉదంతాన్ని ప్రజలకు తెలియజేయడానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రను బీహార్‌లో కొనసాగిస్తున్నారు.

అక్టోబర్-నవంబరులో జనగణన ముందస్తు సర్వే

న్యూఢిల్లీ: జనగణన కోసం ముందస్తు సర్వే ఈ ఏడాది అక్టోబర్ - నవంబర్ మధ్య నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు పలు రాష్ట్రాల్లోని సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టరేట్‌లకు (డీసీఓ) రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్ (ఆర్‌జీ అండ్ సీసీఐ) శుక్రవారం పలు సూచనలు జారీ చేశారు. ఏప్రిల్ 1, 2026, ఫిబ్రవరి 28, 2027 మధ్య రెండు దశల్లో నిర్వహించనున్న జనగణనకు సంబంధించి ముందస్తు సర్వే అవసరమని పేర్కొన్నారు. ఇది భారత్ చేపట్టనున్న మొదటి డిజిటల్ జనగణన, కులగణనలో మొదటిది కావడం గమనార్హం. ముందస్తు సర్వేలో భాగంగా ప్రజలను అడగాల్సిన ప్రశ్నలు, డేటా సేకరణ పద్ధతులు, శిక్షణ సామర్థ్యం, లెక్కలు, ఇతర వివరాలు, ప్రింటింగ్ ప్రక్రియలు, సమాచార నాణ్యతను మూల్యాంకనం చేస్తుందని భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. జనగణన ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను గుర్తించవచ్చని అన్నారు. డేటా సేకరించడానికి మొదటిసారిగా మొబైల్ యాప్‌ను వినియోగించనున్నామని, స్వీయ గణన, డిజిటల్ మ్యాపింగ్ సాధనాలు, రియల్ టైమ్ పర్యవేక్షణ, నిర్వహణ కోసం వెబ్ ఆధారిత పోర్టల్ వంటి ఇతర అంశాలను జనగణన ముందస్తు సర్వేలో చేపట్టనున్నట్లు పలు రాష్ట్రాల డీసీఓలకు తెలిపారు. చివరిసారిగా జనగణనను 2011లో చేపట్టారు. సాధారణంగా పదేళ్లకొకసారి జనగణన నిర్వహించాల్సి ఉంది. అయితే 2021లో కోవిడ్ మహమ్మారి కారణంగా ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. ఇది ప్రస్తుతం 2027కి పూర్తి కానుంది. ప్రణాళిక ప్రకారం 2021 జనగణనకు సంబంధించి ముందస్తు వ్యాయామం 2019లో చేపట్టినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 76 జిల్లాల్లో 26 లక్షలకు పైగా ప్రజలను ఇందులో చేర్చారని పేర్కొన్నాయి. 2019లో రాష్ట్ర ప్రభుత్వాల నుండి సుమారు 6 వేల మంది గణనదారులు, 1100 మంది పర్యవేక్షకులు పాల్గొన్నారని ఆ వర్గాలు వెల్లడించాయి.

ఆ సమస్యకు ముగింపు పలకండి

మోదీకి నేతాజీ కుమార్తె విన్నపం

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అస్థికలను భారతదేశానికి తీసుకురావాలని ఆయన కుమార్తె అనితా బోస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న నేపథ్యంలో ఆమె ఈ అభ్యర్థన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తన వయసు మీద పడుతున్నందున, ఈ సమస్యకు త్వరగా ఒక ముగింపు పలకాలని ఆమె విన్నవించారు. ప్రస్తుతం జర్మనీలో నివసిస్తున్న 82 ఏళ్ల అనితా బోస్ ఈరోజు ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తే, తన తండ్రి అస్థికలను స్వదేశానికి తీసుకురావాలని కచ్చితంగా కోరతానని ఆమె స్పష్టం చేశారు. "గతంలో పీవీ నరసింహారావు ప్రభుత్వం నా తండ్రి అస్థికలను తీసుకురావడానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వం కొనసాగించాలి. నా వయసు రీత్యా ఈ విషయం నాకు మరింత అత్యవసరంగా మారింది" అని ఆమె భావోద్వే గంగా అన్నారు. "ఈ సమస్యకు ఒక ముగింపు కావాలని నేను కోరుకుంటున్నాను. ఈ బాధ్యతను నా కొడుక్కి వారసత్వంగా ఇవ్వాలని నేను అనుకోవడం లేదు" అని అనితా బోస్ చెప్పారు. ఇది కేవలం తన వ్యక్తిగత విషయం కాదని, తన తండ్రి యావత్ దేశానికి చెందిన వ్యక్తి అని ఆమె గుర్తుచేశారు. 1945 ఆగస్టు 18న తైవాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ మరణించినట్లు పలు జాతీయ, అంతర్జాతీయ విచారణలు నిర్ధారించాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన, అక్కడి సైనిక ఆసుపత్రిలో కన్నుమూశారని నివేదికలు తెలిపాయి. ఆయన అస్థికలను జపాన్‌లోని టోక్యోలో ఉన్న రెంకోజీ బౌద్ధ ఆలయంలోని ఒక కలశంలో భద్రపరిచినట్లు భావిస్తున్నారు.

మూడు లక్షల ఓటర్లకు ఈసీ నోటీసులు

పట్నా: బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మరో మలుపు తీసుకుంది. తాజాగా భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ) బీహార్‌లో ఉంటున్న మూడు లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసింది. వీరు బంగ్లాదేశ్, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందినవారిగా అనుమానిస్తూ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ) నోటీసులను పంపారు. రాష్ట్రంలో కొన్ని లక్షల మంది ఓటరు సవరణల కోసం సమర్పించిన పత్రాలలో వ్యత్యాసాలు కనిపించిన దరిమిలా వారికి ఈసీ నోటీసులు జారీ చేసింది. మొత్తం మూడు లక్షలమంది ఈ తరహా నోటీసులు అందుకున్నారు. వారి పత్రాలలో వ్యత్యాసాలు ఎందుకు ఉన్నాయో వివరించేందుకు వారికి ఈసీఐ ఏడు రోజులు గడువు ఇచ్చింది. 'మూడు లక్షల మంది ఎస్ఐఆర్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేరు నమోదు చేసుకున్నారు. అయితే వారి పత్రాల పరిశీలనలో వ్యత్యాసాలు కనిపించాయి. దీంతో క్షేత్ర స్థాయిలో తనిఖీలు జరిగాయి. ఫలితంగా వీరు బంగ్లాదేశ్, మయన్మార్ లేదా నేపాల్ నుండి వచ్చి ఉండవచ్చనే అనుమానాలు నెలకొన్నాయని అని ఒక అధికారి మీడియాకు తెలిపారు. ఈసీ నోటీసులు పంపి, వివరణ కోరిన ఓటర్లలో అత్యధికులు తూర్పు చంపారన్, పశ్చిమ చంపారన్, మధుబని, కిషన్‌గంజ్, పూర్ణియా, కతిహార్, అరారియా సుపాల్ జిల్లాలకు చెందినవారున్నారు.

ఉత్తరాఖండ్‌లో వరద బీభత్సం

మరోసారి కుంభవృష్టి... అనేక మంది గల్లంతు

చమోలి/భువనేశ్వర్: దేశవ్యాప్తంగా ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలతో వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షం అనేక గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి మేఘ విస్ఫోటనం సంభవించింది. ఈ విపత్తులో పలువురు ప్రాణాలు కోల్పోగా పలుచోట్ల ఇళ్లు కూలడంతో పదుల సంఖ్యలో ప్రజలు శిథిలాల కింద చిక్కుకున్నారు. మోపాటా ప్రాంతంలో భారీ వరదల్లో ఇద్దరు కొట్టుకుపోగా.. పశువుల కొట్టం కూలడంతో దాదాపు 20 పశువులు జలసమాధి అయ్యాయి. మేఘ విస్ఫోటనం కారణంగా రుద్రప్రయాగ్‌లోని అలకనంద, మందాకిని నదుల నీటి మట్టాలు భారీగా పెరుగుతున్నాయి. రుద్రప్రయాగ్‌లోని హనుమాన్ ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో 180కి పైగా రోడ్లు మూసుకుపోయాయి. గురువారం రాత్రి... శుక్రవారం తెల్లవారుజామున ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్, చమోలి జిల్లాల్లో మరోసారి మేఘ విస్ఫోటనం సంభవించింది. దీనివల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఇళ్లు, వాహనాలు కొట్టుకుపోయాయి. అనేక మంది కనిపించకుండా పోవడంతో పాటు గాయపడటం, శిథిలాల కింద చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి 'ఎక్స్' పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు : రుద్రప్రయాగ్ జిల్లాలోని బుస్కేదార్ తహసీల్ పరిధిలోని బరేత్ దుంగర్ టోక్ ప్రాంతంలో, చమోలి జిల్లాలోని దేవల్ ప్రాంతంలో కుంభవృష్టి కారణంగా కొన్ని కుటుంబాలు శిథిలాల ప్రవాహం కారణంగా చిక్కుకున్నాయని బాధకరమైన నివేదిక అందింది. స్థానిక పరిపాలనా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది' అని తెలిపారు. చమోలిలోని మోపాటా గ్రామంలో ఒక ఇల్లు, ఒక గోశాల శిథిలాల కింద కూరుకుపోయాయని, ఒక జంట ఇంకా కనిపించడం లేదని జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ తివారీ తెలిపారు. గాయపడిన స్థితిలో మరో జంటను రక్షించారు. వారి గోశాలకు చెందిన 15 నుంచి 20 జంతువులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు చెప్పారు. రుద్రప్రయాగ్‌లోని బసుకేదార్ ప్రాంతంలో ఎడతెరిపి లేని వర్షం, కొండ చరియలు విరిగిపడటంతో అర డజనుకు పైగా గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది. చెనాగఢ్‌లోని దుంగర్ గ్రామంలో కొండచరియలు విరిగిపడటం, వరదల్లో కొంతమంది తప్పిపోయినట్లు భయపడుతున్నారు. అలకనంద, మందాకిని నదులు ఉప్పొంగి ప్రవహిస్తాయని, శ్రీనగర్-రుద్రప్రయాగ్ మధ్య బద్రీనాథ్ హైవేను వరద నీరు అడ్డుకుంటుందని అధికారులు తెలిపారు. సామాజిక మాధ్యమ వేదికగా పోలీసులు పంచుకున్న ఫొటోలలో వరద ముంపలో చిక్కుకున్న వాహనాలు, ఉప్పొంగుతున్న నదులు కనిపించాయి. నదీ తీరాల దగ్గర నివాసితులు ఇళ్ల నుండి ఖాళీ చేయాలని కోరారు. ప్రభావిత ప్రాంతాలలో సహాయక బృందాలు, పోలీసులను, భద్రతా దళాలను మోహరింపజేశారు.

ఒడిశాలో ముంపులో 100 గ్రామాలు

ఉత్తర ఒడిశాలోని ప్రధాన నదుల నీటి మట్టం ప్రమాద స్థాయి కంటే తక్కువగా ఉన్నప్పటికీ బాలసోర్, భద్రక్, జాజ్‌పూర్ జిల్లాల్లోని సుమారు 100 గ్రామాలు శుక్రవారం వరుసగా ఐదవ రోజు కూడా వరద నీటిలోనే ఉన్నాయని ఒక అధికారి తెలిపారు. గ్రామాలలో సుమారు 30,000 మంది ప్రజలు వరద నీటితో ప్రభావితమయ్యారని చెప్పారు. బాలసోర్‌లోని బలియాపాల్, భోగ్రై బ్లాక్‌ల పరిధిలోని 80 గ్రామాలు దాదాపు 4 అడుగుల ఎత్తులో వరద నీటితో చుట్టుముట్టగా, జాజ్‌పూర్ జిల్లాలోని దస్రత్‌పూర్ బ్లాక్‌లోని 14 ఇతర గ్రామాలలో కూడా ఇదే పరిస్థితి ఉందని అధికారి వివరించారు. భద్రక్ జిల్లాలోని ధమ్‌నగర్ బ్లాక్‌లోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయని అన్నారు. 'వైతరణి నదిలో నీటి మట్టం తగ్గుముఖం పట్టినప్పటికీ గత ఐదు రోజులుగా మా గ్రామాల్లో వరద నీరు నిలిచి ఉంది. ఫలితంగా అది నా ఇంటిని దెబ్బతీసింది. ఇంట్లోని వస్తువులు, ధాన్యం, పశు దాణా నష్టపోయాను' అని దస్రత్‌పూర్ బ్లాక్‌కు చెందిన వరద బాధిత వ్యక్తి రబింద సమల్ అన్నారు. వరద కారణంగా నీటి వనరులన్నీ కలుషితమైనందున తాగునీరు ఒక పెద్ద సమస్య అని అదే బ్లాక్‌కు చెందిన సబితా స్వైన్ అనే యువతి తెలిపారు. వైతరణి నది ఉపనది అయిన కని నది కట్ట తెగిపోవడం వల్ల దస్రత్‌పూర్ ప్రాంతం అకస్మాత్తుగా మునిగిపోయిందని స్వైన్ చెప్పారు. అధికారిక నివేదికల ప్రకారం, కని నది కట్ట వద్ద 100 అడుగుల ఎత్తు గండి పడటం వల్ల వారి గ్రామాలలోకి వరద నీరు ప్రవహించిన తరువాత దస్రత్‌థోర్ బ్లాక్‌లోని కసప, మలికాపూర్ గ్రామ పంచాయతీలకు చెందిన కనీసం 14 గ్రామాలకు చెందిన 8 వేల మందికి పైగా ప్రజలు ఇప్పటికీ వరదలో చిక్కుకుపోయి ఉన్నారు. 5 వేల మందికి పైగా ప్రజలు సమీప పాఠశాల భవనాల్లో ఆశ్రయం పొందుతున్నారు. సువర్ణరేఖ నదిలో ఈ సంవత్సరం జూన్ నుంచి ఇది ఆరవ వరద అని బాలాసోర్ జిల్లా నుంచి వచ్చిన నివేదిక తెలిపింది. బాలాసోర్‌లోని నాలుగు బ్లాక్‌ల బాధిత ప్రజలకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని స్థానిక సర్పంచ్ ఒకరు కోరారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఓటర్ల, పోలింగ్ స్టేషన్ల జాబితాలో
అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామ పంచాయితీలలో ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాలో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30వత తేదీ వరకు స్వీకరిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2025, జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల వారి ఓటరు జాబితానుసరించి గ్రామ పంచాయితీ, వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేయడం జరిగిందని, వీటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 వరకు సరిచేసుకోవచ్చని అన్నారు. అలాగే పోలింగ్ బూత్ ల జాబితాలో అభ్యంతరాలు వున్నా తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ నెల 30న ఆయా మండలాల్లో ఎంపీడీఓలు నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశంలో కూడా అభ్యంతరాలు తెలుపవచ్చని అన్నారు. దీని ఆధారంగా ఈ నెల 31న ఆయా అభ్యంతరాలను జిల్లాలోని జిల్లా పంచాయితీ అధికారులు పరిష్కరిస్తారని అన్నారు. ఈ నెల 2న గ్రామ పంచాయితీలలో వార్డుల వారిగా ఫోటోలతో కూడిన తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. డీపీఓ సురేష్ మోహన్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్రెడ్డి, బీజేపీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, సీపీఐ నాయకులు పాలమాకుల జంగయ్య, సీపీఎం నాయకులు పగడాల యాదయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు రామేశ్వరరావు, ఎంఐఎం నాయకులు తౌసిఫ్ మొహమ్మద్, ఇతర నాయకులు బి.సుధాకర్రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, నిట్టు జగదీశ్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో పలువురికి మంచి చేసేలా కృషి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మన విధి నిర్వహణలో మనం చేయగలిగినంత మంచి, సహాయం ప్రజలకు చేయాలని అందులో భాగంగానే జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు తన పదవి విరమణరోజు కూడా తన వంతుగా సైక్లింగ్‌లో బాలికలు రాణించాలనే సదుద్దేశ్యంతో వారికి సైకిళ్లు ఇప్పించాలని ఫైల్ పెట్టి అనుమతి పొందినారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమావేశ మందిరంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డిలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావును శాలువ, పూల బొకెతో సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు 35 సంవత్సరాల సుదీరా ప్రయాణం చేసి తన కేరీర్ ను విజయవంతం చేసుకొని మిగిలిన ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి వరకు దాదాపు 14 జిల్లాలలో తన సేవలను అందించారన్నారు. మనం వెనక్కి తిరిగి చూసుకుంటే మనం సంపాదించుకున్న పేరు, మంచితనం కనపడాలని కలెక్టర్ అన్నారు. పదవి విరమణ అనంతరం గోపాల్ రావు తన కుటుంబానికి, తన వ్యక్తిగతంగా సమయం కేటాయించి ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని కలెక్టర్ కోరుకున్నారు. డిఆర్ఓ హరిప్రియ, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా మైనారిటీ అధికారి కాంతమ్మ,డిఎం అండ్ హెచ్ఓ ఉమాగౌరీ, బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి,సివిల్ సప్లై డిఎం సుగుణబాయి, అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎఓరాంమోహన్, ఎల్డిఎం శివప్రసాద్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధలో న్యాయం, పారదర్శకత, సమగ్రతలకు ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్, శేరిలింగంపల్లి : ప్రముఖ విద్యావేత్త, దార్శనికుడు, మేనేజ్‌మెంట్ విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ప్రీతమ్ సింగ్ స్మారకార్థం డాక్టర్ ప్రీతమ్ సింగ్ ఫౌండేషన్, ఐఐఎల్ఎం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మాదాపూర్‌లో ఉన్న టెక్ మహీంద్రాలో 'మానవ మూలం : కృత్రిమ మేధ, నైతికత, భవిష్యత్తు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. భారతదేశంలో కృత్రిమ మేధ (ఏఐ) శక్తిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి? నైతికత, సమగ్రత, మానవ విలువలను ఎలా కాపాడుకోవాలి? అనే అంశాలపై చర్చించేందుకు విధాన రూపకర్తలు, వ్యాపార నాయకులు, విద్యావేత్త లను ఈ వేదిక ఒకచోట చేర్చింది. ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ అల్గారిథమ్ పక్షపాతం, డేటా గోప్యతకు ముప్పు, ఉద్యోగాల కోత వంటి అంశాలపై హెచ్చరించారు. అయితే, విస్తృతంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. హైదరాబాద్ కృత్రిమ మేధ ఆధారిత ఆవిష్కరణలు, నైతికతకు హబ్‌గా ఎదుగుతోందని చెప్పారు. ఉన్నత విద్యలో కృత్రిమ మేధ లిటరసీ, డేటా సైన్స్, ఎథిక్స్‌ను అనుసంధానించడం అవసరమన్నారు. అల్గారిథమ్ పక్షపాతంపై ఆడిట్ చేయడం, బాధ్యతాయుతంగా కృత్రిమ మేధను అనుసరించడం అవసరమని తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ చైర్మన్ కంటిపూడి పద్మనాభయ్య, మాజీ చైర్మన్ పీ. ద్వారకానాథ్, ఐఐఎల్ఎం యూనివర్సిటీ డైరెక్టర్ చతుర్వేది, ఐడీఆర్‌బీటీ డైరెక్టర్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపక్ కుమార్, సిగ్నోడ్ ఆసియా పసిఫిక్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ మహేశ్వరి, డా.విపుల్ సింగ్, ఆర్థికవేత్త, రచయిత, క్రక్స్ సహ స్థాపకుడు ప్రొఫెసర్ వికాస్ సింగ్ పాల్గొని ప్రసంగించారు.

గణనాథుడి పూజలలో కొలను శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి న్యూ శ్రీనివాస కాలనీలోని వివిధ వినాయకుడిని మండపాలలో ఘనంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమలలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ఆయన చేతుల ప్రారంభించారు. అనంతరం కొలను శ్రీనివాస్ రెడ్డిని కాలని ప్రజలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ మన్నే మహేష్ యాదవ్, కమిటీ సభ్యులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

1291 ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులు

రూ.374 కోట్ల నష్టం వాటిలినట్లు నివేదించిన అధికారులు

వీలైనంత త్వరగా రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారీ వర్షాల కారణంగా పంచాయతీరాజ్ రహదారులు దెబ్బతిన్న నేపథ్యంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శుక్రవారం ఈఎన్సీ ఎన్. అశోక్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దెబ్బతిన్న రహదారుల వివరాలపై ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా 1291 ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నట్లు అధికారులు మంత్రికి నివేదించారు. వీటి తాత్కాలిక మరమ్మత్తుల కోసం రూ.22.71 కోట్లు, శాశ్వత మరమ్మత్తుల కోసం రూ. 352 కోట్లు, మొత్తంగా గ్రామీణ రహదారుల పునరుద్ధరణ కోసం రూ.374.71 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. మొత్తం 22 గ్రామాలకు రాకపోకలు దెబ్బతినగా.. వాటిలో 14 గ్రామాలకు తాత్కాలికంగా రహదారులను పునరుద్ధరించినట్లు ఈఎన్సీ ఎన్.అశోక్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా వీలైనంత త్వరగా రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్న గ్రామాలకు యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలనీ సూచించారు. వర్షాలకు తడిచి కూలే ప్రమాదం ఉన్న పంచాయతీరాజ్ భవనాలను తక్షణం ఖాళీ చేయించాలని..పంచాయతీరాజ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు వేగంగా చేపట్టాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

వర్షం కారణంగా దెబ్బతిన్న 580 అంగన్వాడి భవనాలు...

రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా అంగన్వాడీ కేంద్రాలకు నష్టం జరిగింది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు అధికారులు సమగ్ర నివేదిక సిద్ధం చేసి సీఎస్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించారు. సొంత భవనాల్లో నడుస్తున్న 440 అంగన్వాడీ కేంద్రాలు, రెంట్ ఫ్రీ భవనాల్లో నడుస్తున్న మరో 140 కేంద్రాలు కలిపి మొత్తం 580 భవనాలు వర్షాల ప్రభావంతో దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. పైకప్పుల లీకేజీలు, గోడలు, బేస్‌మెంట్‌లో పగుళ్లు, ఫ్లోర్ దెబ్బతినడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపించాయి. అంగన్వాడి భవనాలకి ఈ క్రింది జిల్లాల్లో ఎక్కువగా నష్టం వాటిల్లింది. భద్రాద్రి కొత్తగూడెం - 75, నిర్మల్ -100కు పైగా, కామారెడ్డి - 49, గద్వాల్ - 40, హనుమకొండ - 25, మెదక్ - 25, వనపర్తి - 22, ఆసిఫాబాద్ - 20, ములుగు -20, ఈ భవనాల మరమ్మత్తులకు భారీగా నిధులు అవసరమవుతాయని అంచనా వేశారు. సొంత భవనాల మరమ్మత్తులకు రూ. 14 కోట్ల రూపాయలు, రెంట్ ఫ్రీ భవనాల మరమ్మత్తులకు రూ. 3 కోట్లు ఖర్చవుతుందని అధికారులు లెక్కగట్టారు. భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, కామారెడ్డి, గద్వాల్, హనుమకొండ, మెదక్, వనపర్తి, ఆసిఫాబాద్, ములుగు వంటి జిల్లాల్లో వందల సంఖ్యలో అంగన్వాడీ భవనాలు దెబ్బతిన్నాయి. కొన్ని కేంద్రాల్లో వర్షపు నీరు లోపలకు చేరడంతో బియ్యం, పప్పులు, పాల డబ్బులు, నూనె ప్యాకెట్లు, స్టడీ మెటీరియల్ తడిసి ముద్దయ్యాయి. ఈ నేపథ్యంలో తడిసిన భవనాల్లో అంగన్వాడీ సేవలు తక్షణం నిలిపివేయాలని, సమీపంలోని ప్రభుత్వ భవనాలు లేదా పాఠశాల ప్రాంగణాల్లో కేంద్రాలను తాత్కాలికంగా తరలించాలని మంత్రి సీతక్క అధికారులు ఆదేశించారు. అలాగే తడిసిపోయిన సరుకుల బదులుగా వెంటనే కొత్త సరుకులను సరఫరా చేయాలని స్పష్టం చేశారు. పిల్లల పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, విద్య ఒక్కరోజు కూడా అంతరాయం లేకుండా కొనసాగాలని మంత్రి సీతక్క హితవు పలికారు. అంగన్వాడి సేవలు నిరంతరం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గణేశ్ నిమజ్జనానికి జీహెచ్ఎంసీ పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గణేశ్ నిమజ్జనాన్ని సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు వీలుగా జీహెచ్ఎంసీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. పోలీస్ శాఖ, హైడ్రా, ట్రాఫిక్, రెవెన్యూ, ఇరిగేషన్, వాటర్ బోర్డు, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్ అండ్ బి, పర్యాటక శాఖ, విద్యుత్, ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేస్తూ, నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా జరిగేలా పకడ్బందీ కార్యాచరణను సిద్ధం చేసింది.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా గణేష్ నిమజ్జనం ఆధ్యాత్మిక వాతావరణంలో సాఫీగా జరిగేలా కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రధాన చెరువులతో పాటు 74 కృత్రిమ కుంటలలో నిమజ్జనం...

ఈసారి నిమజ్జనం హుస్సేన్ సాగర్, సరూర్ నగర్ చెరువు, ఐడిఎల్ చెరువు, సఫిల్‌గూడ చెరువు, సున్నం చెరువు సహా 20 ప్రధాన చెరువుల్లో జరుగుతుంది. అదనంగా 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలు (బేబీ పాండ్లు, మట్టికుంటలు, తవ్వక కుంటలు, పోర్టబుల్ ట్యాంకులు, మొబైల్ కుంటలు) జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. తద్వారా ప్రధాన చెరువుల పై ఒత్తిడి తగ్గనుంది. నిమజ్జనం వేగంగా, సురక్షితంగా, సాఫీగా జరిగేలా 134 స్టాటిక్ క్రేన్లు, 269 మొబైల్ క్రేన్లు సిద్ధం చేశారు. పర్యాటక శాఖ,హైడ్రా సమన్వయంతో హుస్సేన్ సాగర్ వద్ద ప్రత్యేకంగా 9 పడవలు, 16 డీఆర్ఎఫ్ బృందాలు, 200 ఈతగాళ్లను జీహెచ్ఎంసీ అందుబాటులో ఉంచుతుంది. 839.42 కి.మీ. ఊరేగింపు మార్గాల్లో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, వేలాడే వైర్ల తొలగింపు పనులు పూర్తయ్యాయి. 14,486 శానిటేషన్ సిబ్బంది, 160 గణేశ్ యాక్షన్ టీమ్‌లు మూడు షిఫ్ట్ లలో నిరంతరాయంగా విధులు నిర్వర్తిస్తారు.గణేష్ మండపాల వద్ద వ్యర్థాల సేకరణకు 5 లక్షల ట్రాష్ బ్యాగులు పంపిణీ చేశారు. అదనంగా 2,000 స్వీపర్లు, 102 మినీ టిప్పర్లు, 125 జేసీబీలు, 30 స్వీపింగ్ మెషిన్లు నిమజ్జన దినాన చెత్త తొలగింపులో పాల్గొంటాయి. ప్రజల కోసం 309 మొబైల్ టాయిలెట్స్, 56,187 లైటింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆరోగ్య భద్రత కోసం 7 మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లతో మూడు షిఫ్ట్‌లలో పని చేస్తున్నారు. ప్రజలకు ఉచితంగా 2 లక్షల మట్టి గణేశ్ విగ్రహాలను జీహెచ్ఎంసీ పంపిణీ చేసింది. అందులో 1 లక్ష విగ్రహాలు జీహెచ్ఎంసీ, మరో 1 లక్ష విగ్రహాలు టీజీపీసీబీ ద్వారా అందించబడ్డాయి. భక్తులు ప్రమాదాల బారిన పడకుండా చూసేందుకు వీధి కుక్కలను పట్టుకొనే వాహనాలను మండపాలు, నిమజ్జన పాయింట్ లలో సిద్ధంగా అందుబాటులో ఉంచుతున్నారు. రోడ్డు సేఫ్టీ డ్రైవ్ లో భాగంగా ఊరేగింపు జరిగే మార్గాల తో పాటు నగరంలో 10,269 గుంతలను జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం పూడ్చివేసింది. రోడ్డు మరమ్మతులు కూడా పూర్తి చేసింది. గత సంవత్సరం మాదిరే ఈ సంవత్సరం కూడా గణేశ్ నిమజ్జనం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ స్పష్టం చేశారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనాన్ని జరుపుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రశాంతంగా వినాయ నిమజ్జనాన్ని జరుపుకోవాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. వినాయ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం శామీర్ పేట్ చెరువులో నిర్వహిస్తున్న ఏర్పాట్లను అడిషనల్ డిసిపి పురుషోత్తంతో కలిసి కలెక్టర్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ బి వారు నిర్మిస్తున్నరోడ్డును పరిశీలించి, వినాయక వాహనాల రాకపోకలకు సరిపడే విధంగా రోడ్డు నిర్మించాలని సూచించారు. చెరువులో నీటి శాతం పెరిగినందున నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఏలాంటి ప్రమాదాలు జరుగకుండా బ్యారికేడింగ్ పకడ్బందీగా నిర్మించాలని సూచించారు. చెరువు దగ్గరరెండు పాయింట్లలో క్రేన్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, లైటింగ్, శానిటేషన్, వైద్య సదుపాయం, త్రాగునీరు, టాయిలెట్లు అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో కంటె ఎక్కువ వినాయక విగ్రహాలు నిమజ్జనం అవుతాయని అందుకనుగుణంగ ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. పోలీసు, ట్రాఫిక్ బందోబస్తు, మత్య, ఫైర్ శాఖల వారు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు. చెరువు పరిసర ప్రాంతాలలో ఉన్న చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటి అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట్ ఎంఆర్ఓ యాదగిరిరెడ్డి, అర్ అండ్ బి అధికారి శ్రీనివాస్ మూర్తి, శామీర్ పేట్ సిఐ శ్రీనాథ్, ఎస్ఐ శశివర్ధన్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ మధుసూదన్, విద్యుత్తు శాఖా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

31న ఎస్వీకి గిడుగు జాతీయ జీవన సాఫల్య పురస్కారం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సుప్రసిద్ధ కవి, విమర్శకులు, పరిశోధకులు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణకు తొలి తెలుగు భాషా శాస్త్రవేత్త, వ్యావహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని ఈ నెల 31న ఉదయం 10.30 గంటలకు రవీంద్ర భారతిలో ప్రదానం చేయడం జరుగుతుంది. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ప్రతియేటా ప్రతిభావంతులైన కవులకు, సాహితీవేత్తలకు అందజేసే గిడుగు జాతీయ జీవన సాఫల్య పురస్కారానికి ఈయేడాది (2025) ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ఎంపికయ్యారు. ఎస్వీ అన్న సంక్షిప్త నామంతో ప్రఖ్యాతులైన ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ 30 గ్రంథాలను రచించారు. మరో 34 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులుగా, ఆర్ట్స్ విభాగం డీన్‌గా, ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులుగా బాధ్యతలు నిర్వహించిన ప్రొఫెసర్ ఎస్వీ - తెలుగు విశ్వవిద్యాలయం పదవ ఉపకులపతిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. వారి హయాంలోనే బాచుపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో బాలుర వసతిగృహం నిర్మించబడింది. 'హలో విద్యార్థి -చలో క్లాస్‌రూం' అంటూ ఆయన ఇచ్చిన నినాదం బహుళ ప్రజాదరణ పొందింది. గతంలో ఒక పర్యాయం కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్న ఎస్వీ ప్రస్తుతం రెండవ పర్యాయం ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. సరిగమలు, జీవజ్వాల, యుద్ధం జరుగుతూనే ఉంది, జీవితం ఒక ఉద్యమం, ఉద్యమం ఉద్యమే వంటి కవితా సంపుటులను తెలుగులో ఉద్యమ గీతాలు, దృక్పథాలు, సత్యానుశీలన మొదలైన ప్రామాణిక పరిశోధన గ్రంథాలను రచించిన ఎస్వీ దళితవాద వివా దాలు, స్త్రీవాద వివాదాలు, గ్లోబలైజేషన్ కథలు, ప్రపంచీకరణ ప్రతిధ్వని వంటి ఉత్తమ గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. అనేక మంది ప్రముఖుల జీవిత చరిత్రలను గ్రంథస్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం, ముఖ్దూం జాతీయ పురస్కారం, శ్రీశ్రీ స్వర్ణ పతకం, తుమ్మల పురస్కారం మొదలైన 30కి పైగా సాహితీ సత్కారాలు, పురస్కారాలు పొందిన ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ సాహిత్య, సాంస్కృతిక, పరిశోధన, పరిపాలనారంగాలకు చేస్తున్న విశిష్టమైన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నాం.

హిమాలయ వెల్‌నెస్ 'వరల్డ్ ఆఫ్ నీమ్' ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : హిమాలయ వెల్‌నెస్ గత ఇరవై ఐదు ఏళ్లుగా నీమ్ శక్తితో మొటిమలు, మొటిమలతో పోరాడుతున్న యువ భారతీయులకు నమ్మకమైన తోడుగా ఉంది. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ చర్మ సంరక్షణపై అవగాహన కల్పించేందుకు మొదటిసారిగా 'ది వరల్డ్ ఆఫ్ నీమ్' ఈవెంట్‌ను తాజ్ లాండ్స్ ఎండ్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొటిమలు, ఆత్మవిశ్వాసంపై ఇంటరాక్టివ్ ప్యానల్ చర్చ నిర్వహించారు. ఈ చర్చను ప్రముఖ డెర్మటాలజిస్ట్, కాస్మెటాలజిస్ట్, వైద్య నిపుణురాలు డాక్టర్ రష్మి శెట్టి నడిపించారు. ఆమె సాధారణంగా ఉన్న అపోహలను నివృత్తి చేస్తూ, సంపూర్ణమైన చర్మ సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. 'లపటా లేడీస్' చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన సెలబ్రిటీ నితాన్షి గోయల్ తన వ్యక్తిగత చర్మ అనుభవాలను పంచుకున్నారు. 'పింపుల్స్ అనేవి ఎదుగుదలలో భాగం మాత్రమే, దాచుకోవాల్సినవి కావు' అని చెప్పారు. వీరిద్దరూ కలిసి యువ ప్రేక్షకులను తమ చర్మాన్ని గర్వంగా, పాజిటివ్‌గా స్వీకరించేందుకు ప్రేరేపించారు. హిమాలయ తన ప్రసిద్ధ నీమ్ ఫేస్‌వాష్ ను కూడా ఈ వేడుకలో ప్రదర్శించింది. ఈ సందర్భంలో హిమాలయ వెల్‌నెస్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డివిజన్ బిజినెస్ డైరెక్టర్ రాజేష్ కృష్ణమూర్తి, హిమాలయ వెల్‌నెస్ బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెటింగ్ డైరెక్టర్ రాగిణి హరిహరన్, బాలీవుడ్ స్టార్ నితాన్షి గోయల్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..



విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : హఫీజ్పేట్ డివిజన్ పరిధిలో ని హఫీజ్పేట్‌లో వినాయక చవితి పర్వదినంను పురస్కరించుకుని వినాయక మండపం వద్ద నిర్వహించిన పూజ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగించి విజయాలను దరిచేర్చేవాడు వినాయకుడు. అని అందుకే ఆయన్ను విఘ్నేశ్వరుడు అంటారని అన్నారు. దేవగణాలకు అధిపతి కాబట్టి గణపతిగా పూజలు అందుకుంటున్నాడు అని సకల లోకాల సర్వ జనులకు శుభాలు కలిగించే ఆ బొజ్జ గణపయ్య పండుగవినాయకచవితిని అందరూ ఘనంగా జరుపుకుంటారు అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియజేసారు. పండుగ ను చక్కటి వాతావరణం లోకుటంబ సభ్యుల మధ్య ఆనందాయకంగా, సంతోషకరంగా జరుపుకోవాలని పిలుపునివ్వడం జరిగినది. అదేవిదంగా వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించుకోవడానికి అన్ని రకాల వసతులు కలిపించాలని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ అధికారులను ఆదేశించడం జరిగినది. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చక్కటి వాతావరణం లో జరుపుకునేందుకు వీలుగా అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్,మారబోయిన రాజు యాదవ్, ప్రసాద్, వెంకటేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, రాజు యాదవ్ భక్తులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రిని మంజూరు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలోనే లేబర్ జిల్లాగా ప్రఖ్యాతి చెంది వేలాదిమంది కార్మికులు ఉన్న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఈఎస్ఐ వైద్య సేవలు ఏవి అని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. శుక్రవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని మంజూరు చేయాలని, వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల్, నారాయణపేట నూతన జిల్లాలో నూతన ఈఎస్ఐ డిస్పెన్సరీలు మంజూరు చేయాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీల పెండింగ్ ఇంటి అద్దెల బడ్జెట్ తక్షణమే విడుదల చేయాలని,ఈఎస్ఐ ఖాతాదారులకు నాణ్యమైన ఈఎస్ఐ వైద్య సేవలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఈఎస్ఐ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్రాంచ్ మేనేజర్ ఎం.డి.అనిష్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వేలాది మంది కార్మికులకు ఈఎస్ఐ కార్డులు ఉన్నప్పటికీ అనారోగ్యాలకు గురైన ఈఎస్ఐ లబ్ధిదారులకు వైద్యం అందడం లేదని వాపోయారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో బాలనగర్ జడ్ చర్ల మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో రెండు ఈఎస్ఐ డిస్పెన్సరీలు మాత్రమే ఉన్నాయని అన్నారు. వీటిలో కూడా మెరుగైన వైద్యసేవలు అందడం లేదని, ఈఎస్ఐ డిస్పెన్సరీలలో మౌలిక వసతులు,సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాల లెమి కారణంగా హైదరాబాద్ ఈఎస్ఐ ఆసుపత్రికి రెఫరల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నూతన జిల్లాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్న వనపర్తి నాగర్ కర్నూల్ గద్వాల్ నారాయణపేట జిల్లాలో ఒక్క ఈఎస్ఐ డిస్పెన్సరీ కూడా లేదని,దీన్ని ఫలితంగా ఆ ప్రాంతాల ఈఎస్ఐ కార్డుదారులు మహబూబ్ నగర్ కి వచ్చి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈఎస్ఐ సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, ఈఎస్ఐ కార్డుదారులు ఎస్ దేవానంద్, భాస్కర్,శేఖర్, యాదయ్య,రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమరంలో విజయం సాధిద్దాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్: స్థానిక సమరంలో విజయం సాధిద్దాం రండి అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేశంపేట మండల కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ కేశంపేట మండల కేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వరప్ప ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపే అభ్యర్థులు విజయం సాధించే దిశగా ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలకు నాయకులకు తాను ఎల్లవేళలా రుణపడి ఉంటానని చెప్పారు. నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చిన కార్యకర్తల కోసం తాను కూడా రాత్రింబవళ్లు గెలుపు కోసం కృషి చేసి మిమ్మల్ని గెలిపించే బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విడిపోతే చెడిపోతామని రాజకీయాలు ఎవరికి శాశ్వతం కావని అందరి మధ్య ఉండే స్నేహభావం ఆప్యాయత అభిమానం ఎంతో గొప్పగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీలో ఎంతో ఐక్యత ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో లేనిపోని రాజకీయాలకు బలి కావద్దని పార్టీ సూచించిన వ్యక్తులను శక్తులుగా మలిచి గెలిపించుకునే బాధ్యత కార్యకర్తలపై ఉందని గుర్తు చేశారు. తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని పార్టీ ప్రణాళికా బద్ధంగా స్థానిక ఎన్నికల్లో ముందుకు సాగుతుందని సూచించారు. ఇలాంటి అనుమానాలు పెట్టుకోకుండా పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు నాయకులు ఐక్యతగా సమిష్టి కృషితో విజయాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, వీరేశం,తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, శివ శంకర్ గౌడ్, బాలరాజు గౌడ్, కరుణాకర్, రఘునాయక్, జంగ నరసింహ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకొని హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిజెఆర్ స్టేడియం లో క్రీడాకారులతో కలిసి క్రీడదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాకీ మాంత్రికుడు మేజర్ ద్యాన్ చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు క్రీడల వైపు అసక్తి కనబరచాలని, తద్వారా జీవితంలో అన్ని రంగాలలో రాణించవచ్చని తెలంగాణ హాకీ రాష్ట్ర అధ్యక్షుడు, హెూప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలు క్రీడల కోచ్‌లను ప్రత్యేకంగా హెూప్ ఫౌండేషన్ ద్వారా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు డగ్లస్, రవీందర్, వెంకటేశ్, నవీన్, మహేశ్, సురేశ్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: మొయినాబాద్ మండల కేంద్రం లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో వివిధ కళాశాలల పాఠశాలల్లో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొయినాబాద్ మండల కేంద్రంలో అనేక ప్రైవేట్ జూనియర్ కళాశాలలు నిర్వహిస్తున్నారని, రాజకీయ ఒత్తిడులకు తలొగ్గి ప్రభుత్వ పెద్దలు మండలంలో జూనియర్ కళాశాలను రాకుండా అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఇప్పటివరకు మండల పరిధిలో కనీసం ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా అభివృద్ధి పేరుతో ఊదరగొడుతున్న ఎమ్మెల్యే, దాస పలుకుతున్న స్థానిక నేతలు గాని దీనిని చిన్న విషయంగా కొట్టిపారేసే ప్రయత్నం చేయొద్దని తెలిపారు. మొయినాబాద్ మండల పేద విద్యార్థుల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని రాజకీయాల కతీతంగా మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి తమ ఔన్నత్యాన్ని చాటుకుంటే మంచిదన్నారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షక కార్యదర్శులు చరణ్ గౌడ్, విష్ణువర్ధన్, సాయిరాం, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉంది

విశాలాంధ్ర - బషీర్ బాగ్: దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉందని, 2047 నాటికి ప్రపంచంలో దేశాన్ని గొప్ప దేశంగా తీర్చిదిద్దాలనుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ, తెలుగు రాష్ట్రాల సీఎంలు ఎ.రేవంత్ రెడ్డి, చంద్రబాబునాయుడు ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ సౌత్ జోన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ జార్జిరెడ్డి పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలైన మద్యం, డ్రగ్స్, గంజా తదితర వాటికి బానిసై జీవితాలను, కుటుంబాలను నాశనం చేసుకోరాదని, భవిష్యత్తు తరాలకు తమ శక్తియుక్తులను ఉపయోగించాలన్నారు. శుక్రవారం లివింగ్ బ్రెడ్ సొసైటి సహకారంతో 'యువతలో మద్యం, నికోటిన్, గంజాయి, మత్తు పదార్థాల వ్యసనం'పై నిర్వహించిన అవగహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యసనాలకు బానిసైన కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, ఒకరికి మరొకరి సంబంధాలు లేకుండా జీవితాలు ఆరిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యావంతులైన యువత వ్యసనాలకు దూరంగా ఉండి, వ్యసనాలు లేని భారత దేశంగా తీర్చిదిద్దటానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. బీ టూ బీ ఇండియా సైట్ డైరెక్టర్ అభిలాషా కర్నాటి, ఫ్యామిలీ కౌన్సిలర్ డా.రాధా మాథ్యూస్, సీఎఫ్ఐ ఫౌండర్ జవహర్ కెన్నడీ, కో-ఆర్డినేటర్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

తెలుగుభాష దినోత్సవ, స్పోర్ట్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీ "బి.బ్లాకులో లేనిదే స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్‌లో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు జరుపుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుధా మాట్లాడుతూ గురజాడ గుర్రం జాషువా. శ్రీ శ్రీ దాశరధి కృష్ణమాచార్య, రంగాచార్య. సినారె. కృష్ణ దేవారాయాలు. బ్రాహ్మణ పోతన్న వంటి కవులను సాహితీ పోషకులు. భాష పరిశోధకుల చిత్రపటాలు ప్రదర్శించి వారి గురించి తెలియజేయడం జరిగింది అని అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు గ్రాంధికములో ఉన్న సాహిత్యాన్ని ప్రజల వాడక భాషలోకి తీసుకొచ్చారని తెలుగు భాష కోసం 30 సంవత్సరాల ఉద్యమం చేశారని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులతో స్పోర్ట్స్‌డే వేడుకలు నిర్వహించారు పిల్లల ఎదుగుదలకు ఆటలు ఎంతో ఉపయోగపడుతుందని చదువుతోపాటు పిల్లలకు ఆటలు ఎంతో అవసరమని మానసికంగా శరీరకంగా కలిగే లాభాల గురించి తెలిపారు, అధ్యాపకులు. పి టి సురేందర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,

విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే యెన్నం కృషి అభినందనీయం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్ నగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ నియోజకవర్గంలో పదవతరగతి విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ వాటి వినియోగించడం వలన కలిగే ఫలితాలు, వినియోగించే విధానాలు తదితర అంశాలపై మంత్రిగారికి సుదీర్ఘంగా వివరించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత గత రెండు సంవత్సరాలలో వచ్చిన పదవ తరగతి ఫలితాల పెరుగుదల మార్పులు గురించి మంత్రికి ఎమ్మెల్యే గారు వివరించారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో కేవలం 60 నుంచి 65 శాతం పాస్ పర్సెంటేజ్ ఉండేదని, డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను విద్యార్థులు వినియోగించడం చేత మొదటి సంవత్సరం 21 శాతం మేరకు ఫలితాలు అధికంగా వచ్చాయని, రెండో సంవత్సరం మరింత పెరిగి 92 శాతం వరకు పాస్ పర్సెంటేజ్ చేరిందని, ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి శతశాతం అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మంత్రిగారికి తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోర్డులలో స్టడీ కంటెంట్ ను లోడ్ చేసి ఉపాధ్యాయులకు డిజిటల్ బోర్డుల వినియోగం పైన నిపుణుల చేత ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతినిత్యం ఉపాధ్యాయులతో పాటుగా విద్యార్థులు డిజిటల్ బోర్డులను ఉపయోగించే విధంగా కార్యక్రమాలు చేస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నామని మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ తో పాటు డిజిటల్ బోర్డులో వినియోగించే డిజిటల్ స్టడీ మెటీరియల్స్ తన జిల్లాలోని విద్యార్థులకు కూడా అందుబాటులోకి తెస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్న పదవ తరగతి వార్షిక ఫలితాల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఐలా త్రిపాఠి మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాలు పెంచేందుకు ప్రభుత్వ నిధులు కేటాయించి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని నియోజకవర్గాల్లో డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయడానికి తాను కృషి చేస్తానని ఆమె తెలిపారు.

తెలంగాణ క్రీడా కార్యక్రమాలు దేశానికి ఆదర్శం

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత క్రీడలకు చిరస్థాయిగా ప్రేరణ నిచ్చిన మహానుభావుడు ధ్యాన్ చంద్ స్ఫూర్తితో క్రీడా సమాజం ముందుకెళ్లాలని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగినజాతీయ క్రీడా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అద్భుతమైన క్రీడా ప్రతిభతో వరుసగా మూడు ఒలంపిక్స్ గోల్డ్ మెడల్ సాధించిన ధ్యాన్ చంద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి క్రీడాకారుడు ఒలంపిక్స్ మెడల్స్ లక్ష్యంగా ముందుకెళ్లాలని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహాన్ని అందుకొని తెలంగాణలో ఒలంపిక్స్ క్రీడలు నిర్వహించడమే కాదు ఒలంపిక్స్ పతాకలు సాధించడంలో కూడా తెలంగాణ క్రీడాకారులు ముందుండాలని మంత్రి అన్నారు. నూతన క్రీడా విధానం ఇస్తున్న ప్రోత్సాహంతో క్రీడాకారులు తమ ప్రతిభను చాటి తెలంగాణ రాష్ట్రానికి వన్నె తేవాలని ఆయన కోరారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది రోజులపాటు,అత్యంత ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు నిర్వహించి క్రీడా స్ఫూర్తిని చాటుతున్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయన్నారు. క్రీడా కార్యక్రమాలతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడాల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, మాట్లాడుతూ, ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోనే వినూత్నమైన విభిన్నమైన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, హైదరాబాద్ నగరంలోనే కాకుండా అన్ని జిల్లా కేంద్రాల్లో క్రీడా శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఇటీవల వివిధ క్రీడాంశాల్లో పత కాలు సాధించిన క్రీడాకారులకు నగదు పురస్కారాలతో సన్మానం చేశారు. 41 మంది క్రీడాకారులకు ఒక కోటి 29 లక్షల వరకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జాతీయ క్రీడల్లో పారా క్రీడాకారులకు కూడా పెద్ద ఎత్తున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న కోచులకు ఆపదలో ఆపన్న హస్తం అందించాలన్న ఉద్దేశంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ రూపొందించిన గురు వందనం బీమా పథకాన్ని మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా ఇటీవల వివిధ పథకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులను తీర్చిదిద్దిన పలువురు కోచులను ఈ సందర్భంగా సన్మానించారు. అదేవిధంగా స్పోర్ట్స్ అథారిటీ అధికారులను సిబ్బంది పలువురుని సన్మానించారు. వివిధ క్రీడా కార్యక్రమాల్లో స్పోర్ట్స్ అథారిటీ సమన్వయం ఆకారం అందజేసిన ఫ్యూచర్ ఒలంపియన్స్ సంస్థకు హైదరాబాద్ రన్నర్స్ కు సెలబ్రేషన్ మేకర్స్ సంస్థ ప్రతినిధులను క్రీడా శాఖ మంత్రి అభినందించారు.

ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, కోశాధికారి సతీష్ గౌడ్ వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు కోచులు సిబ్బంది క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల పదవి విరమణ వయసు పెంచొద్దు

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : ప్రొఫెసర్ల్ పదవి విరమణ వయసు పెంచొద్దు అంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ లో గల జయశంకర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ వర్సిటీలో మాకు పాఠాలు చెప్పాల్సిన ప్రొఫెసర్లు పాలిటిక్స్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించడం హాస్యాస్పదమన్నారు. కొంతమంది ప్రొఫెసర్లు టాసా అనే పేరు మీద ప్రతిరోజు యూనివర్సిటీ అధికారులను కలుస్తూ వర్సిటీ పరిపాలన సక్రమంగా జరగకుండా అడ్డుపడడం బాధాకరణమన్నారు. ప్రొఫెసర్లు తమ పర్సనల్ ఎజెండా కోసం వర్సిటీ అధికారులపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీలలో పనిచేసే ప్రొఫెసర్ల పదవి విరమణ 60 నుండి 65లకు పెంపు అనేది కేవలం ట్రెడిషనల్ యూనివర్సిటీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేస్తూ జీవో విడుదల చేసిందని అందులోనే టెక్నికల్ వర్సిటీలైనా అగ్రికల్చరల్, హార్టికల్చర్ వెటర్నరీ యూనివర్సిటీ లకు వర్తించదనీ స్పష్టం చేసిన కూడా ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఇటు వర్సిటీని అటూ ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ దొడ్డిదారిలో పదవి విరమణ వయసు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పి జి, పి హెచ్ డి లు చేసి దాదాపు 35 నుండి 49 సంవత్సరాల వయసు పైబడిన మాకు ఉద్యోగాలు రాకుండా నోటిఫికేషన్లు వేయకుండా ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తూ వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల రిక్రూట్మెంట్ జరగకుండా అడ్డుకుకోవడం అన్యాయమన్నారు. రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు వర్సిటీ వీసీ జానయ్య రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం చేపట్టగా ఆది సక్సెస్ కావడంలో వర్సిటీ శాస్త్రవేత్తలతో పాటు విద్యార్థుల పాత్ర కూడా ఉందని మమ్మల్ని అభినందిస్తూ మా సేవలను గుర్తిస్తూ గత 14 సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న స్టైఫండ్‌ను పెంచుతూ వర్సిటీ తీసుకున్న నిర్ణయం ప్రొఫెసర్లకు నచ్చకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా టాసా అనే పేరు మీద వర్సిటీలో రాజకీయాలు చేస్తే వారికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందంటూ విద్యార్థులు హెచ్చరించారు. విద్యార్థి నాయకులు రాజ్ కుమార్, కవి రాజు, శంకర్ నాయక్, లోకేష్, శ్రావణి, నవ్య, ప్రసాద్, మునీర్, భాను తదితరులు పాల్గొన్నారు.

పిత్తాశయ కోలాంగైటిస్ రోగులకు సరోగ్లిటజర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పిత్తాశయ కోలాంగైటిస్ (పిబిసి) ఉన్న వయోజన రోగుల చికిత్స కోసం సరోగ్లిటజర్ ఉపయోక్తమవుతుందని జైడస్ లైఫ్సైన్సెస్ చైర్మన్ పంకజ్ పటేల్ తెలిపారు. ఈ మేరకు జరిపిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైనట్టు చెప్పారు. ప్రాథమిక పిత్తాశయ కోలాంగైటిస్ (పిబిసి) ప్రాథమిక బిలియరీ కోలాంగైటిస్ (పిబిసి) అనేది అరుదైన, ప్రగతిశీల ఆటో ఇమ్యూన్ వ్యాధి అని, ఇది క్రమంగా పిత్త వాహికలను నాశనం చేస్తుందన్నారు. దీని ఫలితంగా కాలేయంలో పిత్తం పేరుకుపోతుంది, దీని ఫలితంగా ఫైబ్రోసిస్, సిరోసిస్, కాలేయ మార్పిడి చేసుకోవాల్సి వస్తుందని, లేదంటే రోగి మరణిస్తారని చెప్పారు. ప్లేసిబోతో పోలిస్తే రోగుల శాతంలో గణాంకపరంగా ముఖ్యమైన చికిత్స వ్యత్యాసం సరోగ్లిటజార్‌తో వైద్యపరంగా అర్థవంతమైన జీవరసాయన ప్రతిస్పందనను సాధించిందన్నారు. సరోగ్లిటజర్ సాధారణంగా బాగా తట్టుకోగలదు. మొత్తం ప్రతికూల సంఘటనలు సాధారణంగా సరోగ్లిటజర్ చికిత్స ప్లేసిబో చికిత్స రోగుల మధ్య సమతుల్యమవుతాయన్నారు. జైడస్ థెరప్యూటిక్స్, యుఎస్ ఆధారిత ఇన్నోవేషన్ ఫోకస్డ్ స్పెషాలిటీ ఆర్మ్ ఆఫ్ జిడస్ లైఫ్సైన్సెస్ లిమిటెడ్, 2026 మొదటి త్రైమాసికంలో సరోగ్లిటజార్ కోసం యు.ఎస్. రెగ్యులేటరీ దరఖాస్తును సమర్పించాలని భావిస్తోందన్నారు. ప్లేసిబోతో చికిత్స పొందిన వారితో పోలిస్తే సరోగ్లిటజర్ 1 ఎపిక్స్ 3 ఫలితాలు దీర్ఘకాలిక కాలేయ వ్యాధికి చికిత్సలను అభివృద్ధి చేయడానికి తమ నిబద్ధతను బలోపేతం చేస్తాయన్నారు. ఇది అధిక అన్‌మెట్ వైద్య అవసరం మరియు పెరుగుతున్న ప్రపంచ ప్రభావం పిబిసి ఉన్న రోగులలో సానుకూల దశ 3 డేటాను ప్రదర్శించిన మొట్టమొదటి పిపిఆర్ ఆల్ఫా/గామా అగోనిస్ట్ సరోగ్లిటాజర్ రోగులకు మరియు వారి ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు నిజమైన విలువను తీసుకువచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ పరిశోధనా చికిత్స సామర్థ్యం గురించి, ఈ ఫలితాలను రెగ్యులేటరీ ఏజెన్సీలతో చర్చించాలని 2026 మొదటి త్రైమాసికంలో యు.ఎస్. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్కు రెగ్యులేటరీ సమర్పణతో ముందుకు సాగాలని అనుకుంటున్నాము అని చెప్పారు. కొత్త చికిత్సలతో చికిత్సా ఎంపికలను విస్తరించడం వలన మొదటి వరుస చికిత్సకు స్పందించని పిబిసి ఉన్న వ్యక్తుల సంరక్షణను రోగులు, వారి కుటుంబాలు పరిశోధకులకు టాము కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర-దుండిగల్: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మేడ్చల్ జిల్లా ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దుండిగల్ మున్సిపాలిటీ పరిధి ఎమ్ ఎల్ ఆర్ ఐ టి కళాశాల నందు నూతన అథ్లెటిక్,బాస్కెట్ బాల్,ఫుట్ బాల్ కోర్ట్ ను ప్రారంభించారు.అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం అంటే భారత గడ్డమీద పుట్టిన హాకీ ఒంటి చేత్తో గెలిపించిన భారత మాత ముద్దు బిడ్డ విష్వ విజేత ధ్యాన్ చంద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటమని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడ లేని యువ సంపద కేవలం భారతదేశానికి మాత్రమే ఉన్నదని, యువత వ్యాసనాలకు దూరంగా ఉంటూ వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని అన్ని క్రీడల్లో రానించి దేశానికి గొప్ప పేరు తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం దేశానికి ఒక గొప్ప నాయకులు నరేంద్ర మోడీ అని,దేశాన్ని వృద్ధిలో 11వ స్తానం నుండి నాల్గవ స్థానానికి తీసుకువచ్చారు.త్వరలో మొదటి స్థానానికి వచ్చే రోజు త్వరలో ఉంది దానికి ప్రతి ఒక్కరు ముఖ్యంగా యువకులు మేకిన్ ఇండియా లో భాగంగా దేశంలో నైపుణ్యంతో నూతన నిర్మాణానికి నాంది పలికి, స్వదేశీ వస్తువులు ప్రోత్సహించాలని వ్యక్తం చేశారు. ఎమ్ ఎల్ ఆర్ ఐ టి చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, మల్కాజ్గిరి ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు డా ఎస్ మల్లారెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి విగ్నేశ్వర్ చారీ, ఉపాధ్యక్షురాలు బౌరంపేట్ మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు సెన్సార్ బోర్డు మెంబెర్ దాసరిశ్యామ్‌రావ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పురోగమన విద్యా కార్యక్రమం ప్రారంభించిన సుమధుర ఫౌండేషన్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : సుమధుర గ్రూప్ కార్పొరేట్ సామాజిక బాధ్యతల, విభాగమైన సుమధుర ఫౌండేషన్, తమ ప్రతిష్టాత్మక విద్యా కార్యక్రమం సుమధుర నిర్మాణ శత శతమ్ అనే కార్యక్రమంను ప్రారంభించింది. ఇది తెలంగాణలో వేలాది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమానమైన విద్యా అవకాశాలు కల్పించి, విద్యా నాణ్యతను పెంచే లక్ష్యంతో రూపొందించ బడింది. వందేమాతరం ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖతో కలిసి అమలు చేయబడుతున్న ఈ ప్రాజెక్ట్, ప్రభుత్వ పాఠశాలల హైస్కూల్ విద్యార్థులకు విస్తృతమైన విద్యా అవకాశాలు కల్పించి, విద్యా, వృత్తి విజయాలకు స్పష్టమైన మార్గాన్ని చూపుతుంది. సుమధుర నిర్మాణ శత శతమ్ కార్యక్రమం తెలంగాణలోని 12 జిల్లాల్లోని 25 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు కానుంది. ఇది 7,000కి పైగా విద్యార్థులను చేరుకోనుంది. 100% ఉత్తీర్ణత రేటు సాధించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశలో ఒక సంవత్సరం పాటు అమలవుతుంది. దీర్ఘకాలిక దృక్పథంలో, ఇది 10 సంవత్సరాల వరకు కొనసాగి, విద్యార్థులపై స్థిరమైన ప్రభావం చూపుతుంది. 12 జిల్లాలు యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, జనగాం, సిద్దిపేట, సూర్యాపేట, నల్గొండ, వరంగల్, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, హనుమకొండ, పెద్దపల్లి, కరీంనగర్. ఈ కార్యక్రమాన్ని ఈరోజు రంగారెడ్డి జిల్లా తిరుమలగిరిలోని జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. విద్యా సహాయం, స్కాలర్‌షిప్ అవకాశాలు, కెరీర్ మార్గదర్శకతలను సమన్వ యం చేస్తుంది. వాలంటీర్ల సహాయంతో విద్యార్థులు నాణ్యమైన అధ్యయన పాఠ్యాలు, పరీక్షా సన్నాహక మార్గదర్శకాలు, పొందుతారు. ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రముఖ విద్యాసంస్థల్లో చదివే అవకాశం కల్పించేందుకు సుమధుర ఫౌండేషన, వందేమాతరం ఫౌండేషన్ స్కాలర్‌షిప్ అవకాశాలను కల్పిస్తాయి. త్వరలో సుమధుర స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్, అర్హులైన విద్యార్థులకు ఉన్నత విద్యలో మరింత సహకారం అందిస్తుంది. అదనంగా, పీర్-టు-పీర్ లెర్నింగ్, సహకార విద్యా కార్యకలాపాలు, నిరంతర పర్యవేక్షణ ద్వారా కార్యక్రమం విజయవంతం అయ్యేలా చేస్తారు. కార్యక్రమం ప్రారంభ సందర్భంగా, సుమధుర గ్రూప్‌లో ఏవీపీ - సిఎస్ఆర్, సస్టైనబిలిటీ జీవన కలకుంట్ల మాట్లాడుతూ "నాణ్యమైన విద్యే ప్రగతిశీల సమాజానికి పునాది. గ్రామీణ ప్రాంతాల్లో వనరులు తక్కువగా ఉన్న సందర్భంలో, విద్యా సహాయం మరింత అవసరం. 'సుమధుర నిర్మాణ శత శతమ్' ద్వారా, విద్యార్థులు ఏ నేపథ్యం నుండి వచ్చినా, వారికి నేర్చుకునే, ఎదిగే, పెద్ద కలలు కనగల అవకాశం లభించాలనేది మా లక్ష్యం. విక్సిత్ భారత్ దృష్టిలో, నేటి తరగతి గదుల్లోనే రేపటి భారత భవిష్యత్తు రూపుదిద్దుకుంటోంది. ప్రతి విద్యార్థి గుర్తింపునకు, మద్దతుకు ప్రదర్శించే అవకాశానికి అర్హుడు అన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభించిన ఎంపీ ఈటెల

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో మహితా ఎన్‌జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను (04) చోట్ల (లక్ష్మి నగర్ పార్క్, ద్వారకా నగర్ పార్క్, శివ దుర్గా పార్క్, చిన్న (క్రాంతి కాలనీ) పార్క్ లలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను శుక్రవారం పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, బోడుప్పల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు భూక్యా సుమన్, శేఖర్ రెడ్డి, బొమ్మకు కళ్యాణ్, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ స్టాఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో మరిన్ని పార్కులు, జిమ్‌లు, ఆరోగ్య వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మేయర్ మాట్లాడుతూ యువత, మహిళలు, వృద్ధులు అందరూ వినియోగించుకునే విధంగా ఈ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు కావడం అభినందనీయమని అన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందం వ్యక్తం చేశారు.

గణేష్ ఉత్సవ వేడుకలకు కొలనుకు ఆహ్వానం

విశాలాంధ్ర-దుండిగల్: శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధికి చెందిన పలువురు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు గణేష్ ఉత్సవాల కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ కమిటీల సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సమాజానికి విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ కృషి అభినందనయం

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : గత పది సంవత్సరాలుగా విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ విశ్వబ్రాహ్మణ సమాజం కోసం దేశవ్యాప్తంగా కృషి చేస్తోందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఈ సెప్టెంబర్ 17వ తేదీ నుండి నవంబర్ 20 వరకు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వరకు చేపడుతున్న 1500 కిలోమీటర్ల పాదయాత్ర పోస్టర్ ను శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, ఉత్తర ప్రదేశ్ మాజీ విద్యాశాఖామంత్రి రామ్ ఆశ్రే విశ్వకర్మ చేతుల మీద ఆవిష్కరించారు. ఇటీవల టాంక్ బండ్ నుండి శ్రీశైలం వరకు బైక్ యాత్ర, ఎల్.బి.నగర్ నుండి కడప జిల్లా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి మఠం వరకు 500 కిలోమీటర్ల పాదయాత్ర విశ్వనాధుల పుష్పగిరి నిర్వహించడం అభినందనీయం అన్నారు. గ్రామ గ్రామాన విశ్వబ్రాహ్మణుల్ని చైతన్యం చేసేందుకు విశ్వనాథుల పుష్పగిరి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. రెండవ విడతలో బాగంగా 1500 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టనున్న పుష్పగిరికి విశ్వబ్రాహ్మణులు వెంట నిలవాలని తెలిపారు. బసవోజు దేవేంద్రాచారి, విశ్వనాథ్ ఆచారి, వడ్ల సుమంత్ ఆచారి, రాజశేఖర్, బండారు విజయ్ చారి నవీన్ ఆచారి, రఘువీర్ ప్రతాప్, సుదర్శనాచారి, గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రామాచారి, కూరెళ్ళ శివరామ్ ఆచారి, ప్రవీణ్ కుమార్, త్రినాథ్ చారి, పట్నాల సావిత్రి, ఆర్.వి.లక్ష్మీ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - మొయినాబాద్: మండలంలోని గురుకుల పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాలతి మాట్లాడుతూ.. తెలుగు భాష ఔన్నత్యం, ప్రశస్తి, తెలుగు సాహిత్యాన్ని వ్యవహారిక భాషలో రాయడానికి గిడుగు రామ్మూర్తి విశేష కృషి చేసినట్లు కొనియాడారు. అలాగే భారతదేశం తరఫున వరుసగా 3 ఒలింపిక్ క్రీడల్లో బంగారు పతకాలు సాధించి పెట్టి, భారత హాకీ స్వర్ణ యుగానికి ధ్యాన్ చంద్ నాంది పలికారన్నారు. మహనీయుల కృషి, పట్టుదలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులంతా ధ్యాన్ చంద్‌ని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో తద్వారా జీవితంలో ఉన్నత స్థాయిని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీలకు అన్యాయం చేసే రోస్టర్ విధానాన్ని సవరించాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీలలోని 58 ఉప కులాలకు అన్యాయం చేసే రోస్టర్ విధానం వల్ల జరుగుతున్న నష్టాన్ని వెంటనే సవరించి, 40 లక్షల మంది మాలలకు అన్యాయం చేసే ప్రవేశపెట్టిన 99 జీవోను వెంటనే రద్దు చేసి, ఎస్సీలోని గ్రూప్-3 కి రోస్టర్ 22ను వెంటనే మార్చాలని తెలంగాణ రాష్ట్రం మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గౌరవాధ్యక్షులు చెరుకు రామచందర్, ఉపాధ్యక్షులు పి.వి.వీరస్వామి, వర్కింగ్ చైర్మన్ మంత్రి నర్సింహ, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాల కిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు గైడ్ లైన్స్‌కు వ్యతిరేకంగా మేదావులతో కానీ, న్యాయ నిపుణులతో కానీ చర్చించకుండా ఏకపక్షంగా ఐదు నెలల క్రితం షమీం అక్తర్ రిపోర్టు ద్వారా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వర్గీకరణ శాస్త్రీయంగా జరగలేదని, 58 కులాలకు రిజర్వేషన్లను దూరం చేసిందన్నారు. గ్రూప్-3లో ఉన్న 26 కులాలు, గ్రూప్-1లో ఉన్న 15 కులాలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో తీవ్ర నష్టం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-3లో ఉన్న 26 కులాలు, ఐదవ తరగతి నుండి పీహెచ్ డీ వరకు, యూనివర్సిటీ రిక్రూట్మెంట్ మెంట్లలో, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్ లేకపోవడం వల్ల రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి ఉందన్నారు. ఇదివరకే ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి వివేక్ వెంకటస్వామి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, బిజెపి అధ్యక్షులు రామచందర్ రావు, టిజెఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరాం లకు వినతి పత్రాలతో సీఎంకు తెలియజేయాలని కోరామని తెలిపారు. సుప్రీంకోర్టు రాష్ట్రాలకు ఏమని ఆదేశించింది. వర్గీకరణ చేసిన షమీమ్ అక్తర్ ఏం చెప్పారో సీఎం రేవంత్ రెడ్డి బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ రాష్ట్ర నాయకులు డా.బి.వీరస్వామి, మాదాసు రాహుల్‌రావు, నామా సైదులు, కొప్పుల అర్జున్, షేక్ పేట సత్యనారాయణ, బిఎస్ఎన్ఎల్ బాలకృష్ణ, గోపి సత్యనారాయణ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కల్లు గీతవృత్తిలో నిమగ్నమై వృత్తి నిర్వాహణలో భాగంగా చెట్ల పై నుంచి పడి మరణించిన గీత వృత్తిదారుల కుటుంబాలకు, గాయపడిన వారికి సుమారు 700 మంది కుటుంబాలకు సుమారు 13 కోట్ల ఎక్స్‌గ్రేషియో సాంక్షన్ అయ్యాయని, సంవత్సరం గడిచినప్పటికీ నేటి వరకు ఎక్స్‌గ్రేషియో అందించకపోవడం గర్హనీయమని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. తక్షణమే స్పందించి 13 కోట్ల ఎక్స్‌గ్రేషియో విడుదల చేయాలని వారు తెలిపారు. మరణించిన కుటుంబాలకు ఐదు లక్షల నుండి 10 లక్షలకు ఎక్స్‌గ్రేషియో పెంచాలని అన్నారు. అర్హులైన కాటమయ్య కిట్లను తక్షణమే అందించి గీత కార్మికులకు శిక్షణనిచ్చి ప్రమాదాల నుండి కాపాడుటకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మధ్యప్రదేశ్‌లో సీపీఐ భారీ ర్యాలీ

గ్వాలియర్ (మధ్యప్రదేశ్): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మధ్యప్రదేశ్ 21వ రాష్ట్ర మహాసభల ప్రారం భాన్ని పురస్కరించుకుని శుక్రవారం గ్వాలియర్ జిల్లాలోని దబ్రా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు డా. కే నారాయణ, గిరీష్ చంద్ర శర్మ, రాష్ట్ర కార్యదర్శి అరవింద్ శ్రీవాస్తవ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు హరిద్వార్ సింగ్, శైలేంద్ర శైలి, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజర య్యారు. ర్యాలీ సందర్భంగా పట్టణంలోని కూడళ్లను పార్టీ జెండాలతో అలంకరించారు. సీపీఐ కార్యకర్తలు పార్టీ జెండాలను చేతబట్టి ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ, ఓటు హక్కు కోసం పోరాడదాం

‘ఓటర్ అధికార్ యాత్ర’లో అనీరాజా

బెట్టియా (బీహార్): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ బీహార్‌లో ‘ఓట్ చోర్- గద్దీ ఛోడ్’ అనే నినాదంతో చేపట్టిన ‘ఓటర్ అధికార్ యాత్ర’కు అడుగడుగునా ప్రజలనుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఈ యాత్ర శుక్రవారం వెస్ట్ చంపారన్ జిల్లా కేంద్రం బెట్టియాకు చేరుకుంది. సీపీఐ జాతీయ సమితి సభ్యులు అనీ రాజా... రాహుల్ గాంధీ, బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్షనేత తేజస్వీ యాదవ్, వీఐపీ నాయకుడు ముకేశ్ సహానీ, కాంగ్రెస్ బీహార్ అధ్యక్షుడు రాజేష్ రామ్‌లతో కలిసి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనీరాజా మాట్లాడుతూ... ఈ యాత్ర రాజ్యాంగాన్ని రక్షించడానికి, ఓటు హక్కును కాపాడుకోవడానికి, మన ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కడానికి ప్రయత్నిస్తున్న నిరంకుశ శక్తులను ప్రతిఘటించడానికి ఒక పోరాటమని పేర్కొన్నారు. ఈ యాత్ర ద్వారా ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులను కాపాడాలనే పిలుపును ముందుకు తీసుకువెళుతున్నామ న్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ఎన్నికల సంఘం తీరును తప్పుబడుతూ రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈనెల 17న ప్రారంభమైన యాత్ర.. 16 రోజుల పాటు 1,300కి.మీ మేర సాగనుంది. వచ్చే నెల 1న పట్నాలో నిర్వహించే భారీ సభతో ముగుస్తుంది.

హైదరాబాద్‌లో సురవరం సుధాకరరెడ్డి సతీమణి విజయలక్ష్మిని పరామర్శిస్తున్న సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ దంపతులు

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాయితీ బకాయిలు విడుదల చేయాలి

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారికి రాయితీ బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు శుక్రవారం ఆయన ఒక లేఖ రాశారు. నాలుగేళ్లుగా రాయితీల విషయంలో తీవ్ర జాప్యం జరగడం వల్ల అనేక పరిశ్రమలు మూసివేత దశలోకి వెళ్లిపోయి, వందలాది మంది తొలితరం పారిశ్రామిక వేత్తలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని వివరించారు. పారిశ్రామిక వేత్తల బ్యాంకు ఖాతాలు ఎన్‌పీఏలుగా మారాయని, వేలాది మంది ఉపాధి కోల్పోయారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినప్పటికీ వారికి రాయితీల సొమ్ము విడుదల కాలేదన్నారు. ప్రోత్సాహకాల కింద మొత్తం పరిశ్రమలకు రూ.15 వేల కోట్ల వరకు రాయితీ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, అందులో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు దాదాపు రూ.1,200 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. గత ఏడాదిగా ప్రతి నెలా 15వ తేదీకల్లా రాయితీ సొమ్ము విడుదల చేస్తామని చెబుతున్నారేగానీ ఇప్పటివరకు ఒక్క రూపాయి విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వివరించారు. దీంతో పరిశ్రమలు నడపడం వారికి తీవ్ర కష్టతరమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు రాయితీ బకాయిలను వెంటనే చెల్లించి ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐఏఎస్ శ్రీలక్ష్మికి సుప్రీంలో ఊరట

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో ఆమె పేరును తొలగిస్తూ గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. దీనిపై శు క్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చింది. దీనిపై మరోసారి వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టుకు సూచించింది. ఇదే సమయంలో ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

పెద్దారెడ్డికి...

వైసీపీ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి కూడా సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. తాడిపత్రి నియోజకవర్గంలోకి నిరభ్యంతరంగా వెళ్లొచ్చని కోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. ఈక్రమంలో ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలపై స్టే విధించింది. తాడిపత్రిలోకి తనను అనుమతించడం లేదంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తన సొంత నియోజకవర్గంలోకి అనుమతించకుండా టీడీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందంటూ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారించిన సర్వోన్నత న్యాయస్థానం గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ... తాడిపత్రి వెళ్లేందుకు పెద్దారెడ్డికి అవసరమైన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఒకవేళ అవసరమైతే ప్రైవేట్ సెక్యూరిటీ కూడా పెట్టుకోవచ్చని పెద్దారెడ్డికి కోర్టు సూచించింది. ఈ క్రమంలో పోలీసు సెక్యూరిటీకి అవసరమైన ఖర్చు భరించేందుకు పెద్దారెడ్డి తరపు న్యాయవాదులు అంగీకరించారు. ఆయన గత 14 నెలలుగా తాడిపత్రి నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు.

పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం

- ‘భోగాపురం’తో ఉత్తరాంధ్ర అనుహ్య అభివృద్ధి
- ‘మిత్తల్’... ‘గూగుల్’ రాకతో మారనున్న రూపురేఖలు: మంత్రి లోకేశ్



విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబు ‘విజనరీ’ నాయకత్వం వల్లే ఆర్సెలర్స్ మిత్తల్, గూగుల్ వంటి గ్లోబల్ కంపెనీలు రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ‘భారతదేశ ఏరోస్పేస్ తయారీ, ఎంఆర్‌ఓ రంగాల వేగవంతం’ అనే అంశంపై భారత విమానయాన మంత్రిత్వశాఖ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ , సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మ్యానుఫాక్చరర్స్ సంయుక్త అధ్వర్యంలో స్థానిక నోవా టెల్ హోటల్‌లో శుక్రవారం సదస్సు జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లోకేశ్ మాట్లాడుతూ... నాడు చంద్రబాబు ... హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో విమానాశ్రయం నిర్మించడం వల్ల ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర జీడీపీలో 11శాతం దాని వల్లే ఆదాయం సమకూరుతోందన్నారు. ఇప్పుడు అదే విజనరీతో మనకు భోగాపురం విమానాశ్రయం రాబోతోందన్నారు. దీనిద్వారా ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయన్నారు. సుందరమైన విశాఖనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టమ్ అందుబాటులో ఉందన్నారు. విజన్ -2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రతిఏటా 15శాతం వృద్ధిరేటు సాధించాల్సి ఉందన్నారు. సమర్థ నాయకత్వంలో ఏపీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుతుందని స్పష్టం చేశారు. అక్టోబరులో మిత్తల్ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. ఆసియాలోనే అతిపెద్దదైన గూగుల్ డేటా సెంటర్ రాబోతోందనీ, పునరుత్పాదక ఇంధన రంగంలో వేగంగా అడుగులు వేస్తున్నామన్నారు. దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టును రెన్యూ సంస్థ రాయలసీమలో పనులు ప్రారంభించిందని వివరించారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ... ఏపీలో పెట్టుబడులు పెట్టే ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలకు సులభతరమైన అనుమతుల కోసం విధానపరమైన మార్పులు తెచ్చామన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్, చంద్రబాబు విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సీఐఐ ఏపీ చైర్మన్ గన్నమని మురళీకృష్ణ, ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీ ఏరోస్పేస్ డిఫెన్స్ సలహాదారు సతీశ్ రెడ్డి, జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ సీఈవో కరణ్ బీర్ సింగ్ కల్రా, సీఐఐ డిప్యూటీ డైరెక్టర్ సోనాల్ బెనర్జీ, సయాంట్ ఫౌండర్ చైర్మన్ బివియర్ రెడ్డి పాల్గొన్నారు.

2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, ఈ ప్రయాణంలో చార్టర్డ్ అకౌంటెంట్లు (సీఏ)... కేవలం తోడ్పాటుదారులుగా కాకుండా మార్గదర్శకులుగా నిలవాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. ‘అర్థసమృద్ధి -2025’పై జరిగిన సదస్సులో మంత్రి మాట్లాడుతూ ఏఐ ఆధారిత గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం అని వివరించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. అనంతపురంలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక విద్యుత్, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, ప్రకాశం జిల్లాలో సీబీజీ, గుంటూరు, కృష్ణా జిల్లాలో క్వాంటమ్ వ్యాలీ, గోదావరి జిల్లాల్లో ఆక్వా, ఉత్తరాంధ్రలో ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ పరిశ్రమలకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. సౌకర్యవంతమైన జీవనవిధానానికి ప్రాధాన్యతనిస్తూ ‘మనమిత్ర’ ద్వారా 700 రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నామన్నారు. పరిపాలన వ్యవహారాల్లో ఏఐ వినియోగానికి టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం చేసుకున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న స్నేహపూర్వక మదుపరులు, సులువైన... వేగవంతమైన వ్యాపార విధానాల వల్ల గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రఖ్యాత సంస్థలు విశాఖకు రాబోతున్నాయని వివరించారు. ఐసీఏఐ అంటే కేవలం బ్యాలెన్స్ షీట్లు సరిచూసే సంస్థ మాత్రమే కాదు, సమసమాజాన్ని నిర్మించే ఒక వేదిక. సీఏలు అంటే కేవలం ఖాతాపుస్తకాలను చూసే ఆడిటర్లు మాత్రమే కాదు, బాధ్యత, జవాబుదారీతనానికి ప్రతిరూపం. బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సీఏలది కీలకపాత్ర అని అన్నారు. కేవలం సంపదను పరిరక్షించడమే కాదనీ, దానిని సృష్టించే మార్గాలను అన్వేషించాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఐసీఏఐ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్, సదరన్ రీజియన్ వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, ఐసీఏఐ విశాఖ బ్రాంచి ప్రతినిధులు అందవరపు శ్రీధర్, రామానాయుడు, పట్నాల లోకేశ్, ఉజ్వల, లీలా వరప్రసాద్, గురుమూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత నల్లకన్నుకు అస్వస్థత

చెన్నై: సీపీఐ సీనియర్ నేత ఆర్ నల్లకన్ను అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (ఆర్‌జీజీజీ హెచ్)లో చేర్చి చికిత్సనందిస్తున్నారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఆయన్ను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ఉంచి చికిత్సనందిస్తు న్నారు. వందేళ్ల వయస్సు నల్లకన్నుకు వయసు సంబంధిత సమస్యల కారణంగా ఇన్ఫెక్షన్ వచ్చిందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో సీనియర్ వైద్యుల బృందం ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షి స్తోంది. నల్లకన్ను ఈ నెల 22న తన నివాసంలో పడిపోయి గాయపడటంతో మొదట ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. ఆయనకు శ్వాస తీసుకోవ డంలో ఇబ్బందిగా అనిపించడంతో గురువారం రాత్రి ఆర్‌జీజీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం నల్లకన్ను ఆరోగ్యం స్థిరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. స్వాతంత్ర్య సమరయో ధుడిగా, సీపీఐ సీనియర్ నేతగా నల్లకన్ను అందరికీ సుపరిచితులు. నిజాయితీకి ప్రతి రూపం. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించినా, గళం విప్పినా అది ఆయనకే సొంతం. కనీసం సొంత ఇల్లు కూడా ఆయనకు లేదు. ప్రభుత్వ గృహంలో ఉన్నా, క్రమం తప్పకుండా అద్దె చెల్లించే వారు. నేటికీ తానో కుర్రోడ్ని అన్నట్టుగా చలాకీగా ముందుకు సాగే నల్లకన్ను... గత ఏడాది 100వ వసంతంలోకి అ డుగు పెట్టారు. కాగా నల్లకన్ను సంపూర్ణ ఆరోగ్యంతో అందరి ముందుకు రావాలని ఆకాంక్షిస్తూ తమిళనాడు సీఎం స్టాలిన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రియల్టర్ కిడ్నాప్ కేసులో 14 మందికి జీవిత ఖైదు

అహ్మదాబాద్: సంచలనం సృష్టించిన బిట్‌కాయిన్ స్కామ్, కిడ్నాప్ కేసు (2018)లో అహ్మదాబాద్ సిటీ సెషన్స్ కోర్టులోని ఏసీబీ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీజేపీ మాజీ ఎమ్మెల్యే నళిన్ కోటడియా, అమ్రేలి మాజీ ఎస్పీ, ఐపీఎస్ అధికారి జగదీశ్ పటేల్ సహా 14 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చింది. రాష్ట్ర రాజకీయ, పోలీస్ వ్యవస్థను కుదిపేసిన ఈ కుంభ కోణంలో సూరత్ బిల్డర్ శైలేష్ భట్ కిడ్నాప్, 200 బిట్‌కాయిన్‌లను స్వాధీనం చేసుకోవడం, విడుదల చేసేందుకు రూ.32 కోట్లు డిమాండ్ చేశారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... అప్పటి ఎస్పీ జగదీశ్ పటేల్ నేతృత్వంలోని అమ్రేలి పోలీసు అధికారులు... రాజకీయ ప్రముఖులు, మధ్యవర్తులతో కలిసి గాంధీనగర్ నుంచి బిల్డర్ శైలేష్ భట్‌ను కిడ్నాప్ చేసి ఓ ఫామ్‌హౌస్‌లో బందీగా ఉంచారు. రాష్ట్రం తరపున కేసు వాదించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ మాట్లాడుతూ... ‘ఇది కేవలం స్కామ్ కాదు. రాజకీయాలు, పోలీసులు... అవినీతికి సంబంధించిన సంబంధం’గా పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే నళిన్, జగదీశ్ పటేల్‌తోపాటు అరెస్టయిన 15 మందిలో అప్పటి అమ్రేలి ఎల్‌సీబీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అనంత్ పటేల్, సీబీఐ ఇన్‌స్పెక్టర్ సునీల్ నాయర్, న్యాయవాది కేతన్ పటేల్, వ్యాపారవేత్త కిరిత్ పలాడియా ఉన్నారు. జతిన్ పటేల్ అనే ఒక నిందితుడిని మాత్రమే కోర్టు నిర్దోషిగా విడుదల చేయగా... మిగిలిన వారికి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పు చట్టానికి ఎవరూ అతీతులు కారని నిరూపిస్తోందని... యూనిఫాంలో ఉన్నవారు, ప్రభుత్వ పదవుల్లో ఉన్నవారు కూడా వ్యవస్థీకృత నేరాల్లో పాల్గొని అధికారాన్ని దుర్వినియోగం చేయలేరని సీనియర్ సీఐడీ క్రైమ్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

జస్టిస్ అరాధే, జస్టిస్ పంచోలీ ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ: జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీ శు క్రవారం సుప్రీంకోర్టు జడ్జీలుగా ప్రమాణస్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇద్దరు కొత్త జడ్జీల నియామకంతో కోర్టులో పూర్తిస్థాయి జడ్జీల సంఖ్య తిరిగి 34కి చేరుకుంది. 2025 నవంబర్ 23న సీజేఐ బీఆర్ గవాయ్ పదవీవిరమణ చేసే వరకు సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ విధులు నిర్వహించనుంది. అయితే జస్టిస్ పంచోలీని సుప్రీంకోర్టుకు ఎంపిక చేస్తూ కొలిజీయం తీసుకున్న నిర్ణయంపై సభ్యుల్లో ఒకరైన జస్టిస్ బీవీ నాగరత్న భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. భారత హైకోర్టు జడ్జిల సీనియారిటీ జాబితాలో జస్టిస్ పంచోలి 57వ స్థానంలో ఉన్నారని, ఆయనకంటే సీనియర్లుగా ఉన్న కొంతమంది ప్రతిభావం తులైన జడ్జీలు ఉన్నారని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. జస్టిస్ పంచోలికి పదోన్నతి కల్పించాలన్న నిర్ణయం జ్యుడీషియల్ నిర్వహణకు ప్రతికూలంగా ఉందని, ఇది సుప్రీంకోర్టు కొలీజియం విశ్వసనీయతను ప్రమాదంలో పడేస్తుందని అన్నారు. 4:1 మెజారిటీతో కొలీజియం ఆగస్ట్ 25న జస్టిస్ అరాధేతో పాటు జస్టిస్ పంచోలిని సిఫారసు చేసింది. సుప్రీంకోర్టుకు వారి నియామకాన్ని 48 గంటల్లోనే అంటే ఆగస్ట్ 27న ప్రకటించారు. జస్టిస్ పంచోలీ 1968, మే 28న అహ్మదాబాద్‌లో జన్మించారు. 2016 జూన్‌లో గుజరాత్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2023 జులైలో ఆయన పట్నా హైకోర్టుకు బదిలీ కాగా 2025 జులై 21న పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ అరాధే 1964లో జన్మించారు. 2009 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్ అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011 ఫిబ్రవరిలో హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2016లో జమ్మూకశ్మీర్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2018లో మే నుండి ఆగస్ట్ వరకు మూడు నెలల పాటు దాని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. జస్టిస్ అరాధే కర్నాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2022 అక్టోబర్ వరకు దాని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 జులైలో తెలంగాణ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం 2025 జనవరి 21న బాంబే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల జాబితాలో జస్టిస్ అరాధే మూడవ స్థానంలో ఉన్నారు. జస్టిస్ పంచోలి 19వ స్థానంలో ఉన్నారు.

గోదావరికి వరద ఉధృతి

శాంతించిన కృష్ణమ్మ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణమ్మ శాంతించింది. గురువారం ప్రకాశం బ్యారేజీ వద్ద నాలుగున్నర లక్షల క్యూసెక్కులు దాటిన వరద శుక్రవారం నాటికి 3లక్షలకు పడిపోయింది. పులిచింతల దిగువన వాగుల వరద ఉధృతి కూడా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో 2,60,881 లక్షల క్యూసెక్కులు విడుదలవుతుండగా, ప్రకాశం బ్యారేజీ వద్ద 3,08,838 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరోపక్క గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. ధవళేశ్వరం వద్ద సాయంత్రం 6 గంటలకు ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 7.58 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. శనివారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. వరద ప్రవాహ హెచ్చుతగ్గులను పర్యవేక్షిస్తూ కృష్ణా, గోదావరి పరివాహక జిల్లాల్లోని క్షేత్రస్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేసే సందేశాలు పంపిస్తున్నామన్నారు. వినాయక నిమజ్జన సమయంలో నదీ, కాలువల వద్ద హెచ్చరిక సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వరద నీటిలో ఈత కొట్టడం, స్నానాలు లాంటివి చేయరాదని సూచించారు. శు క్రవారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42.2 అడుగులు ఉందని పేర్కొన్నారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదీ పరివాహక లోతట్టు ప్రాంత గ్రామప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని చెప్పారు. శనివారం శ్రీకాకుళం,విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు.

ఎస్టీ జాబితాలో లంబాడీ, సుగాలీ, బంజారాలు

కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై శు క్రవారం విచారణ జరిగింది. కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చటంపై గతంలో తెలంగాణ హైకోర్టులో తెల్లం వెంకట్రావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ తెల్లం వెంకట్రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లంబాడీ, సుగాలీ, బంజారాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మెరుగైన స్థానంలో ఉన్నారని పిటిషన్‌లో తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల కోయ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

భారత్-జపాన్ మధ్య కీలక ఒప్పందాలు

జపాన్ ప్రధానితో మోదీ చర్చలు

టోక్యో: రెండు రోజుల జపాన్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ టోక్యో చేరుకు న్నారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం జపాన్ ప్రధాని షిగెరు ఇషిబాతో శిఖరాగ్ర చర్చలు జరిపారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో సహా ఇరుదేశాల మధ్య మొత్తం ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించడం ఈ సమావేశం ముఖ్యలక్ష్యమని చెప్పారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య అనేక ఒప్పందాలను ప్రధాని మోదీ, జపాన్ ప్రధాని ఇషిబా కుదుర్చుకున్నారు. అనంతరం ఇద్దరు దేశాధినేతలు సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సువర్ణ అధ్యాయానికి పునాది...

ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. “ఈరోజు మా చర్చలు ఉపయోగకరంగా, ఉద్దేశపూర్వకంగా జరిగాయి. ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు, శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశాల భాగస్వామ్యం రెండు దేశాలకే కాకుండా ప్రపంచ శాంతి, భద్రతకు కూడా అవసరమని మేము అంగీకరిస్తున్నాం. మెరుగైన ప్రపంచాన్ని నిర్మించడంలో బలమైన ప్రజాస్వామ్యాలు సహజ భాగస్వాములు. ఈ రోజు మా ప్రత్యేక వ్యూహాత్మక, ప్రపంచ భాగస్వామ్యంలో సువర్ణ అధ్యాయానికి పునాది వేశాం రాబోయే దశాబ్దానికి మేము ఒక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశాం. మా ప్రణాళికలో పెట్టుబడి, ఆవిష్కరణ, ఆర్థిక భద్రత, పర్యావరణం, సాంకేతికత, ఆరోగ్యం, మొదలైనవి ఉన్నాయి” అన్నారు. రాబోయే 10 ఏళ్లలో భారతదేశంలో జపాన్ నుంచి 10 ట్రిలియన్ యెన్ల పెట్టుబడిని లక్ష్యంగా పెట్టుకున్నామని మోదీ చెప్పారు. చిన్న, మధ్య తరహా సంస్థలు, స్టార్టప్లను అనుసంధానించడంపై ఇరుదేశాల నుంచి ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. అనంతరం జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా మాట్లాడుతూ... ఇండో-పసిఫిక్‌లో నియమాల ఆధారిత క్రమం అవసరమని, భారత్-జపాన్ కలిసి సమస్యలకు పరిష్కారాలను సృష్టించగలవని జపాన్ ప్రధాని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.